www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 23-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 295 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: నవమి సా. 5.38 తదుపరి దశమి; నక్షత్రం: విశాఖ తె. 5.08 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ.8.45-10.32; దుర్ముహూర్తం: ఉ.10.35-11.20, మ.3.03-3.47; అమృతఘడియలు: రా.7.23-9.09; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.01 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● గురువారం 23 జనవరి 2025

అర్జున్, హరికృష్ణకు డ్రా

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ విభాగం ఐదో రౌండ్‌ను తెలుగు గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణ డ్రాగా ముగించారు. సహచర గ్రాండ్‌మాస్టర్ మెన్డోన్కాతో బుధవారం జరిగిన ఐదో రౌండ్‌లో అర్జున్ 30 ఎత్తుల తర్వాత పాయింట్‌ను పంచుకున్నాడు. వీ ఈ (చైనా)తో జరిగిన గేమ్‌ను హరికృష్ణ 22 ఎత్తుల్లో డ్రా చేసుకున్నాడు. చాలెంజర్స్ విభాగంలో ఫ్రెడ్రిక్ (జర్మనీ)తో ఐదో రౌండ్‌ను వైశాలీ డ్రా చేసుకుంది.

కళ్లన్నీ రోహిత్‌పైనే

● బరిలో పంత్, జడేజా, గిల్, జైస్వాల్

● నేటి నుంచి రెండో విడత రంజీ



న్యూఢిల్లీ: రంజీ ట్రోఫీ రెండో విడత మ్యాచ్‌లు స్టార్ ప్లేయర్లతో కళకళలాడనున్నాయి. దాదాపు దశాబ్దం తర్వాత రోహిత్ శర్మ ముంబై తరఫున బరిలోకి దిగుతుండగా.. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కూడా ఆడుతున్నాడు. గురువారం నుంచి జరిగే మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్‌తో ముంబై తలపడనుంది. ఢిల్లీ జట్టులో రిషబ్ పంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా.. సౌరాష్ట్ర తరఫున జడేజా, పంజాబ్ తరఫున శుభ్‌మన్ గిల్ ఆడనున్నారు. అయితే, మెడ నొప్పితో బాధపడుతున్న కోహ్లీ.. ఈ నెల 30 నుంచి జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. హిమాచల్‌ప్రదేశ్‌తో తలపడే హైదరాబాద్ జట్టులో సిరాజ్ కూడా ఆడనున్నాడు. మరో మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు పుదుచ్చేరితో తలపడనుంది.

అభిషేక్ తుఫాన్

● వరుణ్ మాయాజాలం
● భారత్ అదిరే బోణీ
● తొలి టీ20లో ఇంగ్లండ్ చిత్తు
● బట్లర్ అర్ధ శతకం వృథా



అభిషేక్ శర్మ (34 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 79)

కోల్‌కతా: అభిషేక్ శర్మ (34 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సలతో 79) దుమ్మురేపే అర్ధ శతకంతోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి (3/23) తిప్పేయడంతో.. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను టీమిండియా ఘనంగా ఆరంభించింది. బుధవారం జరిగిన తొలి టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 132 పరుగులకు కుప్పకూలింది. జోస్ బట్లర్ (44 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సలతో 68) ఒంటరి పోరాటం చేశాడు. అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో భారత్ 12.5 ఓవర్లలో 133/3 స్కోరు చేసి గెలిచింది. సంజూ శాంసన్ (26), తిలక్ వర్మ (19 నాటౌట్) సత్తాచాటారు. రెండో టీ20 శనివారం చెన్నైలో జరగనుంది.

బాదుడే.. బాదుడు..

ఛేదనలో ఓపెనర్ అభిషేక్ వీరవిహారంతో.. భారత్ సులువుగా నెగ్గింది. ఎడాపెడా షాట్లతో శర్మ విరుచుకుపడడంతో ఇంగ్లండ్ బౌలర్లకు దిక్కుతోచలేదు. శాంసన్‌తో కలసి తొలి వికెట్‌కు 41 పరుగులు జోడించిన అభిషేక్.. తిలక్ వర్మతో మూడో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో టీమిండియా మరో 43 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. ఛేదనను భారత్ ధాటిగానే ఆరంభించింది. రెండో ఓవర్‌లో అట్కిన్సన్ బౌలింగ్‌లో శాంసన్ 4,4,6,4,4తో ఏకంగా 22 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో అభిషేక్ 4,6తో జోరు చూపాడు. అయితే, శాంసన్, కెప్టెన్ సూర్యకుమార్ (0)ను ఆర్చర్ అవుట్ చేసి ఝలక్ ఇచ్చాడు. కానీ, తిలక్ సహకారంతో అభిషేక్ చెలరేగి పోయాడు. ఆరో ఓవర్‌లో అభిషేక్ రెండు సిక్స్‌లు, బౌండ్రీ బాదడంతో.. భారత్ 63/2తో పవర్‌ప్లేను ముగించింది. రషీద్ బౌలింగ్‌లో బతికిపోయిన అభిషేక్ 4,6,6తో 16 పరుగులు పిండుకొన్నాడు. ఇదే జోరులో మరో సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. దీంతో 10 ఓవర్లకు భారత్ 100/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఇక, విజయానికి 8 పరుగుల దూరంలో ఉండగా.. అభిషేక్‌ను రషీద్ అవుట్ చేశాడు. కానీ, తిలక్ బౌండ్రీతో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు.

స్పిన్ ఉచ్చులో చిక్కి...



వరుణ్ చక్రవర్తి (3/23)

మిస్టరీ స్పిన్నర్ వరుణ్ మాయాజాలంతో.. ఇంగ్లండ్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ బట్లర్ మినహా మిగతా బ్యాటర్లు కనీస పోరాటాన్ని కనబర్చలేక పోయారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆదిలోనే తడబడింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (0), బెన్ డకెట్ (4)ను అవుట్ చేసిన అర్ష్‌దీప్.. పవర్‌ప్లేలోనే ప్రత్యర్థికి షాకిచ్చాడు. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన బట్లర్.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. బ్రూక్ (17)తో కలసి మూడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, మధ్య ఓవర్లలో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేస్తూ పరుగులను కట్టడి చేశారు. ఎనిమిదో ఓవర్‌లో బ్రూక్, లివింగ్‌స్టోన్ (0)ను అవుట్ చేసిన చక్రవర్తి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బకొట్టాడు. దీంతో 10 ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లండ్ 74/4తో ఒత్తిడిలో పడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా ధాటిగా ఆడుతున్న బట్లర్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. జాకబ్ బెథెల్ (7)ను పాండ్యా పెవిలియన్ చేర్చాడు. ఓవర్టన్ (2), అట్కిన్సన్ (2)ను అక్షర్ వరుస ఓవర్లలో వెనక్కి పంపాడు. అయితే, 17వ ఓవర్‌లో చక్రవర్తి బౌలింగ్‌లో సిక్స్ బాదిన బట్లర్.. ఆ తర్వాతి బంతికి క్యాచవుట్ కావడంతో డెత్ ఓవర్లలో ఇంగ్లండ్ మరింత డీలాపడింది. ఆర్చర్ (12), రషీద్ (8 నాటౌట్) తొమ్మిదో వికెట్‌కు 21 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో..ఇంగ్లండ్ కష్టంగా 130 మార్క్ దాటింది.

స్కోరు బోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (సి) శాంసన్ (బి) అర్ష్‌దీప్ 0, డకెట్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 4, బట్లర్ (సి) నితీశ్ (బి) వరుణ్ 68, బ్రూక్ (బి) వరుణ్ 17, లివింగ్‌స్టోన్ (బి) వరుణ్ 0, బెథల్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 7, ఓవర్టన్ (సి) నితీశ్ (బి) అక్షర్ 2, అట్కిన్సన్ (స్టంప్డ్) శాంసన్ (బి) అక్షర్ 2, ఆర్చర్ (సి) సూర్య (బి) హార్దిక్ 12, రషీద్ (నాటౌట్) 8, మార్క్ ఉడ్ (రనౌట్/శాంసన్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 132 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-17, 3-65, 4-65, 5-83, 6-95, 7-103, 8-109, 9-130; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-17-2, హార్దిక్ పాండ్యా 4-0-42-2, వరుణ్ 4-0-23-3, అక్షర్ పటేల్ 4-1-22-2, బిష్ణోయ్ 4-0-22-0.

భారత్: శాంసన్ (సి) అట్కిన్సన్ (బి) ఆర్చర్ 26, అభిషేక్ (సి) బ్రూక్ (బి) రషీద్ 79, సూర్య (సి) సాల్ట్ (బి) ఆర్చర్ 0, తిలక్ వర్మ (నాటౌట్) 19, హార్దిక్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 12.5 ఓవర్లలో 133/3; వికెట్ల పతనం:** 1-41, 2-41, 3-125; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-21-2, అట్కిన్సన్ 2-0-38-0, మార్క్ ఉడ్ 2.5-0-25-0, రషీద్ 2-0-27-1, ఓవర్టన్ 1-0-10-0, లివింగ్‌స్టోన్ 1-0-7-0.



1 *టీ20ల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా అర్ష్‌దీప్.. స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌ను వెనక్కునెట్టాడు. 61 మ్యాచ్‌ల్లో అర్ష్‌దీప్ 97 వికెట్లు కూల్చగా.. చాహల్ 80 మ్యాచ్‌ల్లో 96 వికెట్లు తీశాడు. భువనేశ్వర్ (90), బుమ్రా (89), హార్దిక్ (89) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.*

షమి బెంచ్‌కే..

ఏడాది తర్వాత పునరాగమనం చేసిన మహ్మద్ షమికి తుది జట్టులో చోటు దక్కలేదు. దీంతో అతడి ఫిట్‌నెస్‌పై మరోసారి అనుమానాలు రేకెత్తాయి. మ్యాచ్ ముందుకు వరకు నెట్స్‌లో బౌలింగ్ కూడా చేశాడు. కానీ, టాస్ సమయానికి ఫైనల్ లెవన్‌లో షమి లేకపోవడం అందరినీ ఆశ్చర్యపర్చింది. మోకాలికి కట్టు కట్టుకొనే అతడు నెట్ సెషన్స్‌లో పాల్గొన్నాడు. అయితే, మోకాలి వాపు ఇంకా తగ్గలేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎదురులేని స్వియటెక్, సిన్నర్

సెమీస్‌లో ప్రవేశం
ఆస్ట్రేలియన్ ఓపెన్



స్వియటెక్

నేడు మహిళల సెమీఫైనల్
సబలెంకXబడోసా (మ.2)
స్వియటెక్Xకీస్ (మ.3.10)

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్, మహిళల హాట్ ఫేవరెట్ ఇగా స్వియటెక్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్‌కు దూసుకుపోయారు. అలాగే 21వ సీడ్ బెన్ షెల్టన్, 19వ సీడ్ మాడిసన్ కీస్ కూడా సెమీస్‌లోకి అడుగుపెట్టారు. 23 ఏళ్ల పోలెండ్ భామ స్వియటెక్ ఈసారి మెల్‌బోర్న్ పార్క్‌లో తిరుగులేని విజయాలతో దూకుడు ప్రదర్శిస్తోంది. టోర్నీలో ఇప్పటి వరకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం స్వియటెక్ అద్భుత ప్రదర్శనకు అద్దం పడుతుంది. బుధవారం జరిగిన మహిళల క్వార్టర్‌ఫైనల్లో..ఐదు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ స్వియటెక్ 6-1, 6-2తో ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా)ను చిత్తు చేసింది. గురువారం జరిగే సెమీఫైనల్లో 19వ సీడ్ కీస్‌తో స్వియటెక్ అమీతుమీ తేల్చుకుంటుంది.. మరో క్వార్టర్స్‌లో కీస్ (అమెరికా) 3-6, 6-3, 6-4తో 28వ సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్)న్‌పై నెగ్గింది. పురుషుల క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 6-3, 6-2, 6-1తో అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో 21వ సీడ్ షెల్టన్‌ను సిన్నర్ ఎదుర్కొంటాడు. ఇంకో క్వార్టర్‌ఫైనల్లో షెల్టన్ (అమెరికా) 6-4, 7-5, 4-6, 7-6 (4)తో లోరెంజో సొనేగో (ఇటలీ)పై గెలిచాడు. పురుషుల రెండో సెమీఫైనల్లో రెండో సీడ్ జ్వెరేవ్-ఏడో సీడ్ జొకోవిచ్ తలపడతారు.

సింధు, లక్ష్య సారథ్యంలో..

ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: పీవీ సింధు, లక్ష్యసేన్ ఫిబ్రవరి 11 నుంచి చైనాలోని కింగ్దావోలో ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్లకు సారథ్యం వహించనున్నారు. 2023లో జరిగిన టోర్నీలో కాంస్యం నెగ్గిన భారత జట్టు.. ఈసారి 14 మందితో దిగుతోంది. సింగిల్స్‌లో సింధు, మాళవిక, లక్ష్యసేన్, ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్, గాయత్రి/ట్రీసా, అశ్విని/తనీషా, 'మిక్స్‌డ్'లో ధ్రువ్/తనీషా, సతీష్/ఆద్య ఆడనున్నారు.

సింధు ఇంటికి.. సేన్ ముందుకు

జకార్త: ఇండియా ఓపెన్‌లో నిరాశపరిచిన పీవీ సింధుకు ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలోనూ చుక్కెదురైంది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలిరౌండ్లో సింధు 20-22, 12-21తో తుయ్ లిన్ గుయెన్ (వియత్నాం) చేతిలో ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-9, 21-14తో ఒబయాషిపై నెగ్గి రెండో రౌండ్ చేరాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా/ధ్రువ్ కపిల జోడీ 21-18, 21-14తో స్థానిక జంట అద్నాన్/ఇన్‌దాను ఓడించి రెండో రౌండ్ చేరింది.

డ్రెస్ కోడ్‌ను పాటిస్తాం

ఊహాగానాలకు తెరదించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో ఐసీసీ నిబంధనల ప్రకారం డ్రెస్ కోడ్‌ను పాటిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశాడు. టీమిండియా అధికారిక జెర్సీపై ఆతిథ్య పాకిస్థాన్ పేరును భారత బోర్డు వ్యతిరేకిస్తోందన్న ఊహాగానాలను సైకియా కొట్టిపడేశాడు. 'ఐసీసీ నిబంధనల ప్రకారం నడుచుకొంటాం. ఈ విషయంలో అన్ని జట్ల తరహాలోనే క్రీడా స్ఫూర్తిని చాటుతామ'ని సైకియా అన్నాడు. ఇక, పాక్‌లో జరిగే ప్రీ టోర్నమెంట్ కార్యక్రమాల్లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ పాల్గొంటాడా, లేదా? అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ వచ్చేనెల 19 నుంచి హైబ్రిడ్ ఫార్మాట్‌లో జరగనుంది.

పాకిస్థాన్ అవుట్

షాకిచ్చిన ఐర్లాండ్
అండర్-19 టీ20 వరల్డ్ కప్

జొహోర్ (మలేసియా): అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ఐర్లాండ్ జట్టు పాకిస్థాన్‌ను చిత్తుచేసి సూపర్-6కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో 13 పరుగులతో (డ/లూ) పాకిస్థాన్‌ను ఓడించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను మ్యాచ్‌ని 9 ఓవర్లకు కుదించగా, ఐర్లాండ్ 69/5 స్కోరు చేసింది. సవరించిన లక్ష్యం ప్రకారం 9 ఓవర్లలో 73 పరుగులు చేయాల్సిన పాక్.. 59/7 కే పరిమితమై ఓడింది. ఈ గ్రూపు నుంచి ఐర్లాండ్‌తోపాటు ఇంగ్లండ్, అమెరికా సూపర్-6కి క్వాలిఫై అయ్యాయి. మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 8 వికెట్లతో అమెరికాను చిత్తు చేసింది. ఇక గ్రూప్-డిలో ఆస్ట్రేలియా 83 పరుగులతో నేపాల్‌పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 18 పరుగులతో స్కాట్లాండ్‌పై గెలిచింది. ఈ గ్రూప్ నుంచి ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ సూపర్-6కి క్వాలిఫై అయ్యాయి. గ్రూప్-సిలో న్యూజిలాండ్ 67 పరుగులతో సమోవాపై విజయం సాధించింది. అలాగే దక్షిణాఫ్రికా 41 పరుగులతో నైజీరియాపై గెలిచింది. ఈ గ్రూపు నుంచి దక్షిణాఫ్రికా, నైజీరియా, న్యూజిలాండ్ సూపర్-6కి అర్హత సాధించాయి.

నేడు.. భారత్Xశ్రీలంక

గ్రూప్-ఎలో భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను శ్రీలంకతో గురువారం ఆడనుంది. చెరో నాలుగేసి పాయింట్లతో ఉన్నా..మెరుగైన రన్‌రేట్‌తో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఇరు జట్లు ఇప్పటికే సూపర్-6కి క్వాలిఫై అయ్యాయి. ఆఖరి మ్యాచ్ ద్వారా గ్రూపు టాపర్ ఎవరో తేలనుంది. మరో లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్-మలేసియా ఢీకొననున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిస్తే వెస్టిండీస్ కూడా సూపర్-6లోకి ప్రవేశిస్తుంది.

బిజినెస్


రూ. 250తో సిప్!

సెబీ కీలక ప్రతిపాదన



న్యూఢిల్లీ: దేశంలో మ్యూచువల్ ఫండ్ల పరిధిని మరింత విస్తరించడంతో పాటు అల్పాదాయ వర్గాల ప్రజలు కూడా చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పించేలా సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్ల సాచెటైజేషన్‌కు (ఉత్పత్తులు లేదా ఆర్థిక సేవలను అతి స్వల్ప ధరకు అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ) శ్రీకారం చుట్టింది. కేవలం రూ.250 క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్) ద్వారా మ్యూచువల్ ఫండ్ యూనిట్లను కొనుగోలు చేసేందుకు వీలు కల్పించాలని ప్రతిపాదించింది. డెట్, సెక్టార్ ఆధారిత, థీమాటిక్ పథకాలతో పాటు స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఈక్విటీ స్కీమ్ విభాగాలు మినహా ఏదైనా పథకంలో స్మాల్ టికెట్ సిప్‌ను ఆఫర్ చేయవచ్చని సెబీ స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన చర్చా పత్రాన్ని సెబీ బుధవారం విడుదల చేసింది. తమ ప్రతిపాదనలపై వచ్చేనెల 6 నాటికి అభిప్రాయాలు, సూచనలు తెలుపాలని ప్రజలను కోరింది.

ఎన్‌ఎస్‌ఈ @ 11 కోట్ల ఇన్వెస్టర్లు



నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో (ఎన్‌ఎస్‌ఈ) నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 11 కోట్ల మైలురాయిని దాటింది. ఎన్‌ఎస్‌ఈ బుధవారం ఈ విషయం ప్రకటించింది. గడిచిన 5 నెలల్లోనే ఇన్వెస్టర్ల సంఖ్య కోటి మేర పెరిగిందని ఎక్స్ఛేంజ్ తెలిపింది. గత ఐదేళ్లలో 3.6 రెట్లు పెరిగారు. 1994లో కార్యకలాపాలు ప్రారంభించిన ఎన్‌ఎస్‌ఈకి కోటి మంది ఇన్వెస్టర్ల మైలురాయిని చేరుకునేందుకు 14 ఏళ్లు పట్టింది. ఆ తర్వాత ఏడేళ్లలోనే ఇన్వెస్టర్లు 2 కోట్లకు పెరిగారు. ఆ తర్వాత 3.5 ఏళ్లలోనే 3 కోట్లకు, ఆపై ఏడాది కాలంలోనే 4 కోట్లకు చేరారని ఎక్స్ఛేంజ్ వెల్లడించింది. అప్పటి నుంచి ఇన్వెస్టర్ల సంఖ్య 6-7 నెలలకు కోటి చొప్పున పెరుగుతూ వచ్చిందని తెలిపింది.

రికార్డు గరిష్ఠానికి బంగారం

ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములు రూ.82,730కి.. ఒక్కరోజే రూ.630 పెరుగుదల



ఢిల్లీ: దేశీయంగా పసిడి, వెండి ధరలు మరింత పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.630 పెరిగి సరికొత్త జీవన కాల గరిష్ఠ స్థాయి రూ.82,730కి ఎగబాకింది. వెండి కూడా కిలోకు రూ.1,000 పెరుగుదలతో రూ.94,000కు చేరుకుంది. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అనిశ్చితి కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాలకు గిరాకీ మళ్లీ పుంజుకుంది. దేశీయంగా ఆభరణ వర్తకులు, స్టాకిస్టులు కొనగోళ్లు పెంచడం కూడా వీటి ధరల పెరుగుదలకు కారణమయ్యాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 10.20 డాలర్లు పెరిగి 2,769.40 డాలర్ల వద్ద ట్రేడవగా.. వెండి 0.27 శాతం పెరిగి 31.58 డాలర్లు పలికింది. కాగా, 24 క్యారెట్ల బంగారం ధరలో గత రికార్డు 2024 అక్టోబరు 31న రూ.82,400 స్థాయి వద్ద నమోదైంది.

హెరిటేజ్ లాభం రూ.43.1 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్ర జ్యోతి బిజినెస్): మూడో త్రైమాసికానికి హెరిటేజ్ ఫుడ్స్ మంచి ఆర్థి క ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.1,033.9 కోట్ల ఆదాయంపై రూ.43.1 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 10%, నికర లాభం 43% పెరిగాయి. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల పనితీరును పరిగణనలోకి తీసుకు న్నా రూ.3,086.1 కోట్ల ఆదాయంపై రూ.150.1 కోట్ల నికర లాభం నమోదు చేసింది. ముందు ఏడాదితో పోలిస్తే ఈ తొమ్మిది నెలల్లో కంపెనీ ఆదాయం తొమ్మిది శాతం మాత్రమే పెరిగినా నికర లాభం మాత్రం 127 శాతం పెరిగింది.

బీపీసీఎల్ రూ.5 డివిడెండ్

ఆయిల్ రిఫైనింగ్ కంపెనీ బీపీసీఎల్ మూడో త్రైమాసికంలో 36.85% వృద్ధితో రూ.4,649 కోట్ల స్టాండ్ అలోన్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికరలాభం రూ.3,397 కోట్లుంది. అయితే కంపెనీ ఆదాయం మాత్రం 1.86 శాతం క్షీణించి రూ.1,29,946.95 కోట్ల నుంచి రూ.1,27,520.50 కోట్లకు దిగజారింది. వాటాదారులకు కంపెనీ రూ.10 ముఖవిలువ గల ఒక్కో షేరుపై రూ.5 మధ్యంతర డివిడెండు ప్రకటించింది. ఇందుకు అర్హత సాధించేందుకు జనవరి 29 రికార్డు తేదీగా నిర్ణయించింది.

హైదరాబాద్‌లో క్రెడెరా జీసీసీ కేంద్రం

వెయ్యికి పైగా ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆమ్నికామ్ అనుబంధ సంస్థ క్రెడెరా హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) నెలకొల్పింది. భారత్‌లో ఇది తమకు ఆరో జీసీసీ అని కంపెనీ ఆసియా, పసిఫిక్ విభా గం సీఈఓ కెవిన్ మెక్‌డొనాల్డ్ చెప్పారు. ఈ కేంద్రం ద్వారా ఆసియా, పసిఫిక్ ప్రాంత దేశాల్లోని కంపెనీలకు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, మేనేజ్‌మెంట్ సేవలు అందిస్తామన్నారు. దాదాపు 80,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్రస్తుతం వెయ్యిమందికి పైగా మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ నిపుణులు పని చేస్తున్నట్టు క్రెడెరా ఇండియా సీఈఓ గౌరవ్ మాథుర్ చెప్పారు. ముందు ముందు హైదరాబాద్ జీసీసీని మరింత విస్తరించే యోచన ఉందన్నారు. ఫ్రెషర్స్‌కి కూడా తమ సంస్థలో వార్షికంగా రూ.5 లక్షల ప్యాకేజి ఇస్తున్నట్టు తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో స్వల్ప వృద్ధి

న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిసెంబరు త్రైమాసికంలో నికరలాభంలో స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. బ్యాంక్ స్టాండ్ అలోన్ లాభం 2 శాతం పెరిగి రూ.16,373 కోట్ల నుంచి రూ.16,736 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.81,720 కోట్ల నుంచి రూ.87,460 కోట్లకు చేరింది. ఇదే త్రైమాసికంలో బ్యాంకు కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,12,194 కోట్లపై రూ.17,657 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. డిసెంబరు 31 నాటికి నికర ఎన్‌పీఏలు 0.31 శాతం నుంచి 0.46 శాతానికి పెరిగాయి.

హెచ్‌యూఎల్ లాభం రూ.2989 కోట్లు

హిందుస్థాన్ యునీలీవర్ కంపెనీ డిసెంబరు 31వ తేదీతో ముగిసిన మూడో త్రైమాసికంలో 19.18 శాతం వృద్ధితో రూ.2989 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. ప్యూరిట్ వ్యాపార విభాగం విక్రయం లాభాల వృద్ధికి దోహదపడిందని కంపెనీ వెల్లడించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.2508 కోట్ల లాభం ఆర్జించింది. ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.15,781 కోట్ల నుంచి రూ.16,050 కోట్లకు పెరిగింది. త్రైమాసికంలో మొత్తం వ్యయాలు రూ.12,576 కోట్లుగా నమోదయ్యాయి.

అప్‌రైజింగ్ సైన్స్ కొనుగోలు: ప్రీమియం బ్యూటీ బ్రాండ్ మినిమలిస్ట్ యాజమాన్య సంస్థ అప్‌రైజిం గ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 90.5 శాతం వాటాలు కొనుగోలు చేయనున్నట్టు కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ జావా తెలిపారు. రూ.2,955 కోట్ల అంచనా విలువతో రూ.2,670 కోట్ల నగదు చెల్లింపు ప్రాతిపదికన కంపెనీని కొనుగోలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇందుకోసం ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. మరో రెండు సంవత్సరాల కాలంలో మిగతా వాటాలు కూడా కొనుగోలు చేస్తామన్నారు. కాగా ఐస్‌క్రీమ్ వ్యాపారం క్వాలిటీ వాల్స్ (ఇండియా) లిమిటెడ్ డీ మెర్జర్‌కు డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఆయన తెలిపారు.

బడా షేరు కళకళ..

చిన్న స్టాక్స్ విలవిల

మార్కెట్‌లో మిశ్రమ స్పందన.. 567 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

» ఒక శాతానికి పైగా నష్టపోయిన స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు

» రూ.2.18 లక్షల కోట్లు తగ్గిన సంపద



ముంబై: స్టాక్ మార్కెట్లో బుధవారం మిశ్రమ ట్రెండ్ కన్పించింది. సానుకూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో మదుపరులు బ్లూచిప్ ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లకు పాల్పడటంతో సెన్సెక్స్, నిఫ్టీ మళ్లీ లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఒకదశలో 624.77 పాయింట్లు పెరిగి 76,463.13 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 566.63 పాయింట్ల లాభంతో 76,404.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 130.70 పాయింట్ల వృద్ధితో 23,155.35 వద్ద ముగిసింది. ప్రధాన కంపెనీల షేర్లకు డిమాండ్ పెరిగినప్పటికీ చిన్న, మధ్య స్థాయి షేర్లలో మాత్రం అమ్మకాలు కొనసాగాయి. దాంతో బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.56 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం క్షీణించాయి. డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో హైదరాబాద్ కంపెనీ సైయెంట్ డీఎల్ఎం షేరు 14 శాతం మేర క్షీణించి రూ.515.70కి పడిపోయింది. స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లలో అమ్మకాల కారణంగా బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.18 లక్షల కోట్లు తగ్గి రూ.421.88 లక్షల కోట్లకు పడిపోయింది.

● ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 23 పైసలు పెరిగి రూ.86.35 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ కాస్త బలహీనపడటంతోపాటు ప్రధాన ఈక్విటీల్లో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి.

మెరుగైన విధాన నిర్ణయాల కోసం రెండు ద్రవ్యోల్బణ సూచీలు

ఎంపీసీ సభ్యుడు నగేశ్ కుమార్ సూచన

న్యూఢిల్లీ: మరింత మెరుగైన ద్రవ్యపరపతి విధాన నిర్ణయాల కోసం రెండు రకాల ద్రవ్యోల్బణ సూచీలుంటే బాగుటుందని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యుడు నగేశ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఆహార, ఆహారేతర ఉత్పత్తుల ధరలకు వేర్వేరు సూచీలను ఏర్పా టు చేయాలని ఆయన సూచించారు. అప్పుడే, పరపతి విధాన నిర్ణయాల కోసం సంబంధిత ధరల సూచీని మాత్రం పరిగణనలోకి తీసుకోవచ్చన్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే సమయంలో ఆహార ధరలను మినహాయించాలని ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ కూడా '2023-24 ఆర్థిక సర్వే' నివేదికలో ప్రస్తావించారు. ఆహార ధరలకు, వడ్డీరేట్లకు ఎలాంటి సంబంధం లేదని.. సరఫరాను బట్టే వాటిధరలు హెచ్చుతగ్గులకు లోనవుతాయన్నారు.

మార్కెట్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440

» ప్రారంభ ధర రూ.2.08 లక్షలు



న్యూఢిల్లీ: రాయల్ ఎన్‌ఫీల్డ్ బుధవారం 'స్క్రామ్ 440' మోటార్ సైకిల్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ప్రారంభ ధర రూ.2.08 లక్షలు. స్క్రామ్ 411 స్థానాన్ని భర్తీ చేసేందుకు కంపెనీ ఈ బైక్‌ను గత ఏడాది గోవాలో నిర్వహించిన మోటోవెర్స్ షోలోనే ఆవిష్కరించింది. అయితే, బైక్ ఇంజిన్‌తోపాటు పనితీరు, డిజైన్‌ను మరింత అప్‌గ్రేడ్ చేసి తాజాగా కస్టమర్లకు అందుబాటులోకి తెచ్చింది. ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400ఎక్స్‌కు పోటీగా రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈ బైక్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది.

డబ్ల్యూఈఎఫ్ జాబితాలో కాకినాడ ఇండస్ట్రియల్ క్లస్టర్

» భారత్ నుంచి మరో నాలుగు క్లస్టర్లకూ చోటు

దావోస్ (స్విట్జర్లాండ్) : వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) ప్రారంభించిన పారిశ్రామిక క్లస్టర్ల జాబితాలో మన దేశానికి చెందిన ఐదు క్లస్టర్లకు చోటు లభించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ పారిశ్రామిక క్లస్టర్ కూడా ఉంది. ఏఎం గ్రీన్ సంస్థ ఈ క్లస్టర్‌ను సమన్వయం చేస్తుంది. రేవు ఆధారిత ఈ క్లస్టర్‌లో కాలుష్య రహిత గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్, పర్యావరణకు హాని చేయని విమాన ఇంధన పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారు. కాకినాడ పారిశ్రామిక క్లస్టర్‌తో పాటు ఒడిసాలోని గోపాల్‌పూర్ ఇండస్ట్రియల్ పార్క్, తిరువనంతపురంలోని కేరళ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, గుజరాత్‌లోని ముంద్రా క్లస్టర్, మహారాష్ట్రలోని ముంబై గ్రీన్ హైడ్రోజన్ క్లస్టర్లకు కూడా డబ్ల్యుఈఎఫ్ జాబితాలో చోటు దక్కింది. మన దేశానికి చెందిన ఐదు క్లస్టర్లతో పాటు 16 దేశాలకు చెందిన మొత్తం 33 క్లస్టర్లకు ఈ జాబితాలో చోటు దక్కింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	విజయవాడ	141
వరంగల్	127	గుంటూరు	137
కరీంనగర్	127	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	112
కర్నూలు	127	నెల్లూరు	117
విశాఖపట్నం	132	అనంతపురం	117
గోదావరి	141		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,090 ▲	75,250 ▲	1,04,000 ▲
విజయవాడ	82,500 ▲	78,000 ▲	94,000 ▲
విశాఖపట్నం	79,820 ▲	73,170 ▲	92,120 ▲
రాజమండ్రి	82,090 ▲	75,250 ▲	94,200 ▲
ప్రొద్దుటూరు	80,700 ▲	74,730 ▲	93,200 ▲
ముంబై	80,190 ▲	73,460 ▲	91,250 ▲

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు : 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 295
గురువారం | 23-1-2025
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

₹56300 కోట్లు

దావోస్‌లో ఒక్కరోజులోనే తెలంగాణకు రికార్డు స్థాయి పెట్టుబడులు

45,500 కోట్ల మేర సన్ పెట్రోకెమికల్స్ ఒప్పందం

నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగులో ప్రాజెక్టులు

నగరంలో 10వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్

ఏర్పాటు చేసేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ రెడీ

800 కోట్లతో జేఎస్‌డబ్ల్యు యూఏఎస్ యూనిట్

హైటెక్‌సిటీలో 3.2 లక్షల చదరపుటడుగుల్లో

హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్.. 5 వేల ఉద్యోగాలు

తెలంగాణ అంటేనే బిజినెస్.. పెట్టుబడులతో రండి

పారిశ్రామికవేత్తల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలో డ్రైపోర్ట్ నిర్మించి, దాన్ని మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం చేస్తామని వెల్లడి

తెలంగాణలో 4 కోట్ల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించండి. తక్కువ ఖర్చుతో ప్రజలు వేగంగా ప్రయాణించాలన్నది మా ప్రభుత్వ ఆకాంక్ష. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుతాం. రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. హైదరాబాద్‌ను నెట్ జీరో సిటీగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దాలనేది మా అభిమతం.

- దావోస్‌లో పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికపై తెలంగాణ కొత్త రికార్డు నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనంతగా.. ఒకేరోజు రూ.56,300 కోట్ల పెట్టుబడులకు సంబంధించి దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటిలో ముఖ్యమైనది.. ఇంధన రంగంలో దేశంలోనే పేరొందిన సన్ పెట్రో కెమికల్స్ సంస్థ రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్తు, సౌర విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు చేసుకున్న రూ.45,500 కోట్ల ఒప్పందం. సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీతో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బుధవారం సమావేశమయ్యారు. అనంతరం కంపెనీ కొత్త పెట్టుబడులు ప్రకటించింది. సీఎం రేవంత్ సమక్షంలో దావోస్ సదస్సులో రాష్ట్రప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలోని నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పుతామని కంపెనీ ప్రకటించింది. ఈ మూడు ప్రాజెక్టుల మొత్తం ఇంధన

మిగతా 11వ పేజీలో...

తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలతో మాది స్నేహపూర్వక పోటీ 11

హైదరాబాద్, యువత.. తెలంగాణ బలం: ముఖ్యమంత్రి

ఏపీ, మహారాష్ట్ర సీఎంలతో కలిసి వేదిక పంచుకున్న రేవంత్

నెత్తురోడిన రైలు పట్టాలు..

12 మంది దుర్మరణం


జాల్గావ్‌లో ప్రమాదం జరిగిన ప్రదేశం

పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల వద్ద నిప్పురవ్వలు

అగ్నిప్రమాదం అంటూ వదంతులతో చైన్ లాగి కిందకు దిగిన 50మంది

అటుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీ

12 మంది అక్కడికక్కడే మృతి.. ఛిద్రమైన శరీరాలు

మరో 10 మందికి గాయాలు.. మహారాష్ట్ర జాల్గావ్‌లో ఘటన

ముంబై, జనవరి 22: మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా పరండా రైల్వే స్టేషన్ సమీపంలో ఘోరం చోటుచేసుకుంది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికులు బోగీకి నిప్పంటుకుందనే వదంతులతో కిందకు దిగారు. అటుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో 12 మంది అక్కడికక్కడే మృతిచెందగా.. 10 మంది గాయపడ్డారు. మృతుల్లో ఓ బాలుడు, ముగ్గురు మహిళలున్నారు. ఈ ఘటనపై జాల్గావ్ ఎస్పీ డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన అందజేసిన వివరాల ప్రకారం.. జల్గావ్ నుంచి బయలుదేరిన పుష్పక్ రైలు సాయంత్రం 5 గంటల సమయంలో పరండా స్టేషన్ సమీపానికి రాగానే.. జనరల్ బోగీ చక్రాల వద్ద నిప్పురవ్వలు వచ్చి, పొగ రేగింది. దీంతో.. ఓ ప్రయాణికుడు "బోగీకి నిప్పంటుకుంది" అంటూ అరిచాడు. అది విని కంగారు పడ్డ ప్రయాణికులు చైన్ లాగారు. రైలు ఆగడంతో

మిగతా 10వ పేజీలో...

భార్యను ముక్కలుగా కోసి..

కుక్కర్‌లో ఉడికించి..

ఆమె ప్రవర్తనపై అనుమానంతో భర్త దారుణం

ఉడికిన ముక్కలను మూడు రోజులు ఎండబెట్టి.. దంచిన దుర్మార్గుడు

ఆ పొడిని చెరువులో పోసిన వైనం

మీర్‌పేట్‌లో మాజీ జవాన్ ఘోరం

తనతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయిందని అత్తగారికి ఫోన్

ఆమెతో కలిసి పోలీసులకు ఫిర్యాదు

తొలుత కుక్కని చంపి.. ప్రయోగం

అతడి ఇంటి వద్ద కుక్క తల లభ్యం? అదుపులో నిందితుడు!

సరూర్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అతడెంత క్రూరుడో..! తాళికట్టి.. ఆమెతో పదేళ్లకుపైగా కాపురం చేసి.. ఇద్దరు పిల్లలను కన్నానన్న అనుబంధమైనా అతడికి గుర్తుకు రాలేదేమో! నా అనుకున్నవాళ్ల కాలికి తట్టు తగిలి.. బొట్టు నెత్తురు కారితేనే మనసు అల్లాడుతుంది. అలాంటిది.. కట్టుకున్న భార్యను కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపి, అదే కత్తితో ఆమె మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోశాడా భర్త! ఆ ఖండిత భాగాలను కుక్కర్‌లో వేసి, ఉడికించి.. ఆ ముక్కలను మూడు రోజుల

మిగతా 9వ పేజీలో...

పట్టపగలు నడిరోడ్డుపై దారుణహత్య

ఓ ఆటోడ్రైవర్‌ని పొడిచి చంపిన మరో ఆటోవాలా

వివాహేతర సంబంధం నేపథ్యంలో ఘాతుకం

హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో ఘటన 9

జన్మతః పౌరసత్వ హక్కు రద్దు ఉత్తర్వుపై

22 రాష్ట్రాలు కోర్టుకు



రెండు కోర్టుల్లో డెమొక్రాట్ పాలిత రాష్ట్రాల అటార్నీ జనరళ్ల వ్యాజ్యాలు

పౌరహక్కుల సంస్థలతోపాటు.. ఒక గర్భిణి కూడా న్యాయస్థానానికి!

ఇష్టానుసారంగా చట్టాల్ని మార్చడానికి ట్రంప్ రాజు కాదని ధ్వజం

ఈ కేసులను వామపక్షవాదుల ప్రతిఘటనగా అభివర్ణించిన వైట్‌హౌస్

వాషింగ్టన్, జనవరి 22: పుట్టుకతో పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును సవాల్ చేస్తూ.. అమెరికాలో డెమొక్రాట్ల పాలనలో ఉన్న 22 రాష్ట్రాలు కోర్టులను ఆశ్రయించాయి. అమెరికాకు అక్రమంగా వలస వచ్చేవారికైనా.. సక్రమంగా విద్యార్థి/ఉద్యోగ/పర్యాటక వీసాపై వచ్చినవారికైనా అమెరికాలో పిల్లలు పుడితే వారికి ఆటోమేటిగ్గా ఆ దేశ పౌరసత్వం లభించేలా 1868లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా హక్కు కల్పించిన సంగతి తెలిసిందే. ఆ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ తాజాగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆయన ఉత్తర్వు జారీ చేయగానే ఆ హక్కు రద్దు అయిపోదని.. ట్రంప్ సర్కారు దీనిపై చట్టపరమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఒకవేళ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ హక్కును రద్దు చేయాలనుకున్నా కూడా అది చాలా సుదీర్ఘమైన, సంక్లిష్టమైన ప్రక్రియ అని హక్కుల కార్యకర్తలు మంగళవారమే

మిగతా 10వ పేజీలో...

అమెరికా అధ్యక్షుడికి కౌంటర్లు

- పనామా కాలువ అమెరికా బహుమతి కాదు: ములినో
- ట్రంప్ సుంకాలు విధిస్తే భయపడం, ఊరుకోం: ట్రుడో
- జాతి ప్రయోజనాలే మాకు ముఖ్యం: చైనా 10


అలకనంద ఆస్పత్రి వద్ద విచారణ కమిటీ సభ్యులు

ఒంటరి మహిళలే లక్ష్యం..!

కిడ్నీ రాకెట్ సూత్రధారులు ఎవరు?.. పరారీలో వైద్యులు

దక్షిణాది రాష్ట్రాల్లో ఆర్ఎంపీలే ఏజెంట్లు

నెల క్రితం శస్త్రచికిత్స వికటించి మహిళ మృతి!

కిడ్నీ రూ. 25 లక్షలు!

దాతలకు ఇచ్చింది రూ.4 లక్షలే

అలకనంద కిడ్నీ రాకెట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి

తమిళనాడుకు చెందిన ఇద్దరు పేద మహిళల నుంచి కిడ్నీలు

కర్ణాటకకు చెందిన న్యాయవాది, నర్సుకు కిడ్నీ మార్పిడి

వారి నుంచి రూ.25 లక్షల చొప్పున రూ.50 లక్షల వసూలు

ఘటనపై ప్రభుత్వం సీరియస్.. విచారణకు ప్రత్యేక కమిటీ


సర్కారుకు నివేదిక ఇచ్చిన కమిటీ.. ఆస్పత్రి గుర్తింపు రద్దు

ఆ ఆస్పత్రి యజమాని సుమంత్ డాక్టరే కాదని వెల్లడి

సుమంత్‌తోపాటు మరో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, రంగారెడ్డి అర్బన్, మంగళ్‌హాట్, అడ్డగుట్ట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వారు నిరుపేద ఒంటరి మహిళలు.. దానికితోడు పిల్లల పోషణ భారం.. చుట్టుముట్టిన ఆర్థిక సమస్యలు. దీన్నించి విముక్తి కోసం కిడ్నీలు అమ్ముకోవటానికి సిద్ధపడ్డారు. భాష తెలియని ప్రాంతానికి వచ్చి ఆస్పత్రిలో చేరి కిడ్నీలు ఇచ్చారు. అందుకు ప్రతిఫలంగా వారికి లభించింది రూ.4 లక్షలు. కానీ, ఆ కిడ్నీని

మిగతా 12వ పేజీలో...



రాష్ట్ర హైకోర్టుకు నలుగురు 12

అదనపు జడ్జిలు

సుప్రీం సిఫారసులకు రాష్ట్రపతి ఆమోదం

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర న్యాయశాఖ

బీఆర్ఎస్ నల్లగొండ రైతు మహాధర్నాకు

హైకోర్టు అనుమతి

28న 1500 మందితో శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆదేశం 9



శారదాపీఠం భవనం

కూల్చివేతకు ఆదేశాలిస్తాం!

అనుమతుల్లేని నిర్మాణాలను ఉపేక్షించం

ప్లాన్‌కు విరుద్ధంగా ఎలా నిర్మిస్తారు?

అలాంటి వాటికి ఇదో ఉదాహరణ కావాలి

తిరుమల గోగర్భం డ్యామ్ వద్ద నిర్మాణంపై ఏపీ హైకోర్టు ఆగ్రహం

కౌంటర్ దాఖలు చేయాలని శారదా పీఠానికి ఆదేశం.. విచారణ వాయిదా 11


రాజకీయాలు వద్దు..

వివరాలు చెప్పండి

టీఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ ప్రకాశ్‌రావుకు కాళేశ్వరం కమిషన్ హితవు

తెలంగాణ ఏర్పడింది నీటి వాటాల కోసమే!: కమిషన్‌తో ప్రకాశ్‌రావు

కోదండరాం, వెదిరె శ్రీరామ్, రఘు అబద్ధాలు చెప్పారని వ్యాఖ్య


విచారణకు వెళ్తున్న ప్రకాశ్

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల జోలికి వెళ్లకుండా ప్రాణహిత-చేవెళ్ల కాదని, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడానికి కారణాలను మాత్రమే వివరించాలని జస్టిస్ ఘోష్ కమిషన్ తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఐడీసీ) మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత వి.ప్రకాశ్‌రావుకు సూచించింది. కాళేశ్వరం ప్రాజెక్టులపై విచారణలో భాగంగా కమిషన్ బుధవారం ఆయన్ను విచారించింది. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చడానికి కారణాలేంటని అడగ్గా.. నీటి వాటాల కోసమే రాష్ట్ర ఏర్పాటు జరిగిందని ప్రకాశ్ చెప్పబోయారు. స్పందించిన కమిషన్.. రాజకీయ అంశాల జోలికి వెళ్లకుండా, ప్రాజెక్టు వివరాలు మాత్రమే చెప్పాలని స్పష్టం చేసింది. ఎగువన గోదావరి ప్రధాన పాయపై మహారాష్ట్ర, కర్ణాటక ఎన్నో జలాశయాలు నిర్మించి, వందల టీఎంసీలను తరలించుకుంటుండడంతో గత 50 ఏళ్లుగా తెలంగాణకు వచ్చే ప్రవాహాలు తగ్గిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వం తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీ నిర్మాణాన్ని తరలించడాన్ని సమర్థిస్తూ ప్రకాశ్‌రావు

మిగతా 12వ పేజీలో...


దిల్‌రాజు ఇంటి వద్ద మీడియా ప్రతినిధులు; ఇన్‌సెట్‌లో దిల్‌రాజు

రెండో రోజూ సోదాలు

- దర్శకుడు సుకుమార్‌ను ఎయిర్‌పోర్ట్‌లోనే కలిసి.. ఆయన ఇంటికి తీసుకెళ్లిన ఐటీ అధికారులు
- పుష్ప 2 సినిమా పారితోషికంపై ఆరా 8
- నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, చెర్రీ, దిల్ రాజు తదితరుల నివాసాల్లో సోదాలు
- నిర్మాతల బినామీల బ్యాంకు ఖాతాల గుర్తింపు
- కలెక్షన్లు, ఐటీకి సమర్పించిన వివరాల్లో వ్యత్యాసం!
- సినీ పరిశ్రమలో చాలా చోట్ల ఐటీ సోదాలు
- నా ఒక్కడిపైనే జరగడం లేదు: దిల్ రాజు

టెన్షన్ టెన్షన్

25 ఏళ్లలోపు ఉద్యోగుల్లో తీవ్ర పని ఒత్తిడి!

ప్రతి 10 మందిలో 9 మందికి విపరీతమైన ఆందోళన

యువ ఉద్యోగులకు నిర్మాణాత్మక మద్దతు అవసరం

ఉద్యోగుల సహాయ సేవాసంస్థ 'వన్ టు వన్' వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 22: ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఎన్ఆర్ నారాయణ మూర్తి, ఎస్ఎన్ సుబ్రమణ్యన్, లాంటివారు సుదీర్ఘ పనిగంటలు ఉండాలని, వారాంతాల్లోనూ పనిచేయాలని అభిప్రాయం వ్యక్తం చేసినా అందుకు యువత మానసికంగా సిద్ధంగా లేదేమో! దేశ వ్యాప్తంగా యువ ఉద్యోగులంతా పని ఒత్తిడి కారణంగా మానసిక ఆరోగ్య సమస్యలతో పెను సవాళ్లు ఎదుర్కొంటున్నారట! ఈ మేరకు 'వన్ టు వన్' అనే ఉద్యోగుల సహాయ సేవాసంస్థ పేర్కొంది. 'వన్ టు వన్' కౌన్సెలింగ్ సెషన్ల డేటా ప్రకారం పాతికేళ్ల వయసు

మిగతా 10వ పేజీలో...

యూత్ కాంగ్రెస్ నేతల

బాహాబాహీ

గాంధీభవన్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

కొత్తగూడెం అధ్యక్షుని ఎన్నిక నిబంధనలకు విరుద్ధమంటూ పలువురు నేతల అభ్యంతరం

బీఆర్ఎస్ నుంచి వచ్చిన నాయకులకే ప్రాధాన్యం ఇచ్చారంటూ ఆగ్రహం

గొడవపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సీరియస్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సామాన్యులూ సంపన్నులూ

ఆర్థిక అసమానతలు మూడు విధాలుగా కనిపిస్తాయి: భిన్న ఖండాలు, వేర్వేరు దేశాలలోని సమాజాల మధ్య వ్యత్యాసాలు; ఒక దేశం లేదా ఒక రాష్ట్రంలోని పట్టణాలు, పల్లెల మధ్య తేడాలు; ఒక సామాజిక సమూహంలోని అత్యధికులు అయిన పేదలు, స్వల్ప సంఖ్యలో ఉండే ధనికుల మధ్య అంతరాలు. మానవాళి ప్రస్థానాన్ని పరిశీలిస్తే మూడోరీతి అసమానతలు నాగరికత ప్రభవించిన నాటి నుంచే ఆరంభమయ్యాయని, అవి కాలక్రమేణా పెరిగాయని, ఇప్పటికీ తీవ్రమవుతూనే ఉన్నాయని అర్థమవుతుంది. మరి మొదటి తరహా అసమానతలకు వలసవాద పాలన కారణమన్న భావన సబబైనదేనని ఆర్థికవేత్తలు, చరిత్రకారులు అంటున్నారు. వలసవాద పాలన నుంచి లబ్ధి పొందినవి పాశ్చాత్య దేశాలు, నష్టపోయినవి ప్రాచ్య దేశాలు. ఆసియా, ఆఫ్రికా దేశాలపై యూరోపియన్ రాజ్యాల వలసవాద ఆధిపత్యమే అవి సంపద్వంతం కావడానికి విశేషంగా దోహదం చేసింది. శతాబ్దాల పాటు ఆ పాశ్చాత్య దేశాలు ప్రాచ్య దేశాలను అన్ని విధాల దోపిడీ చేసి అణచివేశాయి. స్పెయిన్, పోర్చుగీస్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బెల్జియం, జర్మనీ, రష్యా మొదలైన యూరోపియన్ దేశాలేకాక, ఆధునిక యుగంలో తొలుత వలసవాద పాలనకు గురైన అమెరికా సైతం ఈ ధరిత్రిపై ఏదో ఒక ప్రాంతాన్ని దురాక్రమించాయి. 1765–1900 సంవత్సరాల మధ్య మన దేశం నుంచి బ్రిటన్ 64.82 ట్రిలియన్ పౌండ్ల విలువైన ఆస్తులను తరలించుకుపోయింది. ఇందులో 38.8 ట్రిలియన్ పౌండ్ల మేరకు ఆ దేశంలోని పదిశాతం సంపన్నులు లబ్ధి పొందారు. మన దేశంలో కొల్లగొట్టిన ధనరాశులే ఇంగ్లాండ్‌ను సంపద్వంతం చేశాయి.

వలసవాద ఆధిపత్యం ఒక చారిత్రక దురాగతం మాత్రమే కాదు, అది వర్తమాన ప్రపంచాన్నీ పీడిస్తున్న అధర్మం. ఈ సత్యాన్నే ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ (ప్రపంచ వ్యాప్తంగా పేదరికం నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తున్న 21 స్వతంత్ర ప్రభుత్వేతర సంస్థల సమాఖ్య) తాజా నివేదిక 'టేకర్స్ నాట్ మేకర్స్: ద అన్‌జస్ట్ పావర్టీ అండ్ అన్‌ఎర్న్‌డ్ వెల్త్ ఆఫ్ కలోనియల్ ఇన్హెరిటన్స్' విపులంగా విశదీకరించింది. ఆధునిక బహుళజాతి సంస్థలన్నీ ఒకనాడు మన దేశాన్ని పీడించి పాలించిన ఈస్టిండియా కంపెనీ లాంటివేనని ఆ నివేదిక స్పష్టం చేసింది. పేద దేశాల సహజ వనరులను, శ్రమశక్తిని విపరీతంగా దోపిడీ చేయడం వల్లనే వాటి మాతృదేశాలు సిరిసంపదలతో తులతూగుతున్నాయని నివేదిక పేర్కొంది. సామాన్యుల శ్రేయస్సును ఉపేక్షించి, అతి కొద్దిమంది సంపన్నుల ప్రయోజనాలను కాపాడే విధంగా దేశ దేశాల ఆర్థికవ్యవస్థలను అవి ప్రభావితం చేశాయని, చేస్తున్నాయని, తత్కారణంగానే ఆర్థిక అసమానతలు అంతులేని రీతిలో పెచ్చరిల్లిపోతున్నాయని ఆక్స్‌ఫామ్ తెలిపింది. 2024లో బిలియనీర్ల ఆస్తులు 2023లో కంటే మూడు రెట్లు పెరిగాయి. ఒక సంవత్సర కాలంలో మహా కుబేరుల మొత్తం ఆస్తులు 2 లక్షల కోట్ల డాలర్లకు పైగా పెరిగాయి. ఇదే కాలంలో 204 మంది కొత్త బిలియనీర్లు ఆవిర్భవించారు. ఈ మహా కుబేరులు ఎలా ప్రభవించారు? వారి అపార ధనరాశులు ఎలా వచ్చాయి? ఆ వేల కోట్ల ఆస్తులు వారు కష్టపడి సంపాదించుకున్నవి కాదని, అవి వారు ఆర్జించని ఆస్తులేనని ఆ నివేదిక పేర్కొంది. వారసత్వం, గుత్తాధిపత్యం, ఆశ్రిత పక్షపాతం ద్వారా వారికి ఆ ఆస్తులు సమకూరాయి. పూర్తిగా అవినీతి మార్గాలలోనే వారు బిలియనీర్లు కావడం జరిగింది. పచ్చి నిజం ఏమిటంటే తమకే పూర్తిగా అనుకూలంగా ఉండేలా రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలను వారు అన్నివిధాల ప్రభావితం చేయగలుగుతున్నారు. ఈ పరిణామాలు సామాన్యులు, సంపన్నుల మధ్య, పేద, ధనిక దేశాల మధ్య ఆర్థిక అసమానతలను పెంచుతున్నాయి. సామాన్యులు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. సంపన్న దేశాలలోని 1 శాతం ధనికులకు పేద దేశాల వారు గంటకు 30 మిలియన్ డాలర్లు చెల్లిస్తున్నట్టు పారిస్‌లోని ఇనెక్వాలిటీ ల్యాబ్ పరిశోధకులు ధ్రువీకరించినట్టు ఈ నివేదిక పేర్కొంది. సంపన్న దేశాలు చేస్తున్న ప్రతి ఒక డాలర్ సహాయానికి పేద దేశాలు నాలుగు డాలర్లు చెల్లిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్థిక అసమానతలు పెరిగిపోకుండా ఎలా ఉంటాయి? కనుకనే రాజకీయ వలసాధిపత్యం నుంచి ఏనాడో విముక్తమైన ఎన్నో దేశాలు నేడు ఆర్థిక వలసాధిపత్యానికి అణగారిపోతున్నాయి.

ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తి గడువు (2030 సంవత్సరం) సమీపిస్తున్నది. ఆ లక్ష్యాల పరమార్థమైన ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని మానవాళి సాధించుకోగలుగుతుందా? ఒక సమాజంలోని సకల వ్యక్తులు, జనసముదాయాలు తమ ప్రాకృతిక, సామాజిక వనరులను వినియోగించుకోవడంలో సమరీతిలో భాగస్వాములు కావడమే ఆర్థిక ప్రజాస్వామ్యం. ఈ సముదాత్త పరిస్థితిని నెలకొల్పుకునేందుకై తొలుత ఆర్థిక అసమానతలను గణనీయంగా తగ్గించుకునేందుకు అన్ని ప్రభుత్వాలు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని నివేదిక పేర్కొంది. ఒకనాడు వలసాధిపత్యం చెలాయించిన దేశాలన్నీ తాము చేసిన అన్యాయాలన్నిటికీ బాధిత దేశాలకు క్షమాపణలు చెప్పాలి. చారిత్రక మనస్తాపాలు విస్మరించి అన్ని దేశాలు కలసికట్టుగా సాగడానికి ఈ చర్య ఒక నైతిక వాతావరణాన్ని సృష్టిస్తుంది. మరింత ముఖ్యంగా, పేద దేశాలు ప్రాంతీయ సహకార సంస్థలుగా ఏర్పడి ధనికదేశాలపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రాధాన్యమివ్వాలని ఆక్స్‌ఫామ్ సూచించింది.

మా 57 కులాల మాటేమిటి?

పంజాబ్ వర్సెస్ దావిందర్ సింగ్ కేసులో ఆగస్టు 1, 2024న సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పునిస్తూ దళితుల వెనుకబాటుతనం ఆధారంగా, వారి ఎంపరికల్ డేటా ఆధారంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సూచిస్తూ, ఇది ఆర్టికల్ 341కి భిన్నమైనది కాదని తీర్మానిస్తూ, ఆర్టికల్స్ 14, 15(4), 16(4) ప్రకారం సమానత్వ సిద్ధాంతం పునాదిగా సమాన పంపిణీ న్యాయం జరగాలని పేర్కొంది. ఇక్కడ 'ఎంపరికల్ డేటా' అంటే ఏమిటో మాల మాదిగలు అర్థం చేసుకోవాలి. విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయ అవకాశాల్లో ఇప్పటివరకు అందిపుచ్చుకోలేని దళితులను గుర్తించి వారికి అధిక శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిస్తూ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. అంతేకానీ జనాభా దామాషా ప్రకారం చేయాలని గానీ, కులాలవారీగా చేయాలని గానీ ఎక్కడా చెప్పలేదు. కాబట్టి 2011 జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకోవాలని, 12 శాతం మాదిగలకే కేటాయించాలని చేసే వాదన అర్థం లేనిది.

వర్గీకరణ చేయాలని పోరాడే మాదిగలు మిగతా అత్యంత వెనుకబడ్డ 57 దళిత కులాల వాటా ఎంతో స్పష్టం చేయరు. వర్గీకరణ వద్దు అనే మాలలు ఇంతకాలం వెనుకబడ్డ మా 57 కులాల అభివృద్ధి కోసం ఏం చేశారో, భవిష్యత్‌లో వారికి ఎలాంటి అవకాశాలుండాలో చెప్పరు. షెడ్యూల్డ్ కులాల జాబితాలోని కులాలన్నీ ఎవరికి వారు స్వతంత్ర కులాలైనప్పటికి ఈ రెండు కులాలు మిగతా 57 కులాలను తమ ఉపకులాలుగా ప్రచారం చేసుకొని 57 కులాల ప్రయోజనాలను కూడా దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు.



మాదిగలకు మాలలు అన్యాయం చేసారని వాపోతున్నారు కదా; మరి మిగతా 57 కులాలు డెబ్బై ఎనిమిది సంవత్సరాలుగా ఈ రెండు కులాల చేతుల్లో ఎంత దోపిడీకి గురయ్యాయో ఆలోచించరా?

78 సంవత్సరాలుగా రాజ్యాంగబద్ధంగా దళితులకు లభించే ఫలాలను మాల మాదిగలే వారి జనాభా నిష్పత్తి కంటే అధికంగా అనుభవించారని జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్, జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్లు స్పష్టం చేసాయి. మాలలు మాదిగలకు అన్యాయం చేసారని వాపోతున్నారు కదా; మరి మిగతా 57 కులాలు డెబ్బై ఎనిమిది సంవత్సరాలుగా ఈ రెండు కులాల చేతుల్లో ఎంత దోపిడీకి గురయ్యాయో ఆలోచించరా?

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం మాదిగల జనాభా 34,87,872 (9.4శాతం) మాల జనాభా 14,35,613 (3.89శాతం) మిగతా 57 ఎంబిఎస్సీ కులాల జనాభా 15,21,099 (4.12శాతం). స్వరాష్ట్రంలో అమలు జరిగిన మూడెకరాల భూ పంపిణీ పథకంలో మాల మాదిగలకు 14,350 ఎకరాలు, కార్పొరేషన్ ఋణాలలో 93 శాతం, ఉద్యోగ అవకాశాలు 85 శాతం, దళిత బంధు పథకంలో 90 శాతం మాల మాదిగలే దక్కించుకున్నారు. మిగతా 57 కులాలకు ఒకటి రెండు శాతానికి మించింది లేదు. ఇవన్నీ లెక్కలు తీసి ఇప్పటివరకు ఫలాలు పొందని కులాలకు అధిక శాతం ఇవ్వాలి. వెనుకబడ్డ దళిత కులాలు ఏ కులానికీ ఉపకులాలు కావని, అవన్నీ స్వతంత్ర కులాలేనన్న వాస్తవాన్ని గుర్తించాలి. ఉపకులాలు అనే పదాన్ని వాడవద్దు. వారిని మోస్ట్ బ్యాక్వర్డ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎమ్‌బిఎస్సీ)గా గుర్తించాలి.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి 57 ఎంబిఎస్సీ కులాల తరఫున చేస్తున్న ముఖ్య సూచనలు కొన్ని ఉన్నాయి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును యథాతథంగా అమలు చేయాలి. ఈ 57 కులాలూ మాల మాదిగ కులాలతో పోటీపడలేవు కాబట్టి వారి గ్రూపులలో వీరిని కలుపవద్దు. అవసరమైతే మా 57 కులాలలోనే నిరుపేదలను ఎ–గ్రూపులో, పేదలను బి–గ్రూపులో చేర్చి అధికశాతం రిజర్వేషన్లు కేటాయించాలి. అభివృద్ధి చెందిన మాల మాదిగలను సి– గ్రూపులో కానీ లేదా సి, డి గ్రూపులలో కానీ చేర్చాలి. ఎస్సీ వర్గీకరణను జనాభా దామాషా ప్రకారం కాకుండా సుప్రీంకోర్టు చెప్పిన విధంగా 'దళిత కులాల ఎంపరికల్ డేటా ప్రకారం' చేయాలి. అత్యంత వెనుకబడ్డ 57 కులాలకు ప్రస్తుతం అమలు చేస్తున్న 15శాతం రిజర్వేషన్లలో 7శాతం కేటాయించాలి. మా కులాలకు కేటాయించబడే అవకాశాలను మా కులాలతోనే భర్తీ చేయాలి. అర్హులు లేకుంటే బ్యాక్‌లాగ్ చేయాలి. అంతేకానీ, మాల, మాదిగ గ్రూపులకు క్యారీ ఫార్వర్డ్ చేయకూడదు. లేదా తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల తరహాలో మా 57 దళిత కులాలకు ప్రత్యేక శాతాన్ని కేటాయించి చట్టబద్ధత కల్పించాలి. లేదా ఎస్సీ రిజర్వేషన్లను రాష్ట్రంలో 22 శాతానికి పెంచి అత్యంత వెనుకబడ్డ 57 దళిత కులాలకు 10శాతం కేటాయించి మిగిలిన 12 శాతం మాల మాదిగ కులాలకు కేటాయించాలి. ఎస్సీ వర్గీకరణకు జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకోవాలనుకుంటే 2011 లెక్కలు కాకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే నూతన జనాభా లెక్కలు 2025లో నిర్వహించి వాటిని ప్రామాణికంగా తీసుకోవాలి. ఎందుకంటే గత పదేళ్ళ క్రితం దళిత కులాలు ఎవ్వరూ వారి కులం సమగ్ర వివరాలు అందులో నమోదు చేసుకోలేదు. కాబట్టి ఆ పాత లెక్కలు తీసుకుంటే దళితుల్లో వెనుకబడ్డ 57 కులాలు తీవ్రంగా నష్టపోతాయి. దళితుల్లో అత్యంత వెనుకబడ్డ 57 కులాలకు సెకండరీ విద్య జిల్లా స్థాయి ఉద్యోగాలు, ఉపాధి సంక్షేమ పథకాల్లో జిల్లాని యూనిట్‌గా తీసుకొని వర్గీకరణను అమలు చేయాలి. ఇంకా ఉన్నత సాంకేతిక విద్య, రాష్ట్ర స్థాయి ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల్లో రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని వర్గీకరణ అమలు చేయాలి. 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి వెయ్యి కోట్లు కేటాయించాలి. దళిత కులాలందరికి కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో ద్వారా కాకుండా తహశీల్దార్ ద్వారానే ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా ఉపాధి సంక్షేమ పథకాలలో, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో, భూమి పంపిణీలో మా 57 కులాలకు మొదటి ప్రాధాన్యతనివ్వాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో 7 శాతం స్థానాలు కేటాయించాలి.

○ బైరి వెంకటేశం మోచి
జాతీయ అధ్యక్షులు, ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి

ట్రంప్ దూకుడుతో వరుస షాక్‌లు!

రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన డోనాల్డ్ ట్రంప్ స్పీడ్‌ని ఏ స్పీడో మీటర్లూ కొలవలేవు. పదవీ బాధ్యతలు తీసుకున్న తక్షణమే టన్నుల కొద్దీ నిర్ణయాలు చకచకా తీసుకున్నారు. కొన్ని ఎన్నికల్లో చెప్పినవీ.. మరికొన్ని అప్పటికప్పుడే చెప్పినవి. ఆయన సంతకాలతో దేశం లోపలా, బయటా షాకులే! అమెరికాను మళ్లీ ఘనత పొందిన దేశంగా చేస్తానని చెప్పిన ఆయన, వస్తూనే డజన్ల కొద్దీ ఆదేశాలపై సంతకాలు చేశారు. అందులో గత ప్రభుత్వం ఇచ్చిన 78 ఆదేశాల రద్దుతో మొదటి పద్దు మొదలెట్టారు. తర్వాత ముఖ్యమైన నిర్ణయం– అమెరికాలో పుట్టినవారికి ఆటోమేటిక్‌గా వర్తించే పౌరసత్వపు హక్కు రద్దు చేశారు. ఆ తర్వాత ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి వైదొలగడం. పర్యావరణ రక్షణ బాధ్యతకు పూచీ పడాల్సిన పారిస్ ఒప్పందం నుండి తప్పుకోవడం. ఆపైన తన చిరకాల హామీ అయిన మెక్సికో వైపు దేశ సరిహద్దుని గోడతో మూసేందుకు సుగమం చేసేలా ఎమర్జెన్సీ విధింపు. బ్రిక్స్ దేశాలతో వాణిజ్యంపై వంద శాతం సుంకం వేస్తానని హుంకరింపు.

ఇలా ఒక్కొక్కటీ ఒక్కో షాకు. ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక లావాదేవీలను, అమెరికాతో సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేసే నిర్ణయాలు. అమెరికా తను పాడుచేసిన పర్యావరణం పట్ల చూపాల్సిన బాధ్యతను తప్పుకోవడం అంటే అది మొత్తం ప్రపంచ దేశాల పట్ల బాధ్యతను విస్మరించడమే. ఈ డజన్ల కొద్దీ ఆదేశాల్లో ఎన్ని కార్యరూపం దాలుస్తాయో కానీ ఆయన ఉద్దేశ్యం, స్పీడు మాత్రం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. అడుగు పెడుతూనే దుడుకు చూపించారు. బండి స్టార్ట్ చేస్తూనే టాప్ గేర్‌లోకి వెళ్లారు. ఇక భయంతోనో, సంభ్రమంతోనో గట్టిగా కళ్ళు మూసుకోవడం, దెబ్బ తగలకుండా చూసుకోవడం ఒక్కటే ప్రపంచ దేశాల పని.

– డి.వి.జి. శంకరరావు

రేషన్ కార్డులు అర్హులకు దక్కినపుడే ఆహారభద్రత!

రాష్ట్రంలో జనవరి 21 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం మళ్ళీ ప్రజల వద్ద దరఖాస్తులు తీసుకుంటామని, గతంలో ప్రజాపాలనలో భాగంగా తీసుకున్న దరఖాస్తులను కూడా పరిగణనలో పెట్టుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తామనీ, ఇకపై అర్హులకు ఆహార భద్రత కార్డుగా ఇచ్చే స్మార్ట్ కార్డ్ వాడి రేషన్ దుకాణాల నుంచి బియ్యం తీసుకోవచ్చని కూడా నిర్ణయించారు.

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ వెబ్‌సైట్ అందిస్తున్న వివరాల ప్రకారం– అంత్యోదయ అన్న యోజన, అన్నపూర్ణ కార్డులు సహా మొత్తం రేషన్ కార్డుల ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలో ప్రస్తుత రాష్ట్ర జనాభా 3,81,00,000 మందిలో 2,81,63,759 మంది రేషన్ లబ్ధిదారులుగా ఉన్నారు.

జీడీపీ, జీఎస్‌డీపీ ఆధారిత ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ప్రభుత్వాలు చెప్పుకున్నప్పటికీ, దేశంలో పేదరికం, ఆకలి, నిరుద్యోగం తగ్గడం లేదు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు మన దేశం ఇంకా చాలా దూరంలో ఉంది. దేశంలో, రాష్ట్రంలో అనారోగ్య మరణాలు, అకాల మరణాలు పెరిగిపోతున్నాయి. స్త్రీలలో, పిల్లల్లో రక్తహీనత పెరుగుతున్నది. ఆహార భద్రత చట్టం కింద కార్బోహైడ్రేట్స్ అందించడానికి బియ్యం, గోధుమల లాంటివి నెలకు ఐదు కిలోలు ఉచితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పంపిణీ చేస్తున్నప్పటికీ, నిజమైన పోషకాహార భద్రత మెజారిటీ ప్రజలకు ఇప్పటికీ అందడం లేదు.

భారతదేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లక్షల కోట్లు ఖర్చు పెట్టి, ప్రజలకు చవక ధరలకు ఆహారాన్ని అందిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ, దేశ జీడీపీలో ఆహార సబ్సిడీపై కేంద్ర ప్రభుత్వం పెడుతున్న ఖర్చు వాటా 2014–15లో 0.9 శాతం కాగా, అది 2024–25 నాటికి 0.6 శాతానికి పడిపోయింది. కరోనా కాలంలో ఒక్క సంవత్సరం 2020–21లో మాత్రమే అది జీడీపీలో 2.7 శాతానికి చేరింది. నిజానికి కేంద్ర ప్రభుత్వం జీడీపీలో కనీసం 5 శాతం కేటాయించినా అన్ని ముఖ్యమైన ఆహార ఉత్పత్తులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు సబ్సిడీ ధరలపై అందించవచ్చు.

సమగ్ర కుటుంబ సర్వే నివేదికపై మార్చి 2019లో ప్రభుత్వ ప్రెజెంటేషన్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు పొందడానికి అర్హులు ఎవరంటే– దళిత కుటుంబాలు; అత్యంత వెనుకబడిన ఆదివాసీ తెగల కుటుంబాలు; ఇతర గిరిజన కుటుంబాలు; దినసరి కూలీ కుటుంబాలు; ఇంట్లో ఒక్క గది మాత్రమే ఉన్న కుటుంబాలు; మట్టితో కట్టిన ఇల్లు, తాత్కాలిక షెల్టర్, పాక్షికంగా ధ్వంసం అయిన రెండు గదుల ఇల్లు ఉన్న కుటుంబాలు; అనాథలు, వికలాంగులు ఉన్న కుటుంబాలు, శాశ్వత నివాసం లేని సంచార జాతుల కుటుంబాలు; ఇతర చోట్ల శాశ్వత నివాసం ఉన్న సంచార జాతులు; ఇప్పటికీ వృత్తిలో ఉన్న చేతి వృత్తుల కళాకారులు.



అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడం ఎంత అవసరమో, అనర్హులకు తొలగించడం కూడా అంతే బాధ్యతగా చేయాలి. లేకపోతే వేల కోట్ల నిధులు దుర్వినియోగం అవుతాయి. అలాగే రేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియను అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా నిరంతరం కొనసాగించాలి. ఎప్పటికప్పుడు తగిన విచారణ చేసి కార్డులు మంజూరు చేయాలి.

ఆహార భద్రత రేషన్ కార్డు మంజూరు చేయడానికి ప్రధాన మార్గదర్శకం గ్రామీణ ప్రాంతంలో లక్షన్నర లోపు ఆదాయం; పట్టణ, నగర ప్రాంతాలలో 2 లక్షల లోపు ఆదాయం కలిగి ఉండడం. ఈ ఆదాయాన్ని నిర్ధారించడానికి ప్రాతిపదిక– రెవెన్యూ శాఖ అధికారులు ఎంక్వైరీ చేసి ఆదాయ సర్టిఫికెట్ జారీ చేయటం. కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం కాకుండా, ఈ అధికారులకు మరో రూపంలో కుటుంబ ఆదాయాన్ని తెలుసుకునే మార్గమేమీ లేదు. రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడి, ఒక కుటుంబానికి అతి తక్కువ ఆదాయం చూపిస్తూ ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ చేస్తే దానికి ఎంత క్రెడిబిలిటీ ఉన్నట్లు?

తెలంగాణ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రైవేట్ రంగ సంస్థలలో ముఖ్యంగా వివిధ వ్యాపార, వాణిజ్య, సేవా రంగ సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న దశలో నెలసరి వేతనంపై ఆధారపడి బతుకుతున్న వారి సంఖ్యపై ఎవరికీ స్పష్టత లేదు. అలాగే వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న పర్మినెంట్, క్యాజువల్, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యపై కూడా స్పష్టత లేదు. వివిధ రాష్ట్రాల నుండీ తెలంగాణకు తరలివస్తున్న వలస కార్మికుల వివరాలను నమోదు చేసే యంత్రాంగం, విధానం కూడా లేదు.

ముఖ్యంగా పట్టణ, నగర ప్రాంతాలలో ప్రైవేట్ రంగంలో కార్మికుల, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, వారికి ఆయా సంస్థలలో నియామక పత్రాలు, వేతన రసీదులు, సామాజిక సంక్షేమ పథకాలు ఉండవు. పని గంటలు, సెలవులు కూడా నిర్దిష్టంగా ఉండవు. అదనపు పని గంటలు పని చేస్తే, అదనపు వేతనం చెల్లిస్తారన్న గ్యారంటీ లేదు. ఇవన్నీ ప్రైవేట్ రంగ ఉద్యోగులకు, కార్మికులకు అందేలా చూడాల్సిన బాధ్యత కార్మిక శాఖపై ఉంది. కానీ గత మూడు దశాబ్దాలుగా కార్మిక శాఖ ఆ బాధ్యత తనది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నది.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రైవేట్ రంగంలో ఉపాధి పొందుతున్న వారి ఆదాయాలు స్పష్టంగా తెలుసుకునే అవకాశం ఎంత మాత్రం లేదు. కాబట్టి రేషన్ కార్డు కావాలనుకున్న ప్రతి కుటుంబం మార్గదర్శకాలకు అనుగుణంగా స్వయం ప్రకటిత డిక్లరేషన్‌తో, ఆదాయం చెప్పి దరఖాస్తు చేసుకుంటున్నది. ఆయా కుటుంబాల వద్దకు ఎంక్వైరీకి వెళ్ళిన రెవెన్యూ సిబ్బంది, తమ విచక్షణతో దానిని ఆమోదించడమో తిరస్కరించడమో చేస్తున్నారు.

కానీ నిజానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో దినసరి కూలీలను, పీస్ రేట్లపై పని చేస్తున్న హమాలీ కార్మికులను, ఇళ్ళలో పనిచేసే లక్షలాది మహిళా కార్మికులను, స్వయం ఉపాధి శ్రామికులను, ప్రైవేట్ రంగ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులను, ఉద్యోగులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలలోనూ, ప్రభుత్వంలోనూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను, కార్మికులను, గత ఐదారేళ్లుగా కొత్తగా రంగంలోకి వచ్చిన గిగ్ అండ్ ప్లాట్‌ఫారం శ్రామికులను, ముఖ్యంగా రవాణా రంగంలో వచ్చిన ఓలా, ఊబర్ లాంటి ప్రైవేట్ సంస్థలలో స్వంత కారుతో, లేదా కారు కిరాయికి తీసుకుని జీవనోపాధి ఏర్పాటు చేసుకుని క్యాబ్ నడుపుకుంటున్న వారిని, ఇతర ప్రమాణాల రీత్యా పేదరికంలో ఉన్న వారిగా పరిగణించాలి. వారికి రేషన్ కార్డు మంజూరు చేయడానికి, ఇప్పటి వరకూ అమలైన మార్గదర్శకాలలో వెంటనే మార్పులు చేయాలి.

కాబట్టి గ్రామీణ ప్రాంతంలో రేషన్ కార్డు జారీకి కుటుంబానికి ప్రస్తుతమున్న సంవత్సరానికి లక్షన్నర ఆదాయ పరిమితిని మూడు లక్షల రూపాయలకు, పట్టణ ప్రాంతాలలో సంవత్సరానికి ప్రస్తుతమున్న రెండు లక్షల ఆదాయ పరిమితిని మూడు లక్షల అరవై వేల రూపాయలకు పెంచాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఈ వేతనం లోపు ఉన్న కుటుంబాలకు ఆహార భద్రత కోసం రేషన్ కార్డు అందేలా చర్యలు చేపట్టాలి.

గ్రామీణ ప్రాంతంలో భూముల విలువలు పెరిగిన మాట నిజమే కానీ, వ్యవసాయంపై ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. ఎన్ఎస్ఎస్‌ఓ నివేదిక ప్రకారం ఐదు ఎకరాలలోపు రైతు కుటుంబ ఆదాయం నెలకు రూ.9400 మాత్రమే. పైగా చాలా కాలంగా తెలంగాణ రాష్ట్ర భూములలో మాగాణి, మెట్ట భూముల వర్గీకరణ చేయడం లేదు. కాబట్టి, రేషన్ కార్డు జారీకి ఇప్పటి వరకూ ఉన్న మాగాణి మూడు ఎకరాలు, మెట్ట ఏడున్నర ఎకరాలు అనే నిబంధన తొలగించి, 5 ఎకరాలలోపు సన్న, చిన్నకారు రైతులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి.

ఇంట్లో ఉన్న గదుల సంఖ్యను బట్టి ఒక నిర్ధారణకు రావడం కూడా పారదర్శకంగా లేదు. ఇది కూడా అధికారుల విచక్షణపై మాత్రమే అమలయ్యే నిబంధన. సిబ్బంది అవినీతికి అవకాశం ఇచ్చే నిబంధన. కాబట్టి సిబ్బంది విచక్షణాధికారం నుండీ దీనిని తొలగించి, ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా, 100 చదరపు మీటర్ల లోపు ఇళ్లను లేదా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం ఉండే ఇళ్లను (రెండిటిలో ఏదైనా) రేషన్ కార్డు పొందడానికి అర్హమైన ఇళ్లుగా పరిగణనలో పెట్టుకోవాలని వచ్చిన ఒక సూచనను చర్చకు స్వీకరించాలి.

నిజానికి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి చిన్న ఇల్లు ఉండడం ఒక హక్కుగా మారాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాపితంగా ఇళ్ళు లేని పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని అంటోంది. ఈ నేపథ్యంలో స్వంత ఇంటి విస్తీర్ణంపై రేషన్ కార్డు జారీకి నిబంధనలలో తగిన సవరణలు చేయాలి.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడం ఎంత అవసరమో, అనర్హులకు తొలగించడం కూడా అంతే బాధ్యతగా చేయాలి. లేకపోతే వేల కోట్ల నిధులు దుర్వినియోగం అవుతాయి. అలాగే రేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియను అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా నిరంతరం కొనసాగించాలి. ఎప్పటికప్పుడు తగిన విచారణ చేసి కార్డులు మంజూరు చేయాలి.

■ కన్నెగంటి రవి
తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

కలిసి నిర్ణయం తీసుకున్నాక కప్పదాట్లు తగవు!

'ఫార్ములా – ఈ రేస్'కు సంబంధించి ఆర్థిక లావాదేవీల విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణ చేసిన తెలంగాణ ప్రభుత్వ అవినీతి నిరోధక శాఖ– ఈ అంశంలో మాజీ మంత్రి కేటీ రామారావు, సివిల్ సర్వెంట్ అర్విందర్ కుమార్‌లపై కేసు నమోదు చేసింది. సరైన విధి విధానాలను పాటించకుండా రేసింగ్ కంపెనీకి నిధుల బదిలీ జరిగిందనీ, ఈ వివరాలను ఏసీబీ దర్యాప్తులో అర్వింద్ కుమార్ బైటపెట్టారనీ మీడియా వెల్లడించింది. మాజీ మంత్రి కేటీ రామారావు ప్రభుత్వ ఆర్థికశాఖ అనుమతి లేకుండా హెచ్‌ఎండీఏ నుంచి నిధులను విడుదల చేయమని తనను ఆదేశించినట్లు అర్వింద్ కుమార్ తెలిపారట. ప్రజాస్వామ్య వ్యవస్థలో, ఒక మంత్రి – సివిల్ సర్వెంట్ కలిసి ఉమ్మడిగా ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత, ఆ నిర్ణయానికి తన వంతు బాధ్యతను సివిల్ సర్వెంట్ పూర్తిగా విస్మరించి, తనకు ఏమీ సంబంధం లేదని చెప్పడం సబబా కాదా అనే అంశం మీద కూలంకషంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది.

మంత్రులతో మాట్లాడే సందర్భంలో ప్రతి చిన్న విషయానికీ 'అవును సార్' అనే అలవాటు కొందరు ఐఏఎస్ అధికారులకు ఉంటుంది. మంత్రితో అవసరం తీరిన తరువాత ఇలాంటి వారు 'బ్లేమ్ గేమ్' ఆడటం మొదలుపెడతారు. తప్పంతా మంత్రిదేనని, తాము పరిశుభ్రంగా ఉన్నామని వాపోతారు. పాలనాపరమైన సద్భావనకు, బాధ్యత లేని దృక్పథానికి ఇది ఒక దుష్టసంకేతం. సమయ సందర్భాలకు అనుగుణంగా ఆచరణాత్మక సలహాలు ఇవ్వడం కొందరు సివిల్ సర్వెంట్లకు చేతకాకపోవచ్చు. అయితే, అలా ఇవ్వడానికి ఏ మాత్రం భయపడని పలువురు సివిల్ సర్వెంట్లు గతంలోనూ, ఇప్పుడూ ఉన్నారు. ఇకముందూ ఉంటారు.

మంత్రిని మెప్పించడానికి సివిల్ సర్వెంట్ చట్టపరమైన విధివిధానాలకు భిన్నంగా అత్యుత్సాహం ప్రదర్శించి, మంత్రితో కలిసి నిర్ణయం తీసుకుని, ఆ తర్వాత ఆ నిర్ణయం విషయంలో పదవి కోల్పోయిన మంత్రిని తప్పుబట్టడం సరైంది కాదు. ఒకసారి మంత్రితో కలిసి సివిల్ సర్వెంట్ నిర్ణయం తీసుకున్న తరువాత వారిద్దరూ తత్సంబంధమైన విషయంలో తప్పొప్పులకు పూర్తి బాధ్యత వహించాలి. తమ పాత్రను అంగీకరించాలి. అధికారి పూర్తిగా మంత్రిని తప్పుపట్టడం లేదా మంత్రి అధికారిని తప్పుపట్టడం సరైనది కాదు.



ఉదాహరణకు, పీవీ నరసింహారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం జరుగుతున్న సందర్భంలో, అప్పుడు రాళ్ల దాడులు జరుగుతున్న విజయవాడకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే అక్కడ చోటుచేసుకున్న పరిస్థితుల దృష్ట్యా ఆ పర్యటనను విరమించుకోవాలని నాటి కలెక్టర్, ఎస్పీ ఆయనకు సలహా ఇచ్చారు. కానీ రాజకీయ పరిణామాల దృష్ట్యా పీవీ వెళ్ళేందుకే నిర్ణయించుకున్నారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐసీఎస్ అధికారి వల్లూరి కామేశ్వర రావు (వీకే) కూడా కలెక్టర్, ఎస్పీల సలహా వినడమే మంచిదని సూచించారు. కానీ పీవీ, "మీరు నా కింద పనిచేసే ఉద్యోగి. దయచేసి నా ఆదేశాలను అమలు చేయండి. నేను వెళ్లడానికి ఏర్పాట్లు చేయండి" అన్నారు. అంటూనే ప్రయాణానికి సిద్ధమై వాహనం తయారుగా ఉంచమని ఆదేశించారు. ఆశ్చర్యకరంగా, వీకే రావు డ్రైవర్‌ను కారు తీసుకురావద్దని ఆదేశించినట్లు పీవీకి తెలిసింది. అదేమని అడిగితే– "అవును సార్, నేను మీ కింద పనిచేసే ఉద్యోగినే. అలాగే, డ్రైవర్ నా కింద పనిచేసే ఉద్యోగి. అతను నా ఆదేశాలను పాటిస్తాడు. అందుకే రాలేదు" అని ప్రధాన కార్యదర్శి ముఖ్యమంత్రికి సవినయంగా, నిశ్చయంగా తెలియచేశారు. పీవీ ఆ ప్రయాణాన్ని మానుకున్నారు. మరుసటి రోజు పీవీ వల్లూరిని ప్రశంసిస్తూ, "నేను నిన్న వెళ్ళి ఉంటే ఉద్రిక్తతలు మరింత పెరిగేవి. మీరు నన్ను ఆపి మంచి పని చేసారు" అన్నారు. ఆదర్శప్రాయమైన సివిల్ సర్వెంట్ల నిబద్ధతకు, ముఖ్యమంత్రుల వినయానికి ఇది ప్రతీక అని ఈ విషయాన్ని నాతో చెప్పిన భండారు శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు.

అలాగే, నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, చిత్తూరు పర్యటనలో భాగంగా అక్కడి ప్రభుత్వ అతిథి గృహంలో ఉండాలనుకున్న గదిని, ఇంచుమించు అదే సమయంలో రావాల్సిన మాజీ గవర్నర్ జనరల్ సీ.రాజగోపాలాచారికి కేటాయించటంతో, సంజీవరెడ్డిని వేరే గదిలో ఉండమని కలెక్టర్ బీకే రావు చెప్పారు. ఒకవేళ అదే గదిలో ఉన్నప్పటికీ రాజాజీ రాగానే, ప్రోటోకాల్ ప్రకారం, ముఖ్యమంత్రి ఖాళీ చేయాల్సి ఉంటుందని మర్యాదపూర్వకంగా చెప్పారు. ఆ రోజు రాజాజీకి స్వాగతం చెప్పేందుకు కొంచెం ముందుగానే బీకే రావు ఎస్పీ గురునాథరావుతో కలిసి అతిథి గృహానికి చేరుకున్నారు. పాత్రికేయుడు జీ కృష్ణ కథనం ప్రకారం– బీకే రావుతో ముఖ్యమంత్రి సంజీవరెడ్డి సరదాగా, "ఓహ్! నన్ను ఖాళీ చేయించడానికి మీరు పోలీసు అధికారితో వచ్చారా!" అన్నారట. అందరూ నవ్వుకున్నారు. ముఖ్యమంత్రి తనకు కేటాయించిన గదికే మారిపోయారు. ఇది కలెక్టర్ సలహా ఇచ్చే విధానం, అది ముఖ్యమంత్రి దాన్ని స్వీకరించిన విధానం.

ఎస్ఆర్ శంకరన్ భూ సంస్కరణలు, గిరిజన హక్కుల రక్షణను బలంగా సమర్థించడానికి ఉద్దండ రాజకీయ నేతలతో, ప్రజాప్రతినిధులతో ఢీకొనాల్సి వచ్చింది. చివరకు ఆయన ఆలోచనలు విజయం సాధించి, రాష్ట్రంలోని గ్రామీణ అభివృద్ధికి పునాదిగా నిలిచాయి. టీఎన్ శేషన్ భారత ఎన్నికల ప్రక్రియను సంస్కరించడానికి రాజకీయ నాయకులను దీటుగా ఎదుర్కొన్నారు. హర్యానాలో రాబర్ట్ వాద్రాకు చెందిన స్కైలైట్ హాస్పిటాలిటీకీ, రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్ఎఫ్‌కూ మధ్య జరిగిన భూమి ఒప్పందాన్ని ఐఏఎస్ అశోక్ కేమ్కా ధైర్యంగా రద్దు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో యమునా, హిండాన్ నదీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టడానికి దుర్గ శక్తి నాగపాల్ ధైర్యంగా, నిబద్ధతతో పనిచేశారు. కర్ణాటకలో భూముల కేటాయింపుల్లో అక్రమాలను రోహిణి సింధూరి బహిర్గతం చేశారు. ఆమె పట్టుదల ప్రజా భూముల పునరుద్ధరణకు, ప్రాజెక్ట్ సంస్కరణలకు దారి తీసింది. ఈ కొద్ది ఉదాహరణలు కొంతమంది ఐఏఎస్ అధికారుల ధైర్యానికి, నిబద్ధతకు, పారదర్శకతకు, దూరదృష్టికి, నైతిక ప్రమాణాలకు, ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనం. సర్దార్ పటేల్ చెప్పినట్లు– ఐఏఎస్ అధికారులు కర్తవ్యనిర్వహణలో, అనుభవపూర్వకంగా సలహాలూ సూచనలు ఇవ్వడంలో ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. దేశ భవిష్యత్తు వీరిపైనే ఆధారపడి ఉంటుంది.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత సివిల్ సర్వెంట్లపై ఉన్నది. ముఖ్యమంత్రి లేదా మంత్రి ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ వారి పట్ల వీరి పాలనాపరమైన దృక్పథం ఒకే రీతిలో ఉండాలి. తమ అనుభవానికి అనుగుణంగా, చట్టబద్ధ విధి విధానాలకు కట్టుబడి, ఆ ముఖ్యమంత్రికి గానీ మంత్రికి గానీ, లేదా ప్రధానమంత్రికైనా గానీ, తగు సమయంలో విలువైన సూచనలు అందించాలి. సివిల్ సర్వెంట్ సరైన సందర్భంలో సరైన సమాచారాన్ని అందించడంలో విఫలమైనా, లేదా తప్పు సలహా ఇచ్చినా, నిర్ణయ విధాన ప్రక్రియ తెలిసి కూడా ఆ విషయం వివరించకపోయినా అది వారి పనితీరులో వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుంది. అయితే, సివిల్ సర్వెంట్ ఇచ్చిన సలహా ఆధారంగా (రాతపూర్వకంగా ఇవ్వడం తప్పనిసరి) మంత్రి తనదైన పద్ధతిలో తుది నిర్ణయం తీసుకున్న తర్వాత, సివిల్ సర్వెంట్ దాన్ని అమలు చేయాలి. బాధ్యతను ఇరువురు సరిసమానంగా పంచుకోవాలి.

మంత్రిని మెప్పించడానికి సివిల్ సర్వెంట్ చట్టపరమైన విధివిధానాలకు భిన్నంగా అత్యుత్సాహం ప్రదర్శించి, మంత్రితో కలిసి నిర్ణయం తీసుకుని, ఆ తర్వాత ఆ నిర్ణయం విషయంలో పదవి కోల్పోయిన మంత్రిని తప్పుబట్టడం సరైంది కాదు. అలా చేస్తే సివిల్ సర్వెంట్‌గా ఉండటం అర్థరహితం. పాలనాపరమైన ప్రభుత్వ నిర్ణయాల విషయంలో, ముఖ్యంగా ఆర్థికపరమైన లావాదేవీలకు సంబంధించిన విషయాలలో, ఒకసారి మంత్రితో కలిసి సివిల్ సర్వెంట్ నిర్ణయం తీసుకున్న తరువాత వారిద్దరూ తత్సంబంధమైన విషయంలో తప్పొప్పులకు పూర్తి బాధ్యత వహించాలి. తమ పాత్రను అంగీకరించాలి. అధికారి పూర్తిగా మంత్రిని తప్పుపట్టడం లేదా మంత్రి అధికారిని తప్పుపట్టడం సరైనది కాదు.

మంత్రిది తుది నిర్ణయం కావచ్చు. కానీ సివిల్ సర్వెంట్ తనవంతుగా మంత్రికి ఇచ్చిన తన సలహాను, మంత్రి స్పందనను, దరిమిలా ఇచ్చిన ఆదేశాలను.. ఆ నిర్ణయం అమలుకు ముందు రికార్డు చేయాలి. ఇది సివిల్ సర్వెంట్ ప్రత్యేక బాధ్యత. సివిల్ సర్వెంట్లు ఉమ్మడి బాధ్యతల విషయంలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా సలహా ఇచ్చి, తప్పును తప్పనీ ఒప్పును ఒప్పనీ స్పష్టంగా సంబంధిత మంత్రికి తెలియచెప్పి, భారత ప్రజాస్వామ్యంలోని ఐఏఎస్ అనే 'స్టీల్ ఫ్రేమ్' (ఉక్కు చట్రం) సమర్థవంతంగా పనిచేయడానికి తోడ్పడాలి. వారు విఫలమైతే, ప్రజలకు ప్రభుత్వ పాలనపై నమ్మకం సన్నగిల్లుతుంది.

• వనం జ్వాలానరసింహారావు

ప్రశాంతంగా ప్రారంభమైన జేఈఈ మెయిన్స్

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జగిరినట్లు సిటీ కోఆర్డినేటర్ కె.శ్రీలతరెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 1,258 మంది హాజరు కావాల్సి ఉండగా, 1,220 మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో 1,259 మంది హాజరు కావాల్సి ఉండగా 1,225 మంది హాజరు కాగా, 34 మంది గైర్హాజరయ్యారు. కాగా, సిటీ కో ఆర్డినేటర్ శ్రీలతరెడ్డి అయాన్ డిజిటల్ సెంటర్, మోక్షిత కంప్యూటర్స్, మోక్షిత్ కంప్యూటర్స్, నోబుల్ టెక్నాలజీస్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- 10వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



10వ డివిజన్‌లోని హనుమాన్ దేవాలయం నుంచి అలంకార్ జంక్షన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ చౌరస్తా, జనవరి 22: (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ 10వ డివిజన్ న్యూ బస్టాండ్ హనుమాన్ దేవాలయం నుంచి అలంకార్ జంక్షన్ వరకు స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 10వ డివిజన్ పరిధిలోని హనుమాన్ దేవాలయం నుంచి అలంకార్ జంక్షన్ వరకు స్మార్ట్ సిటీ నిధులు రూ.3కోట్ల 50లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో 10వ డివిజన్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆనతి కాలంలోనే పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరంలోని రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక డివిజన్‌కు చెందిన ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, స్థానిక డివిజన్ కాంగ్రెస్ నాయకులు కుమార్, శ్రీకాంత్, రోహిత్‌సింగ్ ఠాకూర్, రమేష్, సతీష్, జాఫర్, సోమిరెడ్డి, రవికుమార్, శ్రీనివాస్, శశిగౌడ్, తోట ప్రకాష్, బండారి మహేందర్, పోలు లక్ష్మణ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం



- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలుకు సర్కారు సన్నాహాలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందిచేందుకు కసరత్తు
- రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 6,486 మంది ఇంటర్ విద్యార్థులు
- మధ్యాహ్న భోజన అమలుతో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టేందుకు కసరత్తులు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ప్రభుత్వం సేకరించి సాధ్యసాధ్యాలను బేరీజు వేసుకుంటోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఇంటర్మీడియెట్ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలతో ప్రతిపాదనలను సిద్ధం చేసే పనిలో పడింది. అయితే అంతా కుదిరితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందనుంది. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభిస్తే కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తే వరంగల్, హనుమకొండ రెండు జిల్లాల్లో ఇంటర్ చదువుతున్న మొత్తం 6,486 మంది విద్యార్థులు (వచ్చే విద్యా సంవత్సరం సుమారు 7 వేల మంది విద్యార్థులు) లబ్ధిపొందుతారు.

విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం

ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే ప్రభుత్వ జూనియర్ కళాశా లల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతోపాటు డ్రాపవుట్లు త గ్గుముఖం పడుతుందని విద్యారంగ నిపుణలు చెబుతున్నా రు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలన్నీ నియోజకవర్గ, మం డల కేంద్రాల్లోనే ఉంటుండటంతో ఆయా కేంద్రాల పరిధి లోని గ్రామాల నుంచి సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థు లు కళాశాలలకు వస్తున్నారు. వీరు సుదూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పొద్దున్నే భోజనం తీసు కొచ్చే వీళ్లేని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వరం కా నుంది. మధ్యాహ్న భోజన పథకం గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు భోజనం తెచ్చుకోకపోవడంతో ప్రస్తుతం ఇండ్లకు వెళుతున్నారు. దీంతో మధ్యా హ్నం తర్వాత కళాశాలల్లో గైర్హాజరు శాతం పెరుగుతుంది. మధ్యాహ్న భోజనంతో గైర్హాజరు శాతాన్ని తగ్గే అవకాశం ఉంది.

రెండు జిల్లాల్లో..

వరంగల్ జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సారాల్లో 2,408 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 4,078 మంది ఉన్నారు. రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 6,486 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తే వచ్చే విద్యా సంవత్సరానికి ఈ సంఖ్య సుమారు 7 వేల నుంచి 8 వేలకు పెరిగే అవకాశం ఉంది. అంటే.. ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం మధ్యాహ్న భోజనం అందజేస్తే సుమారు 8 వేల మంది విద్యార్థులు లబ్దిపొందే అవకాశం ఉంది.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి..

ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలయ్యే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వంలోనూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తామనే నిర్ణయం ప్రతిపాదనలకే పరిమితమైంది. అయితే ఈ ప్రభుత్వమైనా నిబద్ధతతో బడ్జెట్‌లో ప్రత్యేకమైన నిధులు కేటాయిస్తే తప్ప పథకం పట్టాలెక్కే పరిస్థితి ఉండదని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇప్పటికే ప్రతిపాదనలను సిద్ధం చేసిన ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారులు ప్రభుత్వానికి సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది..



డాక్టర్ శ్రీధర్ సుమన్, వరంగల్ డీఐఈవో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలాగే మధ్యాహ్నం పూట పెరుగుతున్న గైర్హాజరు శాతం తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల బాట పట్టేందుకు అవకాశం ఉంటుంది.


ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు

గ్రామ సభలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని వరంగల్ కలెక్టర్ సత్యశారద కోరారు. బుధవారం మండలంలోని కడారి గూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు పేద ప్రజలకు ఇచ్చేందుకు నిరంతర ప్రక్రియ అన్నారు. ఇంకా దరఖాస్తు చేసుకోవాల్సిన వ్యక్తులు ఉంటే అధికారులకు ఇవ్వాలని సూచించారు. పథకాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటికి ఎలాంటి గడువు పెట్టలేదని స్పష్టం చేశారు. పేర్లురాని వారు ఉంటే అధికారులకు తిరిగి దరఖాస్తు చేయాలని, ఎలాంటి అనుమానులు ఉన్నా అధికారులతో మాట్లాడి నివృత్తి చేసుకోలన్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరిని పారదర్శకంగా గుర్తించే గ్రామ సభలో ఎంపిక చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, తహసీల్దార్ విజయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఉర్సు మాషూక్ రబ్బానీ దర్గా, పరిసర ప్రాంతం

ఉప్పొంగిన ఉర్సు

- ప్రారంభమైన మాషూక్ రబ్బానీ దర్గా ఉత్సవాలు
- సంధల్ సమర్పించిన పీఠాధిపతులు
- భక్తిశ్రద్ధలతో ప్రార్థన చేసిన ముస్లింలు
- పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు

కరీమాబాద్, జనవరి 22, (ఆంధ్రజ్యోతి): వరంగల్ కరీమాబాద్‌లో దర్గా ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాషుక్ రబ్బానీ రహమతుల్లా అలై 13వ తరానికి చెందిన వారసులు దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ ఉబేద్‌బాబా ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం అర్ధరాత్రి 12 గంటల తరువాత నయాగడి నుంచి సంధల్ (గంధ లేపనం)ను ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలోని మాషూక్ రబ్బానీ పవిత్ర సమాధి వద్ద సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగానే కాక దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి వేలసంఖ్యలో భక్తులు, మతగురువులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉర్సు దర్గా ప్రాంతం కిక్కిరిసిపోయింది. దర్గా పీఠాధిపతులు సంధల్ తీసుకువస్తున్న సందర్భంలో ఒళ్లు గగుర్పొడిచేలా ఫకీర్లు విన్యాసాలు చేశారు. సంధల్ అనంతరం ముస్లింలు సయ్యాదాన హజ్రత్ మాషూక్ రబ్బానీ రహమతుల్లా అలై పవిత్ర సమాధిని దర్శించుకొని పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి.

పోలీసు బందోబస్తు

దర్గా ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. దర్గా ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవకుండా దర్గా సమీపంలో నాలుగు వైపులా రహదారులను మూసి వేసి వాహనాలను దారి మళ్లించారు. వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ నేతృత్వంలో మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం బందోబస్తును పర్యవేక్షించారు. పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



దర్గాలోని పవిత్ర సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మంత్రి సురేఖ, తదితరులు

హాజరైన మంత్రి కొండా సురేఖ

దర్గా ఉత్సవాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు తదితరులు హాజరయ్యారు. వారికి దర్గా పీఠాధిపతులు ఉబేద్‌బాబా, నవీద్‌బాబా స్వాగతం పలికారు. దర్గాలోని పవిత్ర సమాధికి పూల్‌కీ చాదర్ సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకైన మాషూక్ రబ్బానీ దర్గా ఉత్సవాలకు మతాలకతీతంగా ప్రజలు హాజరవడం గొప్ప విషయమని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలని కోరుతూ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్, ముష్కమల్ల సుధాకర్, గడ్డం యుగేందర్, మంతెన సునిత, కేడల పద్మ, దాసి రాందేవ్, జబ్బార్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయండి

వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



హెల్మెట్ ధరించి బైకు ర్యాలీలో పాల్గొన్న సీపీ, డీటీసీ శ్రీనివాస్

వరంగల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యుల క్షేమం కోసమైనా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని రవాణాశాఖ ఉప కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీని అదనపు డీసీపీ రవి జెండా ఊపి ప్రారంభించగా, సీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ప్రమాదాల్లో అత్యధికంగా ద్విచక్రవాహనదారులు తలకు గాయాలై మరణిస్తున్నారని, వాహనదారులు తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరడం కోసం హెల్మెట్ ధరించడం తప్పనిసరిగా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హోంగార్డ్స్ ఏసీపీ నాగయ్య, జిల్లా రవాణాశాధికారి వేణుగోపాల్, ఎంవీఐలు కిషోర్‌బాబు, ఉదయ్, శ్రావ్య, రిజర్వుడ్ ఇన్స్‌పెక్టర్స్ స్పర్జన్‌రాజు, సతీష్, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హత్యకుగురైన ఆటోడ్రైవర్ రాజ్‌కుమార్ (ఫైల్)

నడిరోడ్డుపై దారుణహత్య

- ఆటో డ్రైవర్‌పై కత్తితో మరో ఆటో డ్రైవర్ దాడి
- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఘాతుకం
- హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో ఘటన

4

'జంక్షన్'కు ప్రగతి వెలుగులు

- రూ.24.45 కోట్లతో కాజీపేట రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి
- అమృత్ భారత్ పథకంలో నిధుల విడుదల
- ఆరునెలల్లో పనులు పూర్తి చేసేందుకు కసరత్తు

కాజీపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కాజీపేట రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.24.45 కోట్లతో రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నిధులతో స్టేషన్ ముఖద్వారం అభివృద్ధి, స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పుతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, టాయిలెట్స్ వెయిటింగ్ హాల్స్ గ్రీనరీ, తదితర పనుల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందించాలనే దృక్పథంతో భారీ స్థాయిలో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) పథకంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా 40 రైల్వే స్టేషన్‌ల అభివృద్ధికి గాను రూ.2,737కోట్ల అంచనాతో ప్రధాని మోదీ ఆగస్టు 2023, ఫిబ్రవరి 2024లో రెండు దఫాలుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. పునరాభివృద్ధిలో 40 రైల్వే స్టేషన్‌లలో భాగంగా కాజీపేట రైల్వేస్టేషన్ ఒకటి. ఇదిలాఉండగా అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో కాజీపేట అభివృద్ధి పనులు పూర్తయ్యాక కాజీపేట జంక్షన్ మోడల్ ఎలా వుంటుందో తెలిపే ఫోటో చిత్రాలను బుధవారం సికింద్రాబాద్‌లో రైల్వే ఉన్నతాధికారులు విడుదల చేశారు.





అమృత్ భారత్ పనులు పూర్తయ్యాక కాజీపేట రైల్వే స్టేషన్ ఊహా చిత్రం

కాజీపేట జంక్షన్‌కు ప్రాధాన్యం

కాజీపేట రైల్వే స్టేషన్‌కు 19వ శతాబ్దంలో ప్రత్యేక స్థానం వుంది. ఈ స్టేషన్ నిజామ్ గ్యారెంటెడ్ స్టేట్ రైల్వేలో భాగంగా 1888లో నిర్మించారు. కాజీపేట నుంచి బొగ్గు, పత్తి, ఇతర వస్తువుల రవాణాలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ మధ్యనే ఈ స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల విస్తరణ, అదనపు రైల్వే ట్రాక్‌ల నిర్మాణం చేపట్టింది. ప్రతీ రోజు ఇక్కడి నుంచి 98 రైళ్లు రాకపోకలు సాగుతుంటాయి. ప్రస్తుతం కాజీపేటలో రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్‌ల తయారీ పరిశ్రమ నిర్మాణంతో రైల్వే పరంగా కాజీపేట రైల్వే జంక్షన్ దేశవ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కింది.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

గ్రామసభలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



రాయపర్తి గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

నడికూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. నడికూడ మండలంలోని ముస్త్యాలపల్లి, రాయపర్తి, ధర్మరం, వరికోల్ గ్రామాలలో గ్రామసభలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య హాజరై మాట్లాడారు. జాబితాలో పేరు లేనివారు ఆందోళన చెందవద్దని గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ చేతన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పర్నం మల్లారెడ్డి, దేవేందర్ రెడ్డి, ఆయా గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణను పరిశీలించిన కలెక్టర్

పరకాల: పరకాల పట్టణంలోని కోర్టును జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కోర్టులోని సమస్యలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండెల భద్రయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సబ్‌జైల్ ఎక్స్‌టెన్షన్ చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్టు

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు సుబేదారి సీఐ పి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయల గూడెంకు చెందిన సన్నిధి ఆంజనేయులు ఆలియాస్ అంజి కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. జల్సాలకు అలవాటుపడడంతో వచ్చే డబ్బులు సరిపోయేవికావు. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు పాల్పడ్డాడు. ఇటీవల బాలసముద్రంలోని చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని తాళంవేసి ఉన్న ఓ ఇంటిలో బంగారం, వెండి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. బుధవారం హంటర్‌రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. నేరాలను ఒప్పుకున్నట్లు తెలపడంతో నిందితుడి నుంచి రూ.50వేల విలువ గల 5గ్రాముల బంగారం, 61 గ్రాముల వెండి స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గాలిబ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి పట్టివేత

కాజీపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో ఇద్దరి వ్యక్తుల నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.. ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేటలో బుధవారం తనిఖీలు చేస్తుండగా ఒడిస్సాకు చెందిన దిలీప్, సంజయ్ అనే ఇద్దరి వ్యక్తుల నుంచి 4కిలోల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. ఇదిలా వుండగా, బాహూజీనగర్‌లో అనుమతులు లేకుండా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.8200 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయిని దహనం చేసిన పోలీసులు

వరంగల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడ్డ గంజాయిని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఆదేశాలమేరకు బుధవారం కమిషనరేట్ పోలీసులు దహనం చేశారు. 32 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.2.1కోట్ల విలువచేసే 807కిలోల గంజాయిని కాజీపేట మండలంలోని అమ్మవారిపేట శివారులోని కాకతీయ మెడిక్లిన్ సర్వీస్‌లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవిందర్, అదనపు డీసీపీ రవి, ఎస్సైలు పాల్గొన్నారు.



గంజాయిని దహనం చేస్తోన్న పోలీసులు

ఊపందుకున్న వేరుశనగ కొనుగోళ్లు

జనగామ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ కొనుగోళ్లు ఊపందుకున్నాయి. సీజన్ ఆరంభం కావడంతో మార్కెట్‌కు పెద్ద మొత్తంలో వేరుశనగను రైతులు తీసుకొస్తున్నారు. జనగామ మండలంతో పాటు రఘునాథపల్లి, లింగాలఘనపురం, దేవరుప్పుల, పాలకుర్తి మండలాల నుంచి రైతులు వేరుశనగను మార్కెట్‌కు తెస్తున్నారు. వేరుశనగకు కనీస మద్దతు ధర రూ.6783 కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. కాగా.. తేమ శాతాన్ని బట్టి ట్రేడర్లు ధరను చెల్లిస్తున్నారు. జనగామ మార్కెట్‌లో 15 రోజుల్లో 133 మంది రైతులకు చెందిన 440.70 క్వింటాళ్ల వేరుశనగను కొనుగోలు చేశారు. వేరుశనగకు క్వింటాల్‌కు అత్యధికంగా రూ.7220, అత్యల్పంగా రూ.6400, సగటు ధర రూ.6900గా పలికింది. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివరాజ్‌యాదవ్ బుధవారం వేరుశనగ కొనుగోళ్లను పరిశీలించి మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని తెలిపారు.

మార్కెట్‌కు మరిన్ని సౌకర్యాలు

- అందుబాటులోకి రానున్న మిర్చిలో తేమను కొలిచే పరికరాలు
- నాబార్డు, స్పైస్‌బోర్డు సంయుక్తంగా ఏర్పాటుకు కసరత్తు

వరంగల్ వ్యవసాయం, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల మార్కెట్‌కు మరిన్ని ఆధునిక పరికరాలు రాబోతున్నాయి. ఇప్పటివరకు పత్తిలో తేమశాతాన్ని కొలిచే (మాయిశ్చరైజ్ మిషన్) యంత్రాలు మాత్రమే ఉన్నాయి. కానీ త్వరలో మిర్చిలో సైతం తేమను కొలిచే యంత్రాలు కూడా రాబోతున్నాయి. బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, నాబార్డు జీఎం చంద్రశేఖర్, స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ విజిష్ణ, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి తదితరులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు.

రైతులకు, వ్యాపారులకు ఉపయోగం..?

మిర్చిలో మాయిశ్చరైజ్ మిషన్లు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు, వ్యాపారులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు విర్చిని పట్టుకుని ఒక అంచనాకు వచ్చి దాని ప్రకారం ధర నిర్ణయిస్తున్నారు. దీంతో రైతులకు అన్యాయం జరుగుతోంది. మిషన్ ఏర్పాటు చేస్తే తేమ శాతం ఎంత ఉందో తెలిసిపోతుంది. దాన్ని బట్టి ధర లభిస్తుంది. ఎటువంటి అవకతవకలకు తావుండదు. అంతేగాకుండా ఈ యంత్రాల ద్వారా మిర్చిలో ఉన్న తేమ శాతాన్ని తెలుసుకోవడంతో పాటు అందులో నలుపులు, కెమికల్ కంటెంటు, కలర్ కంటెంటు, ఇలా అన్ని విషయాలు తెలుస్తాయి.



ఏనుమాముల మార్కెట్లో నాబార్డు, స్పైసెస్ బోర్డు అధికారులు, వ్యాపారులతో సమావేశమైన మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మల

అమలు తీరుపై అనుమానాలు

మిర్చిలో మాయిశ్చరైజ్ మిషన్ ఏర్పాటు చేయడాన్ని ఇటు రైతులు, అటు వ్యాపారులు స్వాగతిస్తున్నారు. అయితే అవినిరంతరం పనిచేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఎందుకంటే ప్రస్తుతం మార్కెట్లో ఉన్న మిర్చిని పరీక్ష చేసే ల్యాబ్, యంత్రాలు పనిచేయడంలేదు. వాటిని వినియోగించేందుకు సిబ్బంది లేరని పక్కన పడేశారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసే మిషన్లను కూడా అదే విధంగా చేస్తే ప్రయోజనం ఉండదని రైతులు, వ్యాపారులు అంటున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మడికొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, తెలంగాణ గురుకుల విద్యా సంస్థలో 2025-26 విద్యాసంవత్సంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఇంగ్లీష్ మీడియం 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు బుధవారం గురుకులాల హనుమకొండ జిల్లా సమన్వయ అధికారిని(డీసీవో) దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 5వ తరగతిలో ప్రవేశాల కోసం ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీ లోగా రూ.100 రుసుము చెల్లించి కులం, ఆదాయం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 6 నుంచి 9వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు, సైనిక్‌స్కూల్, ఫైన్‌ఆర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే గౌలిదొడ్డి, అలుగునూరు ప్రతిభ పాఠశాలల్లో 9వ తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీసీవో తెలిపారు.



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

సీపీని కలిసిన ఎల్కతుర్తి ఎస్సై

వరంగల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అక్కెనపెల్లి ప్రవీణ్‌కుమార్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, నిజాయితీతో పనిచేయాలని సూచించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని వడ్డెర బస్తీకి చెందిన మానస (30) కుటుంబ కలహాలతో మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంజె మానస భర్త గుంజె భరత్ కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొద్దిరోజులుగా మానసకు తన అత్త యాదమ్మతో గొడవలు జరిగినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి 7గంటల సమయంలో భర్త భరత్ బయటకు వెళ్లిన సమయంలో అత్త యాదమ్మకు మానసకు గొడవ జరిగింది.

దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని మానస ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా భర్త భరత్, అత్త యాదమ్మ వేధింపులతోనే మానస ఆత్మహత్యకు పాల్పడిందని మానస కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. సుబేదారి పోలీసులు ఎలాంటి గొడవలు జరుగకుండా పోలీసు సిబ్బందితో మానస ఇంటి వద్ద పహారా కాశారు. కొద్ది సేపు మానస బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మానస మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.



మానస మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



తీన్మార్ మల్లన్న, సుందర్‌రాజ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఈగ మల్లేశం

యుద్ధభేరి బహిరంగ సభ ప్రాంగణం పరిశీలన

హనుమకొండ కలెక్టరేట్, జనవరి22(ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2వ తేదీన నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభ ప్రాంగణాన్ని బుధవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల మండలి పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. హెలిక్యాప్టర్ ల్యాండింగ్, బహిరంగ సభకు పెద్దఎత్తున వచ్చే వాహనాలకు పార్కింగ్ సౌకర్యం, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సభ నిర్వహించుకునేందుకు తగిన చర్యలు చేపడతామని అన్నారు. లక్ష మంది బీసీలతో రాజకీయ యుద్ధభేరి సభను విజయవంతం చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వట్టి జానయ్య, మాద రజనికుమార్, అశోక్, శ్యాంయాదవ్, వంగ మహేష్, సంపత్ యాదవ్ తదితరులు ఉన్నారు. కాగా, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్‌ను బుధవారం కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల మండలి పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం తన నివాసంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్ చేసిన నిందితుడి అరెస్టు

వరంగల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరుజెండాలో మహిళ మెడలో నుంచి చైన్‌ను చోరీ చేసిన నిందితుడిని సీసీఎస్, హనుమకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసి రూ.3 లక్షల 60 వేల విలువ చేసే 45 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన ములక విజయ్‌కుమార్ హైద్రాబాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారడంతో వచ్చే ఆదాయం సరిపోక పరిచయస్థులు, స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడం, ఇదే క్రమంలో భార్యతో గొడవలు జరుగుతుండటంతో సులువుగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. దీని కోసం ఒంటరిగా ఉండే మహిళల మెడలో నుంచి బంగారాన్ని చోరీ చేసేందుకు సిద్ధపడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 20న మధ్యాహ్నం 12.15 ప్రాంతంలో కొత్తూరుజెండా ప్రాంతంలో ఓ మహిళ కూరగాయలు కొని తిరిగి ఇంటికి గేటు తీసే సమయంలో నిందితుడు ఒక్కసారిగా మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు సీసీఎస్, హనుమకొండ పోలీసులు అందుబాటులో ఉన్న టెక్నాలజీని అందిపుచ్చుకొని నిందితుడిని అరెస్టు చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో ఖమ్మం, జనగామ, వరంగల్, కాజీపేట, సుబేదారి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

పారా త్రోబాల్ క్రీడాకారిణికి ఎన్ఆర్ఐ సాయం

క్రిష్ణవేణికి చెక్కును అందించిన కేటీఆర్

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ పారాత్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన మాచర్ల క్రిష్ణవేణికి ఎన్ఆర్ఐ హరీష్‌రెడ్డి అందించిన రూ.90వేల చెక్కును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లో బుధవారం అందించారు. పారాత్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలక్షన్ కమిటీ తెలంగాణ నుంచి క్రిష్ణవేణిని ఇటీవల ఎంపిక చేసింది. క్రిష్ణవేణి మార్చి 28 నుంచి 30 తేదీ వరకు కాంబోడియా దేశ రాజధాని నగరం నామ్‌పెన్‌లో జరుగనున్న ఫస్ట్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నారు. అక్కడికి వెళ్లడానికి గాను ఖర్చులు క్రీడాకారులే భరించాల్సి ఉండడంతో నిరుపేద కుటుంబానికి చెందిన క్రిష్ణవేణి ఖర్చులు భరించే స్థితిలో లేదు. ఈ విషయం పలు వాట్సాప్ గ్రూపులు, ట్విట్టర్‌లో వైరల్ కావడంతో గమనించిన ఎన్ఆర్ఐ హరీష్‌రెడ్డి క్రీడాకారిణికి ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. బుధవారం హరీష్‌రెడ్డి తన తండ్రి ద్వారా చెక్కును కేటీఆర్‌కు పంపించి ఆయన చేతుల మీదుగా క్రీడాకారిణికి అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ క్రిష్ణవేణి మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని, భవిష్యత్‌లో ఆమెకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, బొల్లెపాక రాజేష్, జి.శివాజీ, పెసరు రమేష్, బి.సంపత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రిష్ణవేణికి చెక్కును అందిస్తున్న కేటీఆర్

భక్తుల గిరి ప్రదక్షిణ

ఆర్యవైశ్యుల అన్నదానం

జఫర్‌గడ్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భక్తజన వల్లభుడుగా ప్రసిద్ధి చెందిన మండల కేంద్రంలోని శ్రీవేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి వారి కొండ చుట్టూ బుధవారం భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. మహిమ గల స్వామి వారి కొండ చుట్టూ ప్రతీ నెల శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి జన్మనక్షత్రం పురస్కరించుకుని స్వాతి నక్షత్రం రోజున గత ఆరు నెలలుగా భక్తజనులు గిరి ప్రదక్షిణ చేస్తూ వస్తున్నారు. బుధవారం సుమారు 150 మంది భక్తులు స్వామి వారి కొండ దిగువన గల శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద నుంచి కాలినడకన బయలుదేరి జఫర్‌గడ్ పెద్ద చెరువు, గంటల గుడి (శివాలయం) మీదుగా వెళ్లి పాతూరులోని పురాతన అనంతపద్మనాభస్వామి, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పాతూరు మీదుగా తిరిగి జఫర్‌గడ్‌కు చేరుకున్నారు. కొండ చుట్టూ సుమారు 8 కిలోమీటర్ల దూరం పాటు మహిళలు, భక్తులు శ్రీలక్ష్మీనర్సింహస్వామిని కీర్తిస్తూ, జయజయ ధ్వానాలు చేస్తూ ప్రదక్షిణ గావించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ఆర్యవైశ్యులు అన్నదానం నిర్వహించారు. స్వామి వారి కృపాకటాక్షం కోసం, ప్రజలు సుభిక్షంగా జీవించేలా సల్లంగా చూడాలని ప్రదక్షిణ చేసినట్లు భక్తులు తెలిపారు.



జఫర్‌గడ్‌లోని రామాలయం నుంచి గిరి ప్రదక్షిణకు బయలుదేరుతున్న భక్తులు

నడిరోడ్డుపై దారుణహత్య

- ఆటో డ్రైవర్‌పై కత్తితో మరో ఆటో డ్రైవర్ దాడి
- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో ఘటన

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్ట పగలు.. మిట్ట మధ్యాహ్నం.. నగరం నడిబొడ్డు.. తీవ్ర జన సంచారం.. వాహనాల రాకపోకలతో బిజీగా ఉన్న ప్రధాన రహదారిపై ఓ ఆటో డ్రైవర్‌ను మరో ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఘాతుకంతో అక్కడున్నవారు భయాందోళనకు గురయ్యారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో జరిగింది. ఈ దారుణహత్యకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కాజీపేట మండలం మడికొండకు చెందిన మాచర్ల రాజ్‌కుమార్ (45) స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. ఆటో నడుపుకుంటూ రాజ్‌కుమార్ జీవిస్తున్నారు. అలాగే మడికొండ అయోధ్యపురానికి చెందిన ఈనుగు వెంకటేశ్వర్లు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే వెంకటేశ్వర్లుకు ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో కొన్నిరోజులుగా వివాహేతర సంబంధం ఉంది. కాగా, అదే మహిళతో రాజ్‌కుమార్ ఇటీవల సన్నిహితంగా ఉంటున్నాడు. ఇది గమనించిన వెంకటేశ్వర్లు రాజ్‌కుమార్‌పై కక్ష పెంచుకున్నాడు. మహిళ జోలికి రావొద్దని పలుమార్లు రాజ్‌కుమార్‌ను వెంకటేశ్వర్లు హెచ్చరించాడు. ఇదే విషయమై కొన్నిసార్లు గొడవపడ్డారు. ఈ క్రమంలో సదరు మహిళ వెంకటేశ్వర్లును దూరం పెట్టింది. దీంతో ఇద్దరిపై వెంకటేశ్వర్లు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో రాజ్‌కుమార్ ఆటోను, వెంకటేశ్వర్లు తన ఆటోతో వెంబడించి గొడవకు దిగాడు. ఇద్దరికి మాటామాటా పెరిగి వెంకటేశ్వర్లు తన ఆటోలో ఉన్న కత్తితో రాజ్‌కుమార్‌పై దాడి చేశాడు. రాజ్‌కుమార్ కిందపడిపోగానే కత్తితో తీవ్రంగా దాడి చేశాడు. అక్కడ ఉన్న స్థానికులు కత్తితో దాడి చేసిన వెంకటేశ్వర్లును అడ్డుకుని దేహశుద్ధి చేశారు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను సుబేదారి పోలీసులు ఎంజీఎంకు తరలించగా అప్పటికే రాజ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దాడి జరిగిన ప్రాంతానికి సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి, ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేరుకొని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాగా, సీసీ కెమెరాలలో దాడి ఘటన రికార్డు కావడంతో పోలీసులు పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.



హనుమకొండ అదాలత్ సెంటర్ సమీపంలో రాజ్‌కుమార్‌పై కత్తితో దాడి చేస్తున్న వెంకటేశ్వర్లు (తెల్లచొక్కా)

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2535	2160
పల్లికాయ (సూక)	6200	5600
పల్లికాయ (పచ్చిది)	4300	4100
కందులు	6382	5560
పెసళ్లు	2852	2800
పత్తి	7210	5800
పసుపు (కాడి)	12111	10234
పసుపు (గోల)	12011	10121
తేజ మిర్చి	14600	9000
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్ ఏసీ	15000	11500
యూఎస్341ఏసీ	13500	12300
యూఎస్ 341 కొత్తది	15500	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

చిన్న జాతరకు చక చకా..

ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మేడారం మినీ సంబురం

- 40లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా
- సౌకర్యాల కల్పనకు రూ.5.33కోట్లు మంజూరు
- పలుశాఖల ఆధ్వర్యంలో పనులు ప్రారంభం



ట్రాక్టర్లలో చెత్త తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది




మేడారం పరిసరాలలో డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

తాడ్వాయి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మేడారం మినీ జాతరకు సమయం సమీపిస్తోంది. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 15వతేదీ వరకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే సమ్మక్క సారలమ్మల మినీ జాతరకు పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ జాతరకు సుమారు 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో జాతర నిర్వహణతో పాటు, బయ్యక్కపేట, కొండాయి, పునుగొండ్ల, ఐలాపూర్, తదితర చిన్న జాతరల నిర్వహణల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.5.33కోట్ల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. అలాగే పలు శాఖల ఆధ్వర్యంలో అధికారులు ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించారు.

పలు శాఖల ఆధ్వర్యంలో పనులు

గిరిజన సంక్షేమం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.1.12కోట్లు వెచ్చించి ఐటీడీఏ, రెవెన్యూ మూడు అతిథి గృహాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, 2020లో కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న భక్తుల వసతి భవన్లలో నీటి వసతి, పారిశుధ్యం, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ మరమ్మతులు, పలు అభివృద్ధిపనులు, 2018లో నిర్మించిన 27 షాపింగ్ కాంప్లెక్స్‌లలో మరమ్మతు పనులు, పారిశుధ్య కార్మికుల వసతి షెడ్లలో మరమ్మతుల కోసం, బయ్యక్కపేట వనదేవతల జాతర నిర్వాహణ సౌకర్యాలు, ఐలాపూర్ జాతరలో నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, నీటి సరఫరా కోసం కొత్త బోరు, మోటార్ ఏర్పాటు, కొండాయి గ్రామంలో ఉన్న ఆర్చికి పెయింటింగ్, జాతర పరిసరాల్లో కాంపౌండ్‌వాల్ పనులను చేపట్టనున్నారు.

- గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ. 1.47 కోట్లు వెచ్చించారు. వాటితో మేడారంలో పూజారుల అతిథి భవనానికి సీసీ రోడ్డు, భవనం చుట్టూ ప్రహరీ, వంట షెడ్ నిర్మాణం, చిలకలగుట్ట రోడ్ నుంచి సమ్మక్క గుడి వరకు నూతన సీసీ రోడ్ నిర్మాణం, కన్నెపెల్లి సారలమ్మ గుడి వద్ద పూజారుల వసతి ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల ఏర్పాట్లు, బయ్యక్కపేట గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి తాళ్లతేగు వరకు నూతన సీసీ రోడ్‌తోపాటు మట్టి రోడ్ నిర్మాణం, పునుగొండ్ల గ్రామంలో పగిడిద్దరాజు గుడి వద్ద భూమి చదును పనులు, మహబూబబాద్ జిల్లాలోని గంగారం గ్రామంలోని పగిడిద్దరాజు గుడి వద్ద సీసీ రోడ్ నిర్మాణం చేయనున్నారు.
- నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 12.90లక్షల నిధులను వెచ్చించి మినీ జాతర నిర్వహణకు పనులను చేపట్టనున్నారు.
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 18.83లక్షల నిధులను వెచ్చించి ఊరట్టం నుంచి కొండాయి, కొండాయి నుంచి ఐలాపూర్, బయ్యక్కపేట నుంచి కాల్వపల్లి, కాల్వపల్లి నుంచి కన్నెపెల్లి వరకు మట్టి రోడ్ల మరమ్మతులు, బయ్యక్కపేట జాతర నిర్వహణ పనులను చేపట్టారు. అలాగే గద్దెలకు అతి సమీపంలోని 21 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనున్నారు.
- మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులను వెచ్చించి జంపన్నవాగు, శివరాం సాగర్ చెరువు లోతట్టు ప్రాంతంలో గజ ఈతగాళ్ల ఏర్పాటు చేయనున్నారు.
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ. 42లక్షల నిధులను వెచ్చించి మేడారం పరిసరాల్లో 100 కేవీ పది డీటీఆర్‌లు, 3/5 వైరు లైన్లు, స్పేసర్‌లు, డీటీఆర్‌ల చుట్టు ఫెన్సింగ్, విద్యుత్ సిబ్బంది కోసం వసతి పనులను చేపట్టారు.
- జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆధ్వర్యంలో రూ. 81.52 లక్షల నిధులతో జాతర పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. అందుకు పారిశుధ్య కార్మికులు, ఆదునిక యంత్రాలు, ట్రాక్టర్లు, డోజర్లు, ఎక్స్‌కవేటర్లు, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్, ఈగలు, దోమలు ప్రబలకుండా లీయోబయోలిక్ రసాయనాల పిచికారీ ఏర్పాట్ల పనులను చేపట్టారు.
- పౌర సమాచారశాఖ ఆధ్వర్యంలో రూ.4.50లక్షలు వెచ్చించి జాతర పరిసరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, భోజన వసతులు, రవాణా సౌకర్యం, జాతర సన్నివేశాలను వీడియో, ఫొటోలు తీయడం లాంటివి ఏర్పాటు చేయనున్నారు.
- మిషన్ భగీరథ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 24.70లక్షల నిధులతో తాగునీరు, పైపులైన్లు, నల్లాల ఏర్పాట్లు, నీటి సరఫరా, చేతిపంపుల మరమ్మతులు, బోరుబావుల శుద్ధి, జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత పనులను చేపట్టనున్నారు.
- అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.80లక్షల నిధులను వెచ్చించి వన్యప్రాణుల సంరక్షణ, ఫైర్‌సేఫ్టీల ఏర్పాటు, అటవీ సంరక్షణ, మట్టి రోడ్ల అనుమతుల పనులను చేపట్టారు.
- డీడబ్ల్యూవో, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులను వెచ్చించి తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడం, నాలుగు ప్రకటన కేంద్రాలు, తప్పిపోయిన వారి కోసం వసతి కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కాగా పోలీసు, వైద్య, దేవాదాయశాఖ, రెవెన్యూ, ఎక్సైజ్, ఆర్టీసీ, పలు శాఖలకు కూడా నిధులు కేటాయించి మినీ జాతర ఏర్పాట్లను చేపడుతున్నారు.



ములుగులో కమ్మేసిన పొగమంచు


కమ్మేసిన పొగమంచు

- రహదారులపై రాకపోకలకు అంతరాయం
- పలు రైళ్లను వేగం తగ్గించి నడిపిన అధికారులు

ములుగు / కేసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొగమంచు కమ్మేసింది. బుధవారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో రహదారులపై వాహ నాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం 9గంటలు దాటినా మంచు వదలకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, రోజు వారీ పనులకు వెళ్లే కార్మికులు, రైతులు ఆ మంచులోనే ముందుకు కదిలారు. బుధవారం ములుగులో ఈ సీజన్‌లో తొలిసారి ఇంతటి స్థాయిలో మంచు కురిసిందని ప్రజలు చర్చించుకున్నారు. ఇక రైళ్ల రాకపోకలు కూడా కాస్త నెమ్మదిగానే జరిగాయి. తెల్లవారుజామున సమయంలో పొగమంచు కారణంగా మహబూబాబాద్, కేసముద్రం, వరంగల్, కాజీపేట మీదుగా వెళ్లిన పలు రైళ్లను వేగం తగ్గించి నడిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలె వాతావరణంలో తేమ శాతం 96 చూపింది. రైల్వేట్రాక్‌పై వెళుతున్న రైళ్లు దగ్గరకు వచ్చేంత వరకు ప్లాట్‌ఫాంపై ఉన్న ప్రానికులకు కనిపించలేదు. ట్రాక్‌ను నిరంతరం పర్యవేక్షించే కీమెన్లు ఇచ్చే పొగమంచు సమాచారం ఆధారంగా ప్యాసింజర్ రైళ్లను కొంత వేగాన్ని తగ్గించి, లాంగ్ హారన్ ఇస్తూ నడిపినట్లు సిబ్బంది తెలిపారు.




ఇనుగుర్తిలో ఉదయం 8.30కు ఇలా..



కేసముద్రం రైల్వేస్టేషన్‌లో కమ్ముకున్న పొగమంచు

అరచేతిలో అపురూపం

నగర సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే వరంగల్ మహానగరంలోని పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటెన్లు, కళారూపాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఎంజీఎం కూడలి వద్ద ఏర్పాటు చేసిన అరచేతిలో శిశువు కళారూపం నగర అందాలను రెట్టింపు చేస్తోంది.





ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

ఏకాగ్రతే విజయానికి సోపానం

- తల్లిదండ్రులు, గురువులకు రుణపడి ఉండాలి
- విషయ పరిజ్ఞానం లేని విద్య నిరుపయోగం
- ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి
- వరంగల్‌లో ముగిసిన సాఫల్య-2025 నైపుణ్య శిక్షణ తరగతులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామీజీ

కరీమాబాద్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో చదివితే ప్రతీ విద్యార్థి విజయం సాధిస్తాడని ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. బుధవారం వరంగల్ ఉర్సు గుట్ట వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో టెన్త్ విద్యార్థుల కోసం వడుప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫల్య-2025 (నైపుణ్య శిక్షణ తరగతులు) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విషయ పరిజ్ఞానం లేని విద్యతో ప్రయోజనం లేదని, కేవలం మార్కుల కోసం వెంపర్లాడకుండా పాఠంలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు, గురువులకు రుణపడి ఉండాలని, మీపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కలలను సాకారం చేయాలని ఉపదేశించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వడుప్సా బాధ్యులకు, తల్లిదండ్రులకు మంగళశాసనాలు అందజేశారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పూర్తి సమయాన్ని చదువుపై పెట్టి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ.. ప్రజ్ఞావికాస్ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఓరియెంటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, స్వామీజీ ఆశీస్సులతో వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌ల బోధనలను అర్థం చేసుకోవాలని, అదే విధంగా స్వామీజీ సూచనలు పాటించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. వడుప్సా ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వడుప్సా(ట్రస్మా) బాధ్యులు అంకటి వీరస్వామి, బిల్ల రవి, ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, సతీష్, కోడెం శ్రీధర్, చక్రపాణి, రాజు, కిరణ్, వెంట్రాజం, కాంత్రికుమార్, సతీష్‌మూర్తి, ప్రవీణ్, శ్రీనివాస్, మోహన్, రవి, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, శరత్‌బాబు, ప్రసాద్, శ్రీనుబాబు, భాస్కర్, కృష్ణాకర్, వికాస తరంగిణి ప్రతినిధులు పాల్గొన్నారు.

30న కళాకారుల శోభాయాత్ర

- చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహణ
- వికాస తరంగిణి చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ



చిన్నజీయర్‌స్వామి

హనుమకొండ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు వందలాది మంది కళాకారులచే శోభయాత్ర నిర్వహించేందుకు విస్తృత చేస్తున్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పెద్ద ఎత్తున జరిగే కళాకారుల శోభయాత్రలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి భజన, హరికథ, యక్షగాన, చిందు, కోలాటం లాంటి వివిధ కళా రూపాలతో వందలాది మంది కళాకారులు శోభయాత్రలో పాల్గొననున్నారు. భక్తిమార్గంలో పయనిస్తున్న వివిధ సంప్రదాయాలకు చెందిన కళారూపాలను పరిరక్షించుకోవడం ప్రధాన ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. చిన్నజీయర్‌స్వామి ఆలోచనకు ప్రతిరూపంగా కళలకు కాణాచిగా వెలుగొందుతున్న ఓరుగల్లులో పెద్ద ఎత్తున నిర్వహించాలని జీయర్‌స్వామి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తాము ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల వికాస తరంగిణి చైర్మన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ చెప్పారు. దార్శనికత వెలుగులో నిర్మాణం అవుతున్న హైందవ భక్తి కళామార్గమే తమ వికాస తరంగణి ఆధ్వర్యంలో సంకీర్తన మండలి అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళారూపాలను ప్రదర్శించే కళాకారులతోపాటు గురువులను ప్రోత్సహిస్తూ గౌరవించడం, భక్తి కళాసంఘాలను ఏర్పర్చి సంఘటితం చేయడం, భక్తి కళాసంఘాల ద్వారా హిందు ధార్మిక విలువలను విస్తరింపజేసే లక్ష్యంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాధాకృష్ణ చెప్పారు. ఇందుకుగాను రెండు నెలలుగా ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో నిక్షిప్తమైన కళారూపాలను ప్రదర్శించే కళాకారులతో స్వయంగా అనేక సమావేశాలు నిర్వహించి వారిని ఈ కార్యక్రమానికి సమాయాత్తం చేశామన్నారు. భూపాలపల్లి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి కళాకారులు తరలివస్తారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో కళారూపాలను ప్రదర్శించే గ్రూప్ టీం లీడర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారికి మార్గదర్శనం చేశామన్నారు. ఒకవైపు భక్తి కళా సంఘాల ద్వారా సామాజిక సేవలను కూడా ప్రోత్సహింపజేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్నిరకాల కళారూపాలు ఒకేచోట శోభాయాత్ర ద్వారా నగర వాసులను కనువిందు చేసి భక్తి మార్గంలో ఓలలాండింపజేసే కార్యక్రమంలో అన్నిరంగాల కళాకారులు, కళాభిమానులు, ధార్మిక చైతన్యం కలిగిన వారు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో ముందస్తు మొక్కులు

తాడ్వాయి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారంలో వన దేవతల దర్శనానికి బుధవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోరికలు తీరాలని ఎత్తు బంగారం, యా టలతో మొక్కులు చెల్లించారు. జంపన్న వాగులో పుణ్య స్నానాల అనంతరం వనదేవతలైన సమ్మక్క-సారలమ్మల వద్దకు నడుచుకుంటూ వెళ్లి చీరె, సారె, పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం సమర్పించుకున్నారు. సుమారు 15వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.

శివ శివా.. ఏమిటిదీ?

- గాడి తప్పుతున్న కాళేశ్వరాలయ వ్యవస్థపై భక్తుల్లో అసహనం
- గర్భగుడిలో షూటింగా..? మహా పాపమంటున్న భక్తులు
- కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలంటూ డిమాండ్

మహదేవపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'సాక్షాత్తూ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సాక్షిగా గర్భగుడిలో ఓ ఆల్బమ్ చిత్రీకరణ కోసం తలుపులు మూసి షూటింగ్ చేయడమా..? ఇది ఎంతవరకు సమంజసం.. దీనికి ఎవరు బాధ్యులు? ఎవరు బాధితులు? అంతా అయిపోయాక ఏమంటే ఏముంది?' అని భక్తురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాదిన వెలిసిన త్రిలింగాలలో ఒకటిగా విరాజిల్లుతున్న పుణ్యక్షేత్రం కాళ్వేరంలోని ముక్తీశ్వరాలయ పాలనపై అసహనం వ్యక్తమవుతోంది. కొందరు అధికారుల పట్టింపులేని తనం.. అర్చకుల చేతివాటంతో ఆలయ ప్రతిష్ఠకు భంగం కలుగుతోంది. భూపాలపల్లి జయశంకర్ జల్లాలోని మహదేవపూర్ మండలం దక్షిణ కాశీగా పేరు ప్రఖ్యాతలు పేరుగాంచిన త్రిలింగ క్షేత్రాలలో ఒకటైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ గర్భగుడిలో సోమవారం ప్రైవేటు ఆల్బమ్ కోసం తలుపులను బంద్ చేసి ఆలయంలో రెండు లింగాల వద్ద ప్రైవేటు వ్యక్తులు షూటింగ్‌ను నిర్వహించారు. దూర ప్రాంతల నుంచి వచ్చిన భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. అయినప్పటికీ కూడా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, అర్చకులు భక్తులను పట్టించుకోకుండా ఆ పాటలోనే నిమగ్నమైపోయారు. దీంతో ఆలయ పవిత్రతను దెబ్బతీశారని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అర్చకులు, సిబ్బంది ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తయారై ఆలయ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. సమయం పాటించకుండా అర్చకులు ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు.

పలువురిపై అనుమానాలు



ఆలయంలో ఆల్బం చిత్రీకరణ

ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో మహా కుంభాభిషేకాన్ని నిర్వహించేందుకు ఆలయ అధికారులు తేదీలను ప్రకటించారు. 1972లో మహాకుంభాభిషేకాన్ని నిర్వహించగా దాదాపు 43 సంవత్సరాలకు మళ్లీ ఈ మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్నారు. మే15నుంచి సరస్వతి పుష్కరాల తేదీలను కూడా ప్రకటించారు. అయితే ఈ ఉత్సవాల నిర్వహణ పనుల నిమిత్తమై ఆలయ అధికారులు శృంగేరి పీఠాధిపతుల వద్దకు వెళ్లిన క్రమంలో గర్భగుడిలో అనుమతులు లేకున్నా అర్చకులు పాట చిత్రీకరించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామకృష్ణశర్మకు మెమోతో పాటు నోటీసులు అందజేశారు. దేవాదాయ శాఖ అధికారులు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, తాము అందుబాటులో లేమని, తమకు ఎవరూ సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

ఎవరికి వారే..


దేవుడు వరమిచ్చినా పూజారి దర్శనభాగ్యం కల్పించని చందంగా ఇక్కడి అర్చకులు, సిబ్బంది తీరు ఉంది. కొద్ది నెలల నుంచి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు గ్రూపు రాజకీయాలుగా తయారై వేళాపాల లేకుండా ఆలయానికి చుట్టపుచూపుగా వస్తున్నారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది సైతం ఏమీ పట్టించుకోకపోవడంతో సిబ్బందిదో గ్రూపు, అర్చకులదో గ్రూపు తయారు కావడంతో ఆలయ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. గతంలో ఆలయంలో పనిచేసే ముగ్గురు అర్చక సిబ్బంది పదవీ విరమణ చేయడం, కొత్త అర్చకులను నియవించకపోవడంతో ఉన్న అర్చకులు సరైన సమయం పాటించకపోవడం, ప్రైవేటు అర్చకులకు ఆలయాన్ని అప్పజెప్పడం జరుగుతోంది. ఆలయంలో పనిచేస్తున్న



రెగ్యులర్ అర్చకులు సొంత పనుల్లో నిమగ్నమైపోతున్నారు. అయినా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో నిత్యం 20 నుంచి 30 వేలు వచ్చే ఆదాయం ఇప్పుడు రూ.4 లక్షల వరకు ఆదాయం పెరిగినప్పటికి దీనికి రెగ్యులర్ ఈవో లేకపోవడం ఆలయానికి శాపంగా మారింది . కాగా 2024 కు గాను రూ.5 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం.. ఆదాయం పెరిగే కొద్ది ఆలయ ప్రతిష్ఠను భంగపరుస్తున్నారని.. వెంటనే ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల సంఖ్య

గతంలో ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ తక్కువగా ఉండడం, తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాలను కలుపుతూ బ్రిడ్జిలు నిర్మాణం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకుంటున్నారు. కానీ భక్తులు వచ్చే సమయానికి పూజారులు లేకపోతుండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళేశ్వరంలో కాలసర్పదోష నివారణ పూజలు, శని పూజలను నిర్వహించే బుధ, మంగళ వారాల్లో ఎక్కువగా రద్దీ ఉంటుంది. పెళ్లికాని యువతీ యువకులు, సంతానం లేని దంపతులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకుంటే వారి ఆకాంక్షలు నెరవేరుతున్నాయని నమ్ముతారు. ఇక తెలంగాణ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో రాష్ట్రంలోని నలుమూలల నుంచి కాళేశ్వరానికి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గ్రూపుల సభ్యులు, మహిళా సంఘాల బాధ్యులు మూకుమ్మడిగా వస్తున్నారు. దీంతో కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్‌లో జనం రద్దీ రోజురోజుకు పెరుగుతోంది.



అబాకస్ జిల్లా పరీక్షలకు ఎంపిక

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వాగ్దేవి గ్లోబల్ స్మార్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఇటీవల కాజీపేటలో నిర్వహించిన అబాకస్ పరీక్షలలో 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ నల్ల వాసుదేవ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ స్వప్న, అకాడమిక్ ప్రిన్సిపాల్ సమత, అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపాల్ శోభ, ఉపాధ్యాయులు, ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ వాసుదేవరెడ్డి



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే రాజేందర్, అధికారులు

ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి స్థల పరిశీలన

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్‌లోని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో నిర్మించే వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణ స్థలాన్ని బుధవారం కలెక్టర్ ప్రావీణ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే అనుమతి మంజూరుచేసిన నేపథ్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. హాస్టల్ నిర్మాణానికి స్థల అనుకూలత, ఇతర అంశాల పరిశీలనకు సర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే హాస్టల్ నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక అవసరాలను గుర్తించి వాటి అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాలు చేసుకునే పేద మహిళలక ఆర్థికంగా లబ్ధి చేకూర్చి చేదోడుగా ఉండటమే కాకుండా భద్రత ఉండేందుకు ఈ హాస్టల్ ఉపయోగపడుతుందన్నారు. మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, వారికి మెరుగైన వసతులను అందించడంలో అంకితభావంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమకళ, డీఈ ప్రశాంత్, తదితర అధికారులు పాల్గొన్నారు.

బేటీ బచావో పోస్టర్ ఆవిష్కరణ

మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రూపొందించిన బేటీ బచావో గోడ పత్రికలను కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, డీఆర్‌డీవో మేన శ్రీను, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాంరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న 104 కాంట్రాక్టు ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో పని చేస్తున్న 104 కాంట్రాక్టు ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో అనేక అవస్థలు పడుతున్నారని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.యాదనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ముందు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాలకు ఆరునెలలకు సంబంధించిన బడ్జెట్ విడుదల చేయగా, 32 జిల్లాలకు సంబంధించిన ఉద్యోగులకు వేతనాలు చెల్లించి, ఒక్క వరంగల్ జిల్లాలోనే వేతనాలు విడుదల చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. వేతనాలు విడుదల చేయకుంటే ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్లపల్లి శ్రీనివాస్, రాజ్‌కుమార్, సృజన, మధు, క్రాంతికుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభలో అధికారులపై కార్పొరేటర్ ఆగ్రహం

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస కాలనీ ప్రజా పాలన వార్డు సభలో అధికారుల తీరుపై స్థానిక కార్పొరేటర్ రావుల కోమల బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 8 గంటలకే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పి 11 దాటినా కొంతమంది అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడంపై ఆమె మండిపడ్డారు. ఉదయం 11.20 గంటలకు డిప్యూటీ కమిషనర్ రవీందర్ వచ్చి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కొద్ది సేపు అధికారుల తీరుపై కార్పొరేటర్ రావుల కోమల కాంగ్రెస్ ప్రభుత్వంలో బీజేపీ కార్పొరేటర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమ వార్డులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీలు వేసిన స్థానిక కార్పొరేటర్‌కు సమాచారం లేదని విమర్శించారు. కొద్దిసేపు పోలీసులు, అధికారులతో మాట్లాడి తన ఆవేదనను వెల్లిబుచ్చారు. అనంతరం 11.30గంటలకు జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ రవీందర్ పేదవారందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో నాలుగు పథకాలు ఈనెల 26న ప్రారంభించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



ప్రజా పాలన వార్డు సభలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రావుల కోమల

అర్హులందరికీ ఇళ్లు ఇచ్చి తీరుతాం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- పలు డివిజన్లలో వార్డు సభలు



వార్డు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలనలో ఒక్క పేదోడికి ఇల్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇండ్లు ఇచ్చి తీరుతామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 63వ డివిజన్ వాటర్‌ట్యాంక్ వద్ద బుధవారం వార్డు సభ జరిగింది. ఈ సభలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులకు పథకాలు అందించేందుకు స్థానిక కార్పొరేటర్లు, స్థానిక నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు రావాలన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు విజయ శ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, స్థానిక నాయకులు ఎండీ అంకూస్, సయ్యద్ రజాలీ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, ఆరూరి సాంబయ్య, క్రాంతి భరత్, కొండ శివ, ఎంపీ రాజు, మానస మధు, సంతోష్, పాలడుగుల ఆంజనేయులు, షేక్ అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.



వార్డు సభలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో విద్యాలత

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : జడ్పీ సీఈవో విద్యాలత

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిషత్ సీఈవో విద్యాలత అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్‌కాలనీ కమిటీ హాల్‌లో జీడబ్ల్యూఎంసీ స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన వార్డు సభలో ఆమె మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, ఇందిరమ్మ కమిటీ సభ్యు లు దూలం సదానందం, శనిగరపు అనిత, అన్న విజయ, భూక్య విజయ్ నాయక్, చింత రమేష్ గౌడ్‌తో పాటు బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎదునూరి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేటి వార్డు సభల వివరాలు వెల్లడి

వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో మూడు రోజులుగా వార్డు సభలు జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా, మంగళవారం బల్దియా పరిధిలో 10 డివిజన్లలో వార్డు సభలు జరిగాయి. ఈ సభలలో 8,372 రేషన్ కార్డుల కోసం, 4,626 ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు వచ్చినట్లు బల్దియా అధికారులు వెల్లడించారు. కాగా, గురువారం 20 డివిజన్లలో వార్డు సభలు జరుగుతాయని వెల్లడించారు. ఈ క్రమంలో వార్డు సభలు జరిగే ప్రాంతాలు, డివిజన్ల వివరాలను బల్దియా అసిస్టెంట్ కమిషనర్ జోనా వెల్లడించారు.

నేడు వార్డు సభలు జరిగే ప్రాంతాలు

డివిజన్	ప్రాంతం	నియోజకవర్గం
18	అంబేద్కర్ కమ్యూనిటీ హాల్	వరంగల్ తూర్పు
	క్రిస్టియన్ కాలనీ	
21	క్రిస్టర్ గార్డెన్ ఎల్‌బీ నగర్	వరంగల్ తూర్పు
24	మైనార్టీ కమ్యూనిటీ హాల్	
	మౌలాలి	
27	గోవిందరాజులగుట్ట గుడి	వరంగల్ తూర్పు
33	శాంతినగర్, వరంగల్	వరంగల్ తూర్పు
35	ఏసీరెడ్డినగర్ కమ్యూనిటీ హాల్	వరంగల్ తూర్పు
39	జన్మభూమి జంక్షన్	వరంగల్ తూర్పు
42	మహిళా స్వశక్తి భవన్	వరంగల్ తూర్పు
15	మొగిళిచెర్ల లైబ్రరీ	పరకాల
03	పైడిపెల్లి జీపీ కార్యాలయం	వర్ధన్నపేట
	కాజీపేట సర్కిల్ పరిధిలో..	
5	కొత్తూరుజెండా కమ్యూనిటీ హాల్	వరంగల్ పశ్చిమ
8	జడ్పీ స్కూల్ కుమార్‌పల్లి	వరంగల్ పశ్చిమ
10	మచిలీబజార్ కమ్యూనిటీ హాల్	వరంగల్ పశ్చిమ
48	బస్తీ దవఖానా దర్గా	వరంగల్ పశ్చిమ
60	టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్	వరంగల్ పశ్చిమ
62	సోమిడి, కాజీపేట	వరంగల్ పశ్చిమ
02	వంగపహాడ్ జీపీ కార్యాలయం	వర్ధన్నపేట
44	తిమ్మాపూర్ జీపీ కార్యాలయం	వర్ధన్నపేట
55	భీమారం జీపీ కార్యాలయం	వర్ధన్నపేట
64	మడికొండ జీపీ కార్యాలయం	వర్ధన్నపేట

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కేయూ క్యాంపస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ జవాన్లు కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కోరారు. బుధవారం కేయూ కంప్యూటర్ సైన్స్ విభాగం నేతృత్వంలో రెండు వారాల పాటు ఎన్‌సీసీ జవాన్లకు కంప్యూటర్ శిక్షణ సదస్సులో రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న కాలంలో టెక్నాలజీకి విస్తృత ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. జవాన్ల శిక్షణతో వారి సామర్థ్యాలను టెక్నాలజీపరంగా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రమ, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ బి.మంజుల, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఎన్‌సీసీ కమాండింగ్ కల్నర్ సెంథిల్ రమాదురై, డాక్టర్ బి.రమ, రవి, సెనేహర్, డాక్టర్ డి.రమేశ్, డాక్టర్ నిలీమా తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ జవాన్లతో వర్సిటీ, ఎన్‌సీసీ అధికారులు

విద్యా సంవత్సరం మధ్యలో స్కూల్ తరలింపు



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

రాంనగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) కిషన్‌పురలోని అద్దె భవనంలో ఉంటున్న శ్రీ చైతన్య పాఠశాలను విద్యాసంవత్సరం మధ్యలో తరలించడంతో బుధవారం ఉదయం తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. వారి కథనం ప్రకారం.. పాఠశాల దగ్గరగా ఉంటోందని విద్యార్థులను పాఠశాలలో చేర్పిస్తే.. ఆకస్మాత్తుగా కాజీపేట 100 ఫీట్ల రోడ్డుకు పాఠశాల తరలించారన్నారు. కిషన్‌పుర పరిసర ప్రాంతాల్లో ఉండే తాము.. అంత దూరం విద్యార్థులను తీసుకురావడం కుదరదని యాజమాన్యానికి చెప్పామన్నారు. దీంతో కిషన్‌పుర నుంచి తామే ఉచితంగా బస్సులో తీసుకెళ్తామని చెప్పి ఒక్కొక్క సీటులో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులను కూర్చోబెట్టి కొంతమందిని నిల్చోబెట్టి తీసుకెళ్తున్నారన్నారు. కాగా, తల్లిదండ్రుల ఆందోళన నేపథ్యంలో బస్సుల సంఖ్య పెంచి తీసుకెళ్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

బాలసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, వారు ఎలాంటి తినుబండారాలు ఇచ్చినా తినకూడదని షీటీమ్ ఎస్సై విద్యాసాగర్ సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ ది గురుకుల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన భరోసా సెంటర్‌లో ఆయన మాట్లాడారు. నేటి తరం విద్యార్థినులు, విద్యార్థులు లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. సోషల్‌మీడియాకు బానిసలుగా మారి నిత్యం అందులోనే ఉంటూ వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. సమాజానికి తమను పరిచయం చేసిన తల్లిదండ్రుల కు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఎల్లవేళలా రుణపడి ఉండాలన్నారు. విద్యార్థినులకు ఎక్కడైనా ఎప్పుడైనా ఎవరివల్లనైనా సమస్య తలెత్తితే షీ టీమ్ ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చని తాము నిత్యం అందుబాటులోనే ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ బృందం సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యుగేందర్, వినయ్‌కుమార్, విజయ్, రజనీకాంత్, ప్రసాద్, హఫీసా పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న షీ టీమ్ ఎస్సై విద్యాసాగర్

కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధ వారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా టి.ఉప్పలయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు చాలీచాలని జీవనం భారంగా మారిందని, వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. ధర్నాలో బరుపట్ల మహేష్, యాస బాబు, ఎర్ర నరేష్, విద్యాసాగర్, సదానందం పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (హెచ్ -143) టెంజు జిల్లా కమిటీ ఎన్నిక



ప్రశాంత్



వేణుగోపాల్



గొర్రె సంజీవ్

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని హరిత కాకతీయహోటల్‌లో టీయూడబ్ల్యూజే (హెచ్-143) టెంజు జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు బుధవారం రాష్ట్ర నాయకులు యోగేందర్, బీఆర్. లెనిన్, సీహెచ్ సుధాకర్, తడక రాజ్‌నారాయణ, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, మెండు రవీందర్, మస్కపురి సుధాకర్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా బూరం ప్రశాంత్ ఐ న్యూస్, కార్యదర్శిగా తాళ్లపెల్లి వేణుగోపా ల్ బిగ్ టీవీ, కోశాధికారిగా గొర్రె సంజీవ్ టీ న్యూస్, ఉపాధ్యక్షులుగా ఇనుగాల కిశోర్, సంపత్, జగ దీష్, ఎల్.శ్రీనివాస్, గట్టు రఘు, నల్ల దిలీప్, సుమం త్, జాయింట్ సెక్రెటరీలుగా సుధీర్, శ్రీకాంత్, సల్మాన్, రంజిత్, భాస్కర్, రమేష్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఈసీ మెంబర్లుగా భిక్షపతి, హరినాథ్, రమేష్, తిక్క భిక్షపతి, జక్కుల నాగరాజు, రాజేష్, వంశీ, అమర్, మురళిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నుకున్న జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టెంజు రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమకొండ జిల్లా టెంజు మాజీ అధ్యక్షుడు పొగాకుల అశోక్, జిల్లా యూనియన్ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాంనగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని టెంపుల్ ట్రీవిల్లాస్ ఏరియా, కనకదుర్గ, వాసవి కాలనీలు, హంటర్‌రోడ్డు అంజనేయ టెంపుల్ ఏరియాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వరంగల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బస్టాండ్ సమీపంలోని గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. మృతుడు కొద్ది రోజులుగా బస్టాండ్ ఆవరణంలో భిక్షాటన చేస్తున్నట్లుగా స్థానికులు వెల్లడించినట్లు తెలిపారు. సంబంధికులు ఎవరైనా ఉంటే హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మృతదేహన్ని మార్చురీలో భద్రపరిచామన్నారు.

గంజాయి తాగుతున్న ఐదుగురి అరెస్టు

హసన్‌పర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేయూ పోలీసు స్టేషన్ పరిధి పెగడపల్లి డబ్బాలు, గుండ్లసింగారం శ్మశానవాటికలో బుధవారం గంజాయి సేవిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద 270 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కేయూ పీఎస్ పరిధి గుండ్లసింగారం, పెగడపల్లి డబ్బాల ఏరియాలో బుధవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుండ్ల సింగారం శ్మశాన వాటిక నుంచి ఐదుగురు నిందితులు పోలీసులను చూసి పారిపోతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే వారిని పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద 270 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. అనంతరం వారిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులలో గుండ్లసింగారం గ్రామానికి చెందిన గాదె ఇజ్రేపాల్, బస్కుల భాస్కర్, మాదాసి రాఘవ, లావుడ్యా నవీన్, హనుమకొండ వాజ్‌పేయి కాలనీకి చెందిన ఈశ్వర్‌లు ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ వెల్లడించారు.

మిల్లు స్థలం కోసం నేడు లక్ష సంతకాల సేకరణ

మిల్స్‌కాలనీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అజంజాహి కార్మిక భవనం స్థల పరిరక్షణ కోసం ఈ నెల 23న అఖిలపక్షం ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్రారంభించనున్న ఈ కార్యక్రమానికి విశ్రాంత కార్మికులు, వారి కుటుంబాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజ నిర్మాణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని బైరాన్‌పల్లి, కొత్తపల్లి, మల్లారెడ్డిపల్లి, పెగడపల్లి, వంగపహాడ్, జయగిరి, పెంబర్తి గ్రామాలలో బుధవారం జరిగిన ప్రజా పాలన గ్రామ సభలను ఆయా గ్రామాల స్పెషలాఫీసర్‌ల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం పెంబర్తి గ్రామంలో సమారు 316 మంది రైతులకు రూ.2.39 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. పెగడపల్లి పీఏసీఎస్‌లో బ్యాంకు ద్వారా అవకతవకలు జరిగితే సంబంధిత ఉద్యోగిని సస్పెండ్ చేసి అర్హులైన రైతులకు సుమారు రూ.11కోట్ల రుణమాఫీ చేశామన్నారు. రూ.2 లక్షలలోపు రుణాలు పొందిన రైతులకు ఇంకా రుణమాఫీ కానీ వారందరికీ కూడా ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ లబ్ధిదారుడికి పెన్షన్ అందేలా ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ వెంకటేశం, తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీడీవో కర్నాకర్‌రెడ్డి, ఏవో అనురాధ, ఏపీఎం విజయలక్ష్మీ, పంచాయతీ స్పెషలాఫీసర్ నాగవెల్లి శ్రీనివాస్, కార్యదర్శులు హేమలత, రత్నాకర్‌రెడ్డి, ఏఈవో శైలజ, కారోబార్ సదానందం, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్‌లు బిల్ల ఉదయ్‌రెడ్డి, చల్ల గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, పూల, స్వాతి, సుధాకర్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయం

వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి): జీడబ్ల్యూఎంసీ పరిధిలోని విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 2వ డివిజన్ వంగపహాడ్, పెగడపెల్లి, గుండ్లసింగారం గ్రామాల్లో రూ.4కోట్ల బల్దియా నిధులతో బుధవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు నేతృత్వంలో డివిజన్‌లో విస్తృత పర్యటన నిర్వహించారు. ప్రధానంగా ఈ నిధులతో వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. కాగా, డివిజన్ ప్రజలు కోలాటాలు, డప్పు చప్పుళ్లతో ఎమ్మెల్యేను గ్రామాల్లోకి స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఇప్పటికే చాలా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా నిధులు తెప్పించి అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పోలం అనిల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రఘు, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్ గౌడ్, పర్కు రాజు, కాంగ్రెస్ నాయకులు మార్త రవీం దర్, రాజేశ్, సతీష్, మాదాసి నాగరాజు, పుట్ట కిరణ్, అరికిల్ల లెనిన్, మంద కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్

వెంట్రుకలు పెరగడం లేదెందుకు?

డాక్టర్! నా వయసు 45. మునుపటిలా వెంట్రుకలు పెరగడంలేదు. పెరుగుదల వేగం తగ్గినట్టు స్పష్టంగా గమనించగలుగుతున్నాను. ఈ మార్పు ఎందుకు? మునుపటిలా వెంట్రుకలు వేగంగా పెరిగే మార్గం లేదా?

– ఓ సోదరి, హైదరాబాద్

కోవిడ్, డెంగు, మలేరియా లాంటి రుగ్మతల బారిన పడినప్పుడు వెంట్రుకల కుదుళ్లు షాక్‌కు గురవుతాయి. దాంతో వెంట్రుకలు ఊడిపోవడంతో పాటు, పెరుగుదల కూడా బాగా మందగిస్తుంది. రుగ్మత నుంచి కోలుకున్న తర్వాత పోషకాహారాన్ని తీసుకోకపోయినా ఇలాగే జరుగుతుంది. అలాగే స్ట్రెయిటెనింగ్, స్ట్రీక్స్ చేయించుకోవడం లాంటి సౌందర్య చికిత్సల వల్ల కూడా వెంట్రుకలు రసాయనికంగా దెబ్బతిని, మధ్యకు తెగిపోతాయి. ఇలాంటప్పుడు కూడా వెంట్రుకలు పెరగవు. అలాగే పెరిగే వయసుతో పాటు వెంట్రుకలు పెరిగే వేగం తగ్గుతుంది. చిన్న వయసులో పెరిగినంత వేగంగా 40 ఏళ్ల తర్వాత వెంట్రుకలు పెరగవు. వెంట్రుకల చివర్లు చిట్లిపోయినప్పుడు, పొడవు పరంగా వ్యత్యాసాన్ని కనిపెట్టలేం. చిట్లిపోయిన చివర్లు కత్తిరిస్తే వెంట్రుకలు పెరుగుతాయని అనుకోవడం కూడా అపోహే! ట్రివిమ్మింగ్ వల్ల వెంట్రుకలు ఆరోగ్యంగా కనిపిస్తాయి.

మూల కారణాన్ని సరిదిద్దాలి

వెంట్రుకలు పెరగకపోవడానికి హార్మోన్ సమస్యలు, ముందరి రుగ్మతలు, పోషకాహార లోపం, థైరాయిడ్, పిసిఒడి సమస్యలు.. ఇలా ఎన్నో కారణాలుండవచ్చు. వీటిని కచ్చితంగా కనిపెట్టి, చికిత్స తీసుకుంటే పరిస్థితి మెరుగు పడుతుంది. అలాగే వెంట్రుకలకు చేయించుకునే సౌందర్య చికిత్సలకు కూడా దూరంగా ఉండాలి. అలాగే పోషకాహారంలో భాగంగా



ఖర్జూరాలు, వాల్‌నట్స్, బాదం, షియా, నువ్వులు, షియా, అవిసె గింజలు, పాలు, పన్నీర్, పప్పుధాన్యాలు తీసుకోవాలి. అలాగే ఒత్తిడిని తగ్గించుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా సమస్యను ప్రారంభంలోనే గుర్తించి సరిదిద్దుకుంటే, ఫలితం మరింత మెరుగ్గా ఉంటుంది.

గృహ చిట్కాలతో...

మందార పూలు, ఆకులు, మెంతులు లాంటివన్నీ కొన్ని పోషకవిలువలను కచ్చితంగా కలిగి ఉంటాయి. అయితే ఇవన్నీ వెంట్రుకలు ఒత్తుగా కనిపించేలా, మెత్తగా ఉండేలా సహాయపడతాయి తప్ప మూల కారణాన్ని సరిదిద్దలేవు. వెంట్రుకల పెరుగుదల ఆగిపోయినప్పుడు కచ్చితంగా మూల కారణాన్ని సరిదిద్దుకునే ప్రయత్నాలు చేపట్టాలి.

డాక్టర్ స్వప్న ప్రియ, కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్.

యాత్రలకు వెళుతున్నారా..!

శీతాకాలంలో యాత్రలు చేయడం అహ్లాదకరంగా ఉంటుంది. వాతావరణం చల్లగా ఉండడం వల్ల అలసట రాదు. ఉత్సాహంగా అనిపిస్తుంది. అయినప్పటికీ కొత్త ప్రదేశాలకు వెళ్లేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

- శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లో చలి తీవ్రంగానే ఉంటుంది. చలి నుంచి రక్షణ కల్పించే ఉన్ని దుస్తులు, చేతి తొడుగులు, సాక్స్, క్యాప్ వెంట ఉంచుకోవాలి. అన్నింటినీ రెండు జతలు అదనంగా సిద్ధం చేసుకోవడం మంచిది. రాత్రి ప్రయాణమైతే మందంగా ఉండే దుప్పట్లు వెంట తీసుకెళ్లాలి.
- చల్లని వాతావరణంలో ప్రయాణిస్తున్నప్పుడు తరచూ కాఫీ, టీ, ఆల్కహాల్ సేవించకూడదు. వి ఎతంగా వేడి పాలు తాగవచ్చు. కనీసం గంటకు ఒకసారైనా మంచి నీరు తాగుతూ ఉండాలి. లేదంటే శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడుతుంది.
- నీటిని ఎక్కువ సమయం వేడిగా ఉంచే వాటర్ ఫ్లాస్కులు, థర్మల్ ఫ్లాస్కులు, గ్రీన్ టీ ప్యాకెట్లను వెంట తీసుకెళ్లాలి. ప్రయాణం చేస్తూ గ్రీన్ టీ తయారు చేసుకుని తాగడం మంచి అనుభూతినిస్తుంది. దీని వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.
- మంచు కురిసే ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఆ వాతావరణంలో కొంతసేపు గడపాలి. అప్పుడే శరీరం ఉష్ణోగ్రతను సర్దుబాటు చేసుకుంటుంది. దీనివల్ల అనారోగ్య సమస్యలు రావు.
- కొత్త ప్రదేశాల్లో కావాల్సిన ఆహారం దొరకకపోవచ్చు. ముందు జాగ్రత్తగా డ్రై ఫ్రూట్స్, గింజలు వెంట తీసుకెళ్లాలి.
- పాదాలకు చలి తగలకుండా ఉన్ని సాక్స్‌తోపాటు మడమల వరకూ పూర్తిగా కప్పి ఉంచే షూస్ లేదా కాన్వాస్ షూస్ ధరించాలి. దీంతో పాదాలు వెచ్చగా మారి కీళ్ల నొప్పులు రాకుండా చేస్తాయి.



- ప్రయాణం చేసేటప్పుడు చలిగాలులు సోకి చర్మం పొడారిపోతుంది. మాయిశ్చరైజర్, లిప్‌బామ్ వెంట ఉంచుకోవాలి. సూర్యరశ్మి నుంచి కళ్లకు రక్షణ కల్పించే సన్ గ్లాస్ ధరించాలి.
- ఫోన్ ఛార్జింగ్‌కి ఇబ్బంది లేకుండా పవర్ బ్యాంక్ తీసుకెళ్లాలి.
- వైద్యుని సలహా మేరకు జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి సమస్యలకు సంబంధించిన మందులను వెంట తీసుకెళ్లాలి.

ప్రేరణ



రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళల్లో అవగాహన పెంచడం కోసం కేవలం వైద్య వృత్తికే పరిమితం కాకుండా సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు హైదరాబాద్‌కు చెందిన బ్రెస్ట్ ఆంకాలజిస్ట్ **డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి.** గ్రామీణ మహిళల కోసం ప్రత్యేకంగా 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్'ను నడుపుతున్న ప్రజ్ఞను 'నవ్య' పలకరించింది.

బస్సుతో భరోసా

"మన దేశంలో రొమ్ము క్యాన్సర్ కేసులు త్వరితంగా పెరిగిపోడానికి కారణం అవగాహనా రాహిత్యమే! మరీ ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన చాలా తక్కువ. దాంతో ఎంతో ఆలస్యంగా వైద్యులను ఆశ్రయిస్తూ, వ్యాధి ముదిరిపోయి, మృత్యువాత పడుతున్న సందర్భాలు కోకొల్లలు. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయాలనే సంకల్పంతో, వ్యాధి నిర్ధారణ పరీక్షలను మహిళలకు చేరువ చేయడం కోసం 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్' పేరిట ఒక బస్సును ప్రారంభించాను. రొమ్ము క్యాన్సర్ నివారణ వైపు నా ప్రయాణం సాగడం వెనకొక ఆసక్తికరమైన కథ ఉంది. దీనికి కారణం అమ్మ. 2012లో అమ్మకు రొమ్ములో సమస్య తలెత్తింది. దాంతో అమ్మ తనకు క్యాన్సర్ సోకిందేమోనని చాలా భయపడిపోయింది. వైద్యం కోసం ఏ డాక్టర్‌ను కలవాలో కూడా మాకు ఆ రోజుల్లో తెలియదు. దాంతో మేము క్యాన్సర్ వైద్య నిపుణుడిని కలిసాం. ఆయన కొన్ని పరీక్షలు రాశారు. ఆ పరీక్షలు చేయించుకుంటున్న సమయంలో కూడా విపరీతమైన భయం. ఆ పరిస్థితులు నాపై బలమైన ముద్ర వేశాయి. అమ్మకు క్యాన్సర్ లేదని పరీక్షల్లో తేలిపోయింది. దాంతో అందరం ఊపిరి పీల్చుకున్నాం. నేను వైద్య విద్య చదవాలని.. అది కూడా రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన స్పెషాలిటీ ఎంచుకోవాలని ఆ సమయంలో నిర్ణయించుకున్నా. అలా అమ్మకొచ్చిన అస్వస్థత నన్ను క్యాన్సర్ వైద్య విద్య వైపు నడిపించింది. చెన్నైలో రామచంద్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి అయిన తర్వాత ముంబయిలోని టాటా మెమోరియల్‌లో ఫెలోషిప్ పూర్తి చేసుకున్నా. క్యాన్సర్ రోగులకు రొమ్ము పునర్‌నిర్మాణంలో నైపుణ్యం సాధించటం కోసం యూకేలో ఒక కోర్సు ఉంది. అది పూర్తి చేశాక, హైదరాబాద్ వచ్చి వైద్య వృత్తిని ప్రారంభించా.

మొదట్లో...

నేను వైద్య వృత్తిని ప్రారంభించిన రోజుల్లో రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో ఎక్కువ అవగాహన ఉండేది కాదు. క్యాన్సర్‌ను గుర్తించే పద్ధతులు కూడా ఎక్కువ ప్రచారంలో లేవు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎంతో నష్టపోతున్నారని గమనించాం. ఎక్కువ మంది మహిళలు రొమ్ములలో సమస్యలతో డాక్టర్ల దగ్గరకు వెళ్లటానికి ఇబ్బంది పడుతూ ఉంటారు. డాక్టర్ల దగ్గరకు వారు రారు కాబట్టి.. మనమే వాళ్ల దగ్గరకు వెళ్తే బావుంటుందనే ఉద్దేశంతో బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాం. దీనిలో అన్ని అత్యాధునిక రోగ నిర్ధారణ పద్ధతులు ఉంటాయి. వీటి ద్వారా మహిళలను పరీక్షించి వారికి ఏవైనా సమస్యలు న్నాయా అనే విషయాన్ని నిర్ధారిస్తారు. ఇలా ఇప్పటి దాకా తెలంగాణలోని అనేక జిల్లాలలో వేల సంఖ్యలో మహిళలను పరీక్షించాం. రొమ్ము క్యాన్సర్ ఉన్నవారికి ఉచితంగా చికిత్సను కూడా అందిస్తున్నాం. కేవలం గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు మాత్రమే కాకుండా- వారితో మమేకమయిపోయిన ఆశా వర్కర్స్‌కు కూడా పరీక్షలు నిర్వహించాం. దీని వల్ల రెండు రకాల లాభాలు ఉంటాయి. ఆశా వర్కర్లకు సరైన వైద్య సదుపాయం లభిస్తుంది.. అంతే కాకుండా వారికి ఈ అంశంపై అవగాహన ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఇతరులకు వారు ఈ సమస్య తీవ్రత చెప్పగలుగుతారు. దీని వల్ల మంచి ఫలితాలు లభించాయి.

ఉచితంగానే...

రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే పరీక్షలు కూడా ఒక క్రమ పద్ధతిలో సాగాలి. సాధారణంగా రొమ్ములో గడ్డ అనగానే వైద్యులు మామోగ్రాఫ్ పరీక్షనే సూచిస్తూ ఉంటారు. కానీ 40 ఏళ్ల లోపు మహిళలు మామోగ్రామ్ చేయించుకోవడం సరి కాదు. కాబట్టి మేం భౌతిక పరీక్షలు, ఇతరత్రా పరీక్షలతో వ్యాధిని అంచనా వేసి, అవసరమైన వారికే మామోగ్రామ్ చేపడతాం. పరీక్షలో వ్యాధి నిర్ధారణ అయిన పక్షంలో తదుపరి చికిత్సల గురించి వివరిస్తాం. ఆర్థిక పరిస్థితి సహకరించని వారికి మేమే ఉచితంగా పూర్తి చికిత్సను అందిస్తాం. కొన్ని సందర్భాల్లో రొమ్ముల్లో క్యాన్సర్ కాని గడ్డలు కూడా ఏర్పడుతూ ఉంటాయి. వాటికి సంబంధించిన చికిత్సలను కూడా ఉచితంగా అందిస్తున్నాం. మా దగ్గర చికిత్స పొంది మళ్లీ సాధారణ జీవితం జీవిస్తున్న వారిని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంటుంది. ఇంకా మరింత మందికి సాయం చేయాలనే ఉత్సాహం కలుగుతుంది."

• గోగుమళ్ల కవిత

మర్చిపోలేని అనుభవం

కొందరు మహిళలకు గర్భిణిగా ఉన్నప్పుడు, లేదా ప్రసవం తర్వాత ఏడాది లోపు రొమ్ము క్యాన్సర్ సోకవచ్చు. ఒక సారి 29 ఏళ్ల గర్భిణి నన్ను కలిసింది. ఆమెకు రెండు రొమ్ముల్లోను గడ్డలు ఉన్నాయి.



మొదట్లో అవి క్యాన్సర్‌కు సంబంధించినవి కావని వైద్యులు నిర్ధారించారు. కానీ నేను పరీక్షలు చేయిస్తే అవి క్యాన్సర్ గడ్డలని తేలింది. అప్పుడు వైద్యం మొదలుపెట్టి.. మళ్లీ ఆమెకు రొమ్ములు పునర్‌నిర్మించటానికి రెండేళ్ల సమయం పట్టింది. ఆ సమయంలో ఆమె తన స్థైర్యం కోల్పోలేదు. శరీరంలోని క్యాన్సర్‌తో పోరాడి గెలిచింది. ఇలాంటి వారు ఎంతో మంది ఉన్నారు. వారందరి గురించి ప్రపంచానికి తెలిస్తే- క్యాన్సర్ బాధితులకు స్ఫూర్తి కలుగుతుంది.

కళ్ల కింద నలుపు తగ్గాలంటే...

ఒత్తిడి, నిద్రలేమి, హార్మోన్ల మార్పుల కారణంగా కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడుతుంటాయి. పోషకాహారంతోపాటు సరైన నిద్ర ఉండేలా చూసుకుంటూ కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

- రాత్రి పడుకునేముందు రెండు చెంచాల ఆలివ్ నూనెని కొద్దిగా వేడి చేసి కళ్ల చుట్టూ రాయాలి. వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే కళ్ల చుట్టూ రక్త ప్రసరణ మెరుగై నలుపుదనం తగ్గుతుంది.
- ఒక చెంచా శనగపిండిలో రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల కింద రాసి పది నిమిషాలు ఆరిన తరవాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తే నల్లని వలయాలు తొలగిపోతాయి.
- కలబంద గుజ్జును తీసుకుని చల్లని నీళ్లలో ముంచి దానిని కళ్ల చుట్టూ పట్టించాలి. పదిహేను నిమిషాల తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారం రోజులు చేస్తే ఫలితం కనిపిస్తుంది
- రెండు చెంచాల బియ్యం పిండిలో మూడు చెంచాల నీళ్లు పోసి ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ పరచాలి. ఇరవై నిమిషాలు ఆరిన తరవాత నీళ్లతో శుభ్రం చేసుకుంటే చాలు.
- అరకప్పు టమాటా రసంలో రెండు చెంచాల శనగపిండి కలపాలి. ఈ మిశ్రమంతో కళ్ల కింద మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకుంటే ప్రయోజనం కనిపిస్తుంది.
- రాత్రి పడుకునేముందు కళ్ల కింద కొబ్బరి నూనె రాసుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే సమస్య తగ్గుతుంది.



ఇలా చేస్తే వెంటనే ఉపశమనం

పిల్లలకు, పెద్దలకు ఆకస్మికంగా చిన్న ఆరోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటప్పుడు ఇంట్లో ఉండే వాటితోనే కొన్ని చిట్కాలు పాటించి ఉపశమనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

వాంతులు



- చిన్న గ్లాసు నీళ్లలో నాలుగు లవంగాలు వేసి బాగా మరిగించాలి. గోరువెచ్చగా చల్లారిన తరవాత ఈ నీళ్లను వడకట్టి తాగితే వెంటనే వాంతులు ఆగిపోతాయి.

కడుపునొప్పి



- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల వాము వేసి దోరగా వేయించాలి. దీనికి అరచెంచా నల్ల ఉప్పు కలిపి కొద్ది కొద్దిగా నోట్లో వేసుకుంటూ బాగా నమిలి తినాలి. పావుగంటలో కడుపు నొప్పి, అపానవాయువుల సమస్యలు తగ్గిపోతాయి. కడుపులో జీర్ణక్రియ మెరుగవుతుంది కూడా.

తలతిరగడం



- రెండు చెంచాల సోంపులో ఒక చెంచా పటిక బెల్లం కలిపి తినాలి. వెంటనే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరిగి తలతిరగడం తగ్గుతుంది. తక్షణ శక్తి కూడా లభిస్తుంది.

విరేచనాలు



- అరకప్పు కమ్మని పెరుగులో ఒక చెంచా మెంతులు కలుపుకొని మెల్లగా తినాలి. పది నిమిషాల్లో విరేచనాలు తగ్గిపోతాయి. ఒక చెంచా పంచదారలో రెండు చుక్కల నీళ్ల కలిపి వేడిచేస్తే వచ్చే పాకం తిన్నా కూడా మంచి ఫలితం కనిపిస్తుంది.

న్యుమోనియా



- అరగ్లాసు గోరువెచ్చని నీటిలో చిటికెడు ఇంగువ కలుపుకొని తాగితే ముక్కులో శ్లేష్మం తగ్గి వెంటనే ఉపశమనం కలుగుతుంది.

పంటి నొప్పి



- చిన్న అల్లం ముక్కను తొక్కు తీసి సన్నగా తురమాలి. ఈ తురుముని వేళ్లతో పిండితే రసం వస్తుంది. రోజుకు రెండుసార్లు ఒక చెంచా అల్లం రసం తీసుకుంటే పంటినొప్పి, చిగుళ్ల వాపు క్రమంగా తగ్గుతాయి. ఈ రసాన్ని కొద్దిగా వేడిచేసి దాన్ని నొప్పి ఉన్న ప్రదేశంలో రాసినా ప్రయోజనం ఉంటుంది.

గాయాలు



- కూరలు తరిగేటపుడు చాకుతో వేలు కోసుకున్నా, పిల్లలు ఆడుకుంటూ దెబ్బలు తగిలించుకున్నా ఇలా ఏ చిన్న గాయమైనా వాటిపై కొద్దిగా పసుపును అద్దాలి. పసుపు యాంటీబయటిక్‌లా పనిచేసి గాయాన్ని త్వరగా మాన్పుతుంది.



ప్రియా సరోజ్... ఈమె గురించి ఇప్పుడు నెట్టింట తెగ వెతికేస్తున్నారు. భారత క్రికెటర్ రింకూసింగ్‌తో ఆమె పెళ్లి నిశ్చయం కావడమే అందుకు కారణం. వాస్తవానికి అతడికి కాబోయే సతీమణిగానే కాదు... రాజకీయ నాయకురాలిగా... యువ పార్లమెంటు సభ్యురాలిగా... ప్రియాకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది.

రింకూ ప్రియ సఖి

తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చినా... నిత్యం జనం మధ్య ఉంటూ... వారి సమస్యలు తెలుసుకొంటూ... తనదైన ఒక మార్గాన్ని నిర్మించుకున్నారు ప్రియా సరోజ్. పద్దెనిమిదేళ్లకే రాజకీయాల్లోకి వచ్చిన ఆమె... గత యూపీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు తండ్రి గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఎంపీగా పోటీ చేసి తనూ విజయం సాధించారు. ఉత్తరప్రదేశ్ వారణాసిలో పుట్టి పెరిగిన 26 ఏళ్ల ప్రియా... ఢిల్లీలోని 'ఎయిర్‌ఫోర్స్ గోల్డెన్ జూబ్లీ ఇనిస్టిట్యూట్‌'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. 'ఢిల్లీ విశ్వవిద్యాలయం' నుంచి బీఏ పట్టా పొందారు. నోయిడా 'అమిటీ యూనివర్సిటీ'లో ఎల్ఎల్‌బీ చదివారు. అనంతరం న్యాయవాదిగా కొంత కాలం సుప్రీమ్‌కోర్టులో ప్రాక్టీస్ చేశారు.

ఆమె తండ్రి తుఫానీ సరోజ్ మూడుసార్లు ఎంపీ. ప్రస్తుతం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచిన ప్రియా... బడికి వెళ్లే రోజుల్లోనే రాజకీయాలపై మక్కువ పెంచుకున్నారు. చిన్న వయసులోనే రాజకీయ వారసత్వాన్ని అందుకున్నారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ... ప్రజల మధ్యనే ఉంటూ... ఎంతో అనుభవం గడించారు. యూపీ శాసనసభకు జరిగిన గత ఎన్నికల్లో తండ్రి తరుపున అన్నీ తానై ప్రచారం నిర్వహించారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న పార్టీ... 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఆమెకు సీటు ఇచ్చింది. మచిలీషహర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె... 35 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందడమే కాదు... పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టారు. అంతేకాదు... లోక్‌సభకు ఎన్నికైన రెండో అతిపిన్న వయస్కురాలిగానూ చరిత్ర సృష్టించారు.

రింకూతో పరిచయం...

రెండేళ్ల కిందట జరిగిన ఐపీఎల్ మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో ఐదు సిక్స్‌లు బాది కోల్‌కతా నైట్ రైడర్స్‌ను గెలిపించడంతో రింకూసింగ్ పేరు మారుమోగింది. గుజరాత్ టైటాన్స్‌తో తలపడిన ఆ పోరులో నైట్‌రైడర్స్ ఓటమి ఖాయమనుకున్నారు అంతా. అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించిన రింకూ... ఆ తరువాత భారత టీ20 క్రికెట్ జట్టులో సభ్యుడయ్యాడు. దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఈ యూపీ హార్డ్ హిట్టర్ గురించి అప్పట్లో ఎన్నో కథనాలు ప్రచురితమయ్యాయి. కష్టపడి ఎదిగిన అతడి నేపథ్యం ప్రియను ఆకట్టుకుంది.


రెండేళ్ల కిందట ప్రియా ప్రాణమిత్రులొకరు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇద్దరూ కలిశారు. ఆ ఫ్రెండ్ తండ్రి కూడా క్రికెటర్. తనే రింకూను ప్రియకు పరిచయం చేశారు. తరువాత ఇరువురి మాటలు కలిశాయి. అభిరుచులు కలిశాయి. ప్రాంతాలూ ఒక్కటే. ఒకరు రాజకీయ నాయకురాలు... ఇంకొకరు భారత బ్యాట్స్‌మన్... నేపథ్యాలు వేరైనా... కెరీర్ పరంగా ఇద్దరికీ ఎంతో ప్రజాదరణ. లక్షల్లో అభిమానులు. క్రమంగా వారి స్నేహం ప్రేమగా మారింది. ఈ ప్రేమను వివాహ బంధంగా మార్చుకొని... జీవితాంతం కలిసి నడవాలని నిర్ణయించుకున్నారు. తమ ప్రేమ గురించి పెద్దలకు చెప్పి, వారి అనుమతి తీసుకున్నారు.



ఏఐ హడావుడి...

గత కొంత కాలంగా రింకూ పెళ్లి గురించి రకరకాల వార్తలు వస్తున్న నేపథ్యంలో... ఇటీవల ప్రియా తండ్రి ఆ విషయాన్ని నిర్ధారించారు. రింకూ తండ్రితో పెళ్లి గురించి మాట్లాడినట్టు ఆయన వెల్లడించారు. 'వారిద్దరికీ ఏడాదికి పైగా స్నేహం కొనసాగుతోంది. ఒకరినొకరు ఇష్టపడ్డారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఒకటి కావాలనుకున్నారు' అంటూ తుఫానీ సరోజ్ చెప్పారు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌తో రింకూ బిజీ. నెలాఖరులో ప్రారంభం కానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలతో ప్రియా కూడా బిజీ. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల అనంతరం నిశ్చితార్థం జరుపుతామని ప్రియా తండ్రి తెలిపారు. ఇదిలావుంటే... ఈ వార్త వచ్చినప్పటి నుంచీ వీరిద్దరి నిశ్చితార్థం జరిగిపోయిందంటూ ఏఐ సాయంతో రూపొందించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అదంతా నిజం కాదంటూ తుఫానీ వివరణ ఇవ్వాల్సివచ్చింది.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
వరంగల్ ● గురువారం 23 జనవరి 2025



బ్యాడ్ బాయ్‌గా నాగశౌర్య

నాగశౌర్య హీరోగా రామ్‌దేశినా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. చిత్రబృందం బుధవారం టైటిల్‌ను ప్రకటించింది. ఈ యాక్షన్ ఎంటర్టైనర్ కు'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే టైటిల్‌ను నిర్ణయించారు. విధి కథానాయిక. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. బుధవారం నాగశౌర్య పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో నాగశౌర్య సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. నుదుటిపై మూడు గోవింద నామాలు, చేతులపై రక్తంతో ఉన్న ఆయన లుక్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. సముద్రఖని, వీకే నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



కుంభమేళా మోనాలిసాకు సినిమా అవకాశం

సహజ సౌందర్యం, అమాయకపు చిరునవ్వుతో దేశం దృష్టిని ఆకర్షించిన కుంభమేళా వైరల్ గర్ల్ మోనాలిసా భోంస్లేకు మరో అరుదైన అవకాశం దక్కింది. ప్రయాగ్‌రాజ్‌లో ఆమె రుద్రాక్ష మాలలు, ముత్యాల హారాలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. బాలీవుడ్ సినీ ప్రముఖులను సైతం ఆ వీడియోలు ఆకర్షించడంతో ఓ బాలీవుడ్ సినిమాలో నటించే అవకాశం ఆమెను వెతుక్కుంటూ వచ్చింది. తను త్వరలో తెరకెక్కించబోతున్న 'మణిపూర్ డైరీస్' చిత్రంలో మోనాలిసా బోంస్లేకు ఓ పాత్ర ఇస్తానని దర్శకుడు సనోజ్ మిశ్రా ప్రకటించారు. బాలీవుడ్‌లోని మురికిని ప్రోత్సహించే బదులు ఇలాంటి నిరుపేద అమ్మాయికి నా తదుపరి చిత్రంలో అవకాశం ఇద్దామనుకుంటున్నాను అని ఆయన ట్వీట్ చేశారు. త్వరలో ఆమెను కలసి తన ప్రతిపాదన తెలియజేస్తాననీ, ఆమెకు నటన రాకుంటే శిక్షణ ఇచ్చి తన సినిమాలో నటింపజేస్తానని ఆయన చెప్పారు. మోనాలిసా కుంభమేళా నుంచి తన ఇంటికి వెళ్లిపోయారు. ఆమెను చూసేందుకు, ఫొటోలు దిగేందుకు జనాలు ఎగబడుతుండడంతో వ్యాపారం దెబ్బతినడంతో పాటు, మోనాలిసా కూడా ఇబ్బందిపడ్డారు. దాంతో తండ్రి ఆమెను సొంతూరుకు పంపారు.



అది నా పూర్వజన్మ సుకృతం

నందమూరి బాలకృష్ణ

కోట్లాది మందికి ఆరాధ్యులు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, తెలుగు ప్రజల గుండె చప్పుడు అయిన మహానుభావుడి కడుపున జన్మించడం తన పూర్వజన్మ సుకృతమని హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. అనంతపురం నగరంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన డాకూ మహరాజ్ సినిమా విజయోత్సవాలలో ఆయన ప్రసంగించారు. చిత్రయూనిట్‌తో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని టీడీపీ నాయకులు, బాలయ్య అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తన సినిమా, రాజకీయ, సేవా కార్యక్రమాలకు ఎన్టీఆర్ స్ఫూర్తి అని అన్నారు. తన సినిమా రికార్డులు, రివార్డులు, కలెక్షన్స్ అన్నీ ఒరిజినలేనని, తన అభిమానులకు ఈ విషయం ఎరుక అని అన్నారు. కోట్లాది మంది అభిమానులను చూస్తే తనకు ఎంతో గర్వంగా ఉంటుందని, తన జీవితం ధన్యమైందని అన్నారు. విజ్ఞానం, వినోదం అందించే చిత్రాలతో అందరూ బాగుండాలి, అందులో మనం ఉండాలనే కాన్సెప్ట్‌తో ముందుకు వెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధా శ్రీనాథ్, చిన్నారి వేద అగర్వాల్‌తో పాటు నటీనటులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి)

నెలాఖరున మదగజరాజా



హీరో విశాల్ నటించిన తాజా చిత్రం 'మదగజ రాజా'. సుందర్ సి దర్శకత్వంలో జెమినీ ఫిలిం సర్క్యూట్ బేనర్‌పై రూపొందింది. వరలక్ష్మీ శరత్‌కుమార్, అంజలి కథానాయికలుగా నటించారు. సంతానం, సోనూసూద్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈనెల 31న తెలుగులో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. సత్యకృష్ణ ప్రొడక్షన్స్ తెలుగు హక్కులు దక్కించుకుంది. విశాల్ యాక్షన్, సంతానం కామెడీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ఎం నాథన్

నా పదేళ్ల కెరీర్‌లో అత్యంత ఇష్టమైన సినిమా ఇదే

అనుపమ పరమేశ్వరన్





'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పరదా'. అనుపమ పరమేశ్వరన్, దర్శన రాజేందర్, సంగీత ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పి.వి., శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్ర టీజర్‌ను దుల్కర్ సల్మాన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అనుపమ మాట్లాడుతూ "ఈ టీజర్ చూస్తూ భావోద్వేగానికి లోనయ్యాను. నా పదేళ్ల ప్రయాణంలో నాకు అత్యంత ఇష్టమైన సినిమా ఇదే. అలాగే, ఇందులో పోషించిన 'సుబ్బు' నాకు ఇష్టమైన పాత్ర. కుటుంబంతో కలసి చూడాల్సిన చిత్రమిది" అని చెప్పారు. "ఈ సినిమాలో కంటెంట్ మాట్లాడుతుంది. ప్రవీణ్ చాలా పెద్ద దర్శకుడు అవుతాడు" అని నిర్మాత విజయ్ అన్నారు. "మహిళా ప్రాధాన్యమున్న సినిమాలు 'పరదా' తర్వాత మరిన్ని తెరకెక్కుతాయి. ఈ సినిమాలో నటించిన నటీనటుల నుంచి అద్భుతమైన ప్రదర్శనను చూస్తారు" అని ప్రవీణ్ కండ్రేగుల తెలిపారు.



వీల్‌ఛైర్‌లో రష్మిక

కథానాయిక రష్మిక మందన్న ఇటీవలే జిమ్‌లో కసరత్తులు చేస్తూ గాయపడినట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. ముంబైలో జరుగుతున్న 'ఛావా' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం ఆమె హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. కాలికి పెద్ద కట్టుతో నడవలేని స్థితిలో ఆమె కనిపించారు. కారులో నుంచి దిగి ఒంటికాలిపై గెంతుతూ వెళ్లి వీల్‌ఛైర్‌లో కూర్చున్నారు. సహాయకులు అక్కడి నుంచి ఆమెను విమానాశ్రయం లోపలకు తీసుకెళ్లారు. ఆసమయంలో బయట ఎవరూ గుర్తుపట్టకుండా రష్మిక తన ముఖానికి మాస్క్, తలపైన టోపీ ధరించారు. ముంబైలో జరిగిన 'ఛావా' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమంలోనూ రష్మిక మెట్లపై ఒంటికాలిపై గెంతుతూ వేదికపైకి ఎక్కారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రష్మిక త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

ఆ విషయంలో శ్రీమంతుడ్ని

- అనిల్ రావిపూడి



'పటాస్' సినిమాతో దర్శకుడిగా అడుగుపెట్టారు అనిల్ రావిపూడి. ఇటీవలే వెంకటేశ్ కథానాయకుడిగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాను తెరకెక్కించి ఘనవిజయం అందుకున్నారు. ఆయన ఇండస్ట్రీలో దర్శకుడిగా 10 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బుధవారం మీడియాతో ముచ్చటించారు. "దర్శకుడిగా ఈ పదేళ్ల అనుభవం ఎంతో అద్భుతంగా సాగింది. నేను పనిచేసిన ప్రతీ హీరోతో బలమైన అనుబంధం ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఇచ్చిన విజయోత్సాహం జీవితాంతం మరిచిపోలేనిది. ఇంతటి విజయం కేవలం ప్రేక్షకుల ప్రేమ వల్లే సాధ్యమైంది. ఈ పదేళ్లలో నేను వారి అంతులేని ప్రేమాభిమానాలను సంపాదించుకోగలిగా. ఆ పరంగా చూస్తే నేనో శ్రీమంతుడ్ని. నిజానికి కెరీర్ మొదలుపెట్టినప్పుడు ఒక్క సినిమాకు దర్శకుడిగా పనిచేస్తే చాలనుకున్నా. ఇప్పుడు ఏకంగా ఎనిమిది వరుస విజయాలు అందుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు చాలా మంది నన్ను దిగ్గజ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణతో పోల్చడం నేను అందుకున్న గొప్ప ప్రశంసల్లో ఒకటి. మెగాస్టార్ చిరంజీవితో చేసే సినిమా గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. ఆయనను ఇంతవరకూ ఎవరూ చూపించని విధంగా చూపించాలని మాత్రం ప్రయత్నిస్తున్నా. ప్రస్తుతం ఎలాంటి జానర్ సినిమా చేస్తే బాగుంటుంది అన్న దానిపైనే దృష్టిపెట్టా" అని చెప్పారు.



నేనున్నానని గుర్తుంచుకో

'నీకెప్పుడు ఏ అవసరం వచ్చినా నేనున్నానని గుర్తుంచుకో' అని తన ప్రాణాలు కాపాడిన ఆటో డ్రైవర్ భజన్ సింగ్ రానాకు సైఫ్ అలీఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక ఆయన భజన్‌సింగ్‌ను కలిశారు. సైఫ్ స్వయంగా భజన్‌సింగ్‌కు ఫోన్ చేసి తమ ఇంటికి రావలసిందిగా ఆహ్వానించారు. సైఫ్ కుటుంబ సభ్యులంతా కలసి భజన్ సింగ్‌ను ఆత్మీయంగా సత్కరించారు. వారిద్దరూ కలసి దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కత్తిపోట్లకు గురై రక్తమోడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న సైఫ్ అలీఖాన్‌ను సమయానికి భజన్‌సింగ్ తన ఆటోలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలను కాపాడిన విషయం తెలిసిందే.

వీరుడొస్తున్నాడు



తమిళ హీరో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వీర ధీర శూరన్ 2'. ఎస్.యూ అరుణ్‌కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. మార్చి 27న ఎన్వీఆర్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ బుధవారం తెలిపారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో దుషార విజయన్ కథానాయిక. ఎస్. జే సూర్య కీలకపాత్ర పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తేని ఈశ్వర్.

రెండో రోజూ ఐటీ సోదాలు

● నవీన్ ఏర్నేని, యలమంచిలి రవిశంకర్, చెర్రీ, దిల్ రాజు తదితరుల నివాసాల్లో సోదాలు
● నిర్మాతల బినామీల బ్యాంకుఖాతాల గుర్తింపు ● కలెక్షన్లు, ఐటీకి సమర్పించిన వివరాల్లో వ్యత్యాసం

సినీ రంగానికి చెందిన ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఆదాయపు పన్ను (ఐటీ) అధికారులు రెండోరోజైన బుధవారం కూడా సోదాలు కొనసాగించారు. 55 బృందాలుగా విడిపోయి వివిధ ప్రాంతాల్లో సోదాలు జరిపారు. ఇటీవల విడుదలైన చిత్రాలు పుష్ప 2, సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ చేంజర్, వారసుడు సినిమాలకు సంబంధించిన లెక్కలపై ప్రధానంగా దృష్టి సారించారు. పుష్ప 2 సినిమా దర్శకుడు సుకుమార్ బుధవారం హైదరాబాద్ చేరుకోవటంతో శంషాబాద్ విమానాశ్రయంలోనే ఐటీ అధికారులు ఆయనను కలుసుకొని.. నేరుగా తన ఇంటికి తీసుకుని వచ్చారు. పుష్ప 2 సినిమాకు సుకుమార్ తీసుకున్న పారితోషికం గురించి వారు ఆరా తీసినట్లు సమాచారం. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్, మైత్రి మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థలకు సంబంధించిన కార్యాలయాలతో పాటు నిర్మాతలు నవీన్ ఏర్నేని, యలమంచలి రవిశంకర్, చెర్రీ, దిల్ రాజుతోపాటు ఆయన కుటుంబసభ్యుల నివాసాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. కాగా, ఏరియాల వారీగా సినిమాను విక్రయించే విషయంలో డిస్ట్రిబ్యూటర్లతో జరిగే ఒప్పందాల్లో చాలావరకు నల్లధనం ఉంటుందని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ క్రమంలో నిర్మాతలకు బినామీలుగా వ్యవహరిస్తున్న వారి బ్యాంకు ఖాతాల మీద దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సినిమాలకు సంబంధించిన పెట్టుబడి, అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని పరిశీలిస్తున్నపుడు పలు అవకతవకలు బయటపడినట్లు సమాచారం. ఇటీవల విజయవంతమైన సినిమాల బ్యాలెన్స్‌షీట్లు, ఐటీ శాఖకు ఆయా నిర్మాణ సంస్థలు అందించిన వివరాల్లో కూడా భారీ వ్యత్యాసమున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. సినిమా కలెక్షన్లకు సంబంధించిన జీఎస్టీ రిటర్నుల్లో కూడా వ్యత్యాసాలు గుర్తించినట్లు సమాచారం.

భారీ కలెక్షన్లపై దృష్టి

తక్కువ పెట్టుబడితోనే నిర్మాణం పూర్తి చేసుకున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు తొలి వారంలోనే రూ.200 కోట్ల కలెక్షన్లు, పుష్ప 2 సినిమాకు ఇప్పటి వరకూ రూ.1850 కోట్ల కలెక్షన్లు వచ్చినట్లుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వాటిపైనా ఐటీ అధికారులు దృష్టి సారించారు. తమిళ హీరో విజయ్ నటించిన వారసుడు సినిమాకు సంబంధించి దిల్ రాజు సంస్థ చూపించిన లెక్కలపైనా అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఐటీ సోదాలు తనను ఒక్కడినే లక్ష్యంగా చేసుకొని జరగడం లేదని, సినీ రంగంలో చాలాచోట్ల జరుగుతున్నాయని నిర్మాత దిల్‌రాజు పేర్కొన్నారు. ఐటీ అధికారులు అడిగిన అన్ని వివరాలు, బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇచ్చామని, పన్ను చెల్లింపునకు సంబంధించి తేడాలుంటే వారిచ్చే నోటీసుల ఆధారంగా వ్యవహరిస్తామన్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

పట్టపగలు నడిరోడ్డుపై దారుణహత్య

- ఒక ఆటో డ్రైవర్‌పై కత్తితో మరో ఆటో డ్రైవర్ దాడి
- తీవ్రగాయాలతో అక్కడే మృతి చెందిన బాధితుడు
- వివాహేతర సంబంధం నేపథ్యంలో ఘాతుకం
- హనుమకొండ అదాలత్ జంక్షన్ వద్ద ఘటన

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు.. నగరం నడిబొడ్డున.. జన సంచారంతో, వాహనాల రాకపోకలతో బిజీగా ఉన్న ప్రధాన రహదారిపై.. ఓ ఆటో డ్రైవర్‌ను మరో ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేసి చంపేశాడు. హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అదాలత్ జంక్షన్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిందీ దారుణం. కళ్లముందే జరిగిన ఈ హత్యతో అక్కడున్నవారు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండకు చెందిన మాచర్ల రాజ్‌కుమార్ (45) స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుకొంటూ జీవించే అతడికి.. భార్య, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. అలాగే.. మడికొండ అయోధ్యపురానికి చెందిన ఈనుగు వెంకటేశ్వర్లు అదే ప్రాంతంలో ఆటో నడుపుకొంటూ జీవిస్తున్నాడు. వెంకటేశ్వర్లుకు అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో కొన్నిరోజులుగా వివాహేతర సంబంధం ఉంది. ఇటీవలికాలంలో రాజ్‌కుమార్ కూడా ఆమెతో సన్నిహితంగా ఉండడం గమనించి.. వెంకటేశ్వర్లు అతడిపై కక్ష పెంచుకున్నాడు. ఆ మహిళ జోలికి రావొద్దని పలుమార్లు హెచ్చరించాడు. ఈ విషయంపై ఇద్దరూ కొన్నిసార్లు గొడవ కూడా పడ్డారు. కొద్దిరోజులుగా ఆ మహిళ తనను దూరం పెట్టడంతో.. అందుకు కారణం రాజ్‌కుమారే అని భావించిన వెంకటేశ్వర్లు ఆ ఇద్దరిపై కక్ష పెంచుకున్నాడు. బుధవారం ఉదయం రాజ్‌కుమార్ ఆటోను వెంబడించి హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో అడ్డగించి అతడితో గొడవకు దిగాడు. మాటామాటా పెరగడంతో.. వెంకటేశ్వర్లు తన ఆటోలో ఉన్న కత్తి తీసి రాజ్‌కుమార్‌పై దాడి చేశాడు. అతడు కిందపడిపోగానే కత్తితో తీవ్రంగా దాడి చేశాడు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళకు గురయ్యారు. అతడి చేతిలో కత్తి ఉండటం, తీవ్ర ఆవేశంతో ఉండటంతో.. అతణ్ని ఆపితే తమకేమన్నా అవుతుందనే భయంతో అడ్డుకునేందుకు తొలుత ప్రయత్నించలేదు. కొంతమంది ఈ దారుణాన్ని సెల్‌ఫోన్లలో వీడియో తీస్తుండగా.. ఒక వ్యక్తి వెంకటేశ్వర్లును ఆపేందుకు ప్రయత్నించేటప్పటికే రాజ్‌కుమార్ తీవ్రగాయాలతో కింద పడిపోయాడు. అప్పుడు కొందరు స్థానికులు వెంకటేశ్వర్లును పట్టుకుని దేహశుద్ధి చేసి.. తాళ్లతో కట్టేసే యత్నం చేశారు. ఈలోపు సమాచారం తెలుసుకుని అక్కడికి చేరుకున్న సుబేదారి పోలీసులు వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. గాయాలతో స్పృహలేకుండా ఉన్న రాజ్‌కుమార్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఘటనా స్థలాన్ని పరిశీలించి, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి సీసీ కెమెరాలలో రికార్డు అయిన దృశ్యాలను పరిశీలించారు. కాగా.. రాజ్‌కుమార్‌పై వెంకటేశ్వర్లు దాడి దృశ్యాలను కొంతమంది తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు.


హత్యకు గురైన రాజ్‌కుమార్ (ఫైల్)

రాష్ట్రానికి మంజూరైన జాతీయ రహదారుల నిర్మాణాల్లో ఆటంకంగా మారిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వశాఖ (మోర్త్) తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల అడిషనల్ డైరక్టర్ జనరల్ రాజీవ్‌సింగ్ అన్నారు. తెలంగాణకు మంజూరైన ప్రాజెక్టులపై సమీక్షించేందుకు ఆయన బుధవారం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మోర్త్ వార్షిక ప్రణాళిక, ప్రస్తుతం నడుస్తున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. - హైదరాబాద్

ప్రేమోన్మాదం

- ఖమ్మంలో యువతిపై యాసిడ్ దాడి
- తనని ప్రేమించడం లేదని ఓ యువకుడి ఘాతుకం
- భోగి రోజున ఘటన
- ఆలస్యంగా బయటకు, నిందితుడి అరెస్టు


నిందితుడు గణేష్

ఖమ్మం క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఓ యువకుడు ప్రేమోన్మాదంతో రెచ్చిపోయాడు. తనని ప్రేమించని యువతిపై యాసిడ్‌తో దాడి చేసి రాక్షసత్వం ప్రదర్శించాడు. సదరు యువతి భోగి పండగ రోజున తన ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఈ దాడి జరగ్గా.. విషయం ఆలస్యంగా పోలీసుల దృష్టికి వచ్చింది. ఖమ్మం త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం ప్రకాశ్‌నగర్ ప్రాంతానికి చెందిన పేరబోయిన గణేశ్ స్థానికంగా మండపం డెకరేషన్ పనులకు వెళుతుంటాడు. ఖమ్మంకే చెందిన ఓ నర్సింగ్ విద్యార్థినిని కొంతకాలంగా ప్రేమ పేరిట వేధిస్తున్నాడు. తన వెంట పడవద్దని ఆ యువతి పలుమార్లు హెచ్చరించినా గణేశ్ పట్టించుకోలేదు. గణేశ్ వేధింపులు ఎక్కువ అవ్వడంతో బాధిత యువతి... ఓ పాఠశాలలో ఆయాగా పని చేసే తన తల్లి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లింది. భర్తను కోల్పోయి కుమార్తె, కుమారుడిని పెంచుతున్న ఆమె.. తన కుమార్తె జోలికి రావద్దని గణేశ్‌ను కొద్ది రోజుల క్రితమే మందలించింది. ఈక్రమంలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 13న రాత్రి బాధిత యువతి తమ ఇంటి ముందు ముగ్గువేస్తుండగా గణేశ్ అక్కడికి వచ్చాడు. తనని ప్రేమించడం లేదనే కోపంతో ఆపై యాసిడ్ చల్లి పరారయ్యాడు. యువతి చెయ్యి, పొట్ట మీద యాసిడ్ పడి గాయాలవ్వగా కుటుంబసభ్యులు, స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. యువతి ఆరోగ్యం నిలకడగానే ఉంది. అయితే, కుటుంబ పరువు పోతుందని, గణేశ్ మరేదైనా హాని తలపెడతాడనే భయంతో బాధితురాలు, ఆమె తల్లి దాడి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకురాలేదు. కానీ, స్థానికుల ద్వారా ఆ నోట ఈ నోట పాకిన విషయం సోషల్ మీడియా ద్వారా పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో విచారణ జరిపిన పోలీసులు బాధిత యువతి తల్లి నుంచి మంగళవారం రాత్రి ఫిర్యాదు తీసుకుని గణేశ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆనందం.. ఆవేదన!

అర్హుల ప్రాథమిక జాబితాలో పేర్లున్నవారి సంతోషం.. పేర్లు రాలేదని తెలిసి ఆశావహుల్లో అసంతృప్తులు

- మళ్లీ దరఖాస్తులు.. రెండోరోజు 3,888 గ్రామసభలు
- నాలుగు పథకాల కోసం కొత్తగా 59,888 దరఖాస్తుల స్వీకరణ
- సభల్లో పాల్గొన్న ఉత్తమ్, పొంగులేటి, పొన్నం, దామోదర

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


యాదాద్రి జిల్లా భువనగిరి మండలం అనంతారంలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి కారుకు అడ్డుపడుతున్న బీఆర్ఎస్ నేతలు

వినతులు, ఆవేదనలు, అసంతృప్తులు, ఆగ్రహాలు, నిరసనలు, ఆనందాలు! ఇలా పథకాల్లో తమ పేర్ల నమోదుకు సంబంధించి ఆశావహుల ద్వారా గ్రామసభల్లో వ్యక్తమైన రకరకాల భావోద్వేగాలు!! రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హుల ఎంపిక కార్యక్రమం వరుసగా రెండోరోజు గ్రామసభల ద్వారా జరిగింది. అధికారులు సిద్ధం చేసి వెలువరించిన ప్రాథమిక జాబితాలో తమ పేర్లొచ్చిన వారు ఆనందపడితే పేర్లు లేకపోవడంతో ఆశావహులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కొన్నిచోట్ల అధికారుల ఎదుటే తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో వారు మళ్లీ దరఖాస్తు పెట్టుకున్నారు. రెండోరోజు బుధవారం 3,888 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. 4 పథకాలకు 59,888 దరఖాస్తులొచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఖమ్మంజిల్లా పాలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంత్రి పొంగులేటి.. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో నీటిపారుదల, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి దామోదర హాజరయ్యారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, తొలిదశలో సొంత స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని పొంగులేటి అన్నారు. పేదల్లో ప్రతి ఒక్కరికి పథకాలు అందజేస్తామని దామోదర పేర్కొన్నారు. కాగా, ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాలిగొండలో పామర్తి శ్రీను అనే వ్యక్తి, తాను నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటికి డబ్బులిప్పించాలంటూ సెల్ టవర్ ఎక్కాడు. 2008లో శ్రీను ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్నాడు. డబ్బులు మాత్రం పామర్తి శ్రీను అనే పేరుతో ఉన్న మరో వ్యక్తి ఖాతాలో పడ్డాయి. ఈ విషయం ఇటీవల సర్వేలో బయటపడింది. ఇల్లు నిర్మించుకున్న శ్రీను పంచాయితీ పెట్టడంతో మరో శ్రీను నుంచి డబ్బులు ఇప్పిస్తామని పెద్దలు హామీ ఇచ్చారు. అయితే బుధవారం జరిగిన గ్రామసభలో తనకు న్యాయం జరగలేదనే ఆవేదనతో ఇల్లు కట్టుకున్న శ్రీను సెల్‌టవర్ ఎక్కాడు. మధిర మండలం ఆత్కూరులో తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథగా మారిన బాలికకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించారు. ఈ మేరకు గ్రామస్థులు ఏకగ్రీవంగా అధికారులకు సూచించడంతో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం కోమట్లగూడెంలో పథకాల జాబితాలో ఓ వర్గం పేర్లు ఉద్దేశపూర్వకంగా తొలగించారంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో దరఖాస్తుదారుల నుంచి రూ.500 చొప్పున వసూలు చేశారని ఆరోపిస్తూ గ్రామసభను బహిష్కరించిన గ్రామస్థులు రోడ్డు మీద బైఠాయించి నిరసన తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో తన దరఖాస్తు మాయమైందంటూ చెన్న దేవేందర్ సభ సాక్షిగా నేలమీద పడుకొని నిరసన తెలిపాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం దస్నాపూర్ కాలనీలో జరిగిన సభలో తనకు వృద్ధాప్య పింఛను ఇప్పించాలంటూ నిర్మలమ్మ.. "కాల్మొక్తసారూ కనికరించండి" అంటూ కలెక్టర్ రాజర్షి షా కాళ్లమీద పడి వేడుకుంది. ఆమెకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించడంతో నిర్మలమ్మ ఆనందం వ్యక్తంచేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా బచ్చన్నపేటలో తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలంటూ సిరిపాటి స్వరూప కంటతడి పెట్టుకుంది. 13 ఏళ్లుగా రేషన్ కార్డు కోసం, ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నానని న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. యాదాద్రి జిల్లా భువనగిరి మండలం అనంతారంలో అర్హుల పేర్లు జాబితాలో లేవంటూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి ప్రసంగాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆయన సభ నుంచి మధ్యలోనే వెళ్లిపోతుండగా కారును అడ్డగించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 43వ డివిజన్‌లో.. ఇందిరమ్మ ఇళ్ల జాబితా లో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి భార్య వైశాలిరెడ్డి పేరు ఉండటంతో బీజేపీనేతలు ఆందోళన చేశా రు. గతంలో ఉద్యమకారుల జాబితాలో 250 గజాల స్థలం కేటాయింపు కోసం ప్రజాపాలన సభలో దరఖాస్తు చేసుకున్నానని, అందుకే తన పేరు వచ్చిందని వైశాలిరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని సిరికొండలో.. భూములున్న వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశారని స్థానికులు ఆరోపించారు.

ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలి

- ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ లచ్చిరెడ్డి

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి(ఐకాస) చైర్మన్ వి. లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హైదారాబాద్‌లో నిర్వహించిన ఐకాస సమావేశంలో చేసిన పలు తీర్మానాలను ఆయన వెల్లడించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, సాధారణ ఎన్నికల్లో బదిలీ చేసిన తహసీల్దార్లను సొంత ప్రాంతాలకు పంపాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేయాలనే కోరుతూ ప్రభుత్వానికి తీర్మానాలను ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్, ఇతర లోన్లు అడ్వాన్సులు పెంచాలని, ఈ కుబేర్‌లో రూ.10 లక్షల లోపు పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పొరుగు సేవల కింద నియమించే ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీవో 317 కింద బదిలీలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డికి ఐకాస తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

25న బీసీల విస్తృతస్థాయి సమావేశం: జాజుల

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో త్వరలో జరగబోయే శాసనమండలి ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, ప్రకటించేందుకు ఈనెల 25న వివిధ బీసీ, కుల సంఘాలు, మేధావులతో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిజాయితీ చాటుకున్న మహిళా కండక్టర్

- బస్సులో ప్రయాణికులు మరిచిన బ్యాగు అందజేత
- అందులో రూ.4 లక్షల విలువైన బంగారు నగలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ సుజాత విధి నిర్వహణలో నిజాయితీ చాటుకున్నారు. సంగారెడ్డి జిల్లాలోని కంది గ్రామానికి చెందిన బీహెచ్‌ఈఎల్ రిటైర్డ్ ఉద్యోగి సత్తయ్య- శామమ్మ దంపతులు మంగళవారం సాయంత్రం లింగంపల్లి- సంగారెడ్డి బస్సులో ప్రయాణించారు. వారు తమ బ్యాగును బస్సులోనే మర్చిపోయి గమ్యస్థలంలో దిగి వెళ్లిపోయారు. ఆ బ్యాగును చూసిన కండక్టర్ సుజాత ఆర్టీసీ అధికారులకు అప్పగించారు. అందులో రూ.4 లక్షల విలువైన బంగారు నగలతో పాటు బీహెచ్‌ఈఎల్ జనరల్ ఆస్పత్రి ఓపీ పుస్తకం ఉన్నాయి. ఆ పుస్తకంలోని వివరాల ఆధారంగా ఆర్టీసీ అధికారులు సత్తయ్య దంపతులను పిలిపించి ఆర్టీసీ డీఎం ఉపేందర్ సమక్షంలో బ్యాగును, అందులోని బంగారు నగలను వారికి అప్పగించారు. ఈ సందర్భంగా నిజాయితీ చాటుకున్న కండక్టర్ సుజాతను ఉపేందర్ శాలువాతో సన్మానించి అభినందించారు.

బీఆర్ఎస్ నల్లగొండ రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి

- 28న శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆదేశం

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందంటూ నల్గొండలో బీఆర్ఎస్ తలపెట్టిన రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతిచ్చింది. ఈనెల 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 1500 మందితో శాంతియుతంగా ధర్నా నిర్వహించుకోవచ్చని పేర్కొంది. రైతు భరోసా రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 12 వేలకు తగ్గించడంపై బీఆర్ఎస్ నల్గొండలో ధర్నా తలపెట్టగా పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ నల్గొండ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం ధర్నాకు అనుమతిస్తూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని సూచించింది.

భార్యను ముక్కలుగా కోసి.. కుక్కర్‌లో ఉడికించి..

(మొదటి పేజీ తరువాయి)

పాటు ఎండబెట్టి.. రోకలితో దంచాడు! ఆ పొడిని తీసుకెళ్లి ఓ చెరువులో పడేశాడు!! ఒళ్లు గగుర్పాటుకు గురిచేసేలా ఉన్న ఈ ఘోరం రాచకొండ పరిధిలోని మీర్‌పేట్‌లో వెలుగుచూసింది. భార్య ఎవరితోనో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందనే అనుమానంతోనే అతడింతటి ఘోరానికి పాల్పడ్డాడు. ప్రణాళిక ప్రకారం భార్యను చంపి.. మృతదేహాన్ని మాయం చేసేందుకు ఆ దుర్మార్గుడు.. తొలుత ఓ వీధి కుక్కను చంపి.. ముక్కలుగా కోసి.. ఆ అవశేషాలను చెరువులో పడేసినట్లు తెలిసింది. నిందితుడి ఇంటి వద్ద కుక్క తల కనిపించినట్లు సమాచారం. నిందితుడు ఆర్మీలో పని చేసి రిటైర్ అయిన 39 ఏళ్ల గురుమూర్తి! అతడి స్వస్థలం ఏపీలోని ప్రకాశం జిల్లా తూప్రాన్. పోలీసు వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. గురుమూర్తి, 13 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లాకే చెందిన ఉప్పాల వెంకటరమణ-సుబ్బమ్మ దంపతుల కుమార్తె వెంకట మాధవిని పెళ్లి చేసుకున్నాడు. గురుమూర్తి-వెంకటమాధవికి పాప (10), బాబు (7) ఉన్నారు. రెండేళ్ల క్రితం గుర్తుమూర్తి ఉద్యోగ విరమణ చేశాడు. కంచన్‌బాగ్‌లోని ఓ సెక్యూరిటీ సంస్థలో పనిచేస్తున్నాడు. గురుమూర్తి కుటుంబం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ శ్రీవెంకటేశ్వర నగర్ కాలనీలో ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. కొన్నాళ్లుగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న గురుమూర్తి, ఆమెతో తరచూ గొడవపడుతూ తీవ్రంగా వేధిస్తున్నాడు. పండుగ ముందు రోజు.. అంటే ఈనెల 13న కూడా భార్యతో గొడవపడి.. ఆమెను కత్తితో పొడిచి చంపాడు. ఆ మృతదేహాన్ని ముక్కలుగా కోసి.. కుక్కర్‌లో ఉడకబెట్టి, ఆ అవశేషాలను మూడు రోజుల పాటు ఇంట్లోనే ఎండబెట్టి.. దంచి.. ఆ పొడిని బకెట్‌లో వేసుకొని జిల్లెలగూడ చెరువులో పడేశాడు.


గురుమూర్తి-వెంకట మాధవి దంపతులు(ఫైల్)

ఏమీ తెలియనట్లు అత్తతో కలిసి ఫిర్యాదు

భార్యను హత్య చేసిన మూడు రోజుల తర్వాత 16వ తేదీన గురుమూర్తి, నగరంలోనే మరోచోట ఉంటున్న తన అత్తగారైన సుబ్బమ్మకు ఫోన్ చేశాడు. మాధవి తనతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయిందని నమ్మించాడు. అదేరోజు ఆమెతో కలిసి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా భార్యను హత్యచేయాలనే పథకంలో భాగంగానే అతడు సంక్రాంతి పండుగ సెలవుల పేరుతో ఇద్దరు పిల్లల్ని తన అత్తగారింటికి పంపించాడు. అయితే మాధవి ఆచూకీ కోసం స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. అయితే.. 16న మాధవి ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయినట్లు ఏ ఫుటేజీలో కనిపించలేదు. దీంతో గురుమూర్తినే పోలీసులు అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా మాధవిని తానే హత్య చేసినట్లు అతడు అంగీకరించినట్లు తెలిసింది. దీన్ని ఇంకా పోలీసులు ధ్రువీకరించడం లేదు. గురుమూర్తి పోలీసుల అదుపులోనే ఉన్నాడని, రేపోమాపో అతడిని మీడియా ముందుకు తీసుకువచ్చి హత్య వివరాలు వెల్లడించే అవకాశమున్నట్లు తెలిసింది.

పోలీసుల పహారాలో గ్రామసభలా?

- సర్కార్ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత: హరీశ్‌రావు



సిద్దిపేట టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పహారా మధ్య గ్రామసభలు నిర్వహిస్తున్నారని, ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని 15వ వార్డు లింగారెడ్డిపల్లిలో నిర్వహించిన వార్డు సభకు హాజరైన ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న దగ్గర ప్రొటోకాల్ పాటించడం లేదని, గ్రామసభల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫోటో పెడుతున్నారు గాని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న దగ్గర ఫొటోలు పెట్టడం లేదన్నారు. ఇష్టారాజ్యంగా పరిపాలన కొనసాగిస్తున్నారని, ఏడాదికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందని ఆయన అన్నారు. రైతుల రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వాన్ని చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే యాసంగి, వానాకాలానికి కలిపి రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని, ఏడాదికి ఐదు లక్షల ఇళ్లు కడతామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన ఒక్క ఇల్లయిన ప్రభుత్వం కట్టిందా అని ఆయన ప్రశ్నించారు.

రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

- త్వరలో నల్లగొండలో రైతు ధర్నా చేపడతాం : కేటీఆర్



హైదరాబాద్, జనవరి22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ తప్పుడు నిర్ణయాలతో పాటు, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంవల్లే అన్నదాతలు ప్రాణం తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ప్రతిపక్షాలపై అక్రమకేసులు బనాయించడం, అరెస్టులు చేసే తాపత్రయం సీఎం రేవంత్‌రెడ్డిదని ఆరోపించారు. సీఎం ప్రాధాన్యం ఫార్ములా కేసైతే, తమ ప్రాధాన్యత ఫార్మర్‌లని తెలిపారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా నల్లగొండలో రైతుధర్నా నిర్వహిస్తామని చెప్పారు. రైతు ఆత్మహత్యలపై ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ అధ్యయన కమిటీ చైర్మన్ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో పాటు కమిటీ ప్రతినిధులతో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్ బ్యాంకులో రైతు ఆత్మహత్య ఘటనే అధ్యయన కమిటీ వేయడానికి కారణమని, రైతు సంక్షేమ కోసమే తప్ప ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదన్నారు. ఈనెల 24న పూర్వ ఆదిలాబాద్ జిల్లా నుంచి అధ్యయనం ప్రారంభిస్తామన్నారు.

మాజీ ఎమ్మెల్యేకే రక్షణలేదు: కేటీఆర్

దివ్యాంగుడైన మాజీ ఎమ్మెల్యేకే రక్షణ లేదని కేటీఆర్ ఆరోపించారు. పోలీసుల ముందే మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై మంత్రి అనుచరులు దాడిచేయడం తగదని బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. దాడికి గురైన వ్యక్తిని అరెస్టు చేసి.. దాడి చేసినవారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయాలని డీజీపీని కేటీఆర్ కోరారు.

మేం తలచుకుంటే కాంగ్రెసోళ్లు బయట తిరగలేరు

- మా పార్టీ ఆఫీసులపై దాడి చేస్తామంటే భయపడం
- 60లక్షల సైనికులున్న పార్టీ బీఆర్ఎస్.. ఖబడ్దార్: కవిత



యాదాద్రి జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల మీదకు, బీఆర్ఎస్ నేతల ఇళ్లపైకి దాడులకు వస్తామంటే భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. "60 లక్షల మంది సైనికులున్న కుటుంబం బీఆర్ఎస్ పార్టీ. మా కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరిగే పరిస్థితి ఉండదు. ఖబడ్దార్." అంటూ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరని స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని బుధవారం ఆమె దర్శించుకొన్నారు. తర్వాత భువనగిరి బైపాస్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రౌడీ మూకలను వేసుకుని పార్టీ కార్యాలయాలపై దాడి చేసే సంస్కృతి తమది కాదన్నారు. మూసీ నది కాలుష్యానికి కారణం కాంగ్రెసే అని ఆమె ఆరోపించారు. మూసీ ప్రాజెక్టును ఆ పార్టీ ఏటీఎంగా మార్చుకుందన్నారు. అంతకుముందు యాదగిరి గుట్ట ఆలయం వద్ద కవిత విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతీ నెలా స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణ చేయడం ఎంతో ముక్తిదాయకమని, తనకు గిరిప్రదక్షిణ చేసే అదృష్టం కలగడం గొప్ప వరమని కవిత అన్నారు. కవిత బుధవారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి గిరిప్రదక్షిణోత్సవంలో పాల్గొని మెట్లదారిన కొండెక్కి స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు.

'గగన్‌యాన్'కు చకచకా!

» ఇస్రో సన్నాహాలు.. షార్ చేరుకున్న ఆర్బిటల్ మాడ్యూల్


గగన్‌యాన్‌లో పంపే మాడ్యూల్

సూళ్లూరుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇస్రో తొలిసారిగా చేపట్టనున్న మానవసహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌కు సన్నాహాలు వేగం పుంజుకున్నాయి. వచ్చే రెండేళ్లలో రోదసిలోకి వ్యోమగాములను పంపి, తిరిగి వారిని సురక్షితంగా భూమిపైకి తెచ్చే లక్ష్యంతో ఇస్రో ఈ మిషన్ చేపట్టింది. ఇందులో భాగంగా ఫిబ్రవరిలో మొదటి మానవరహిత యాత్రకు సన్నద్ధమవుతోంది. హ్యూమన్ రేటెడ్ లాంచ్ వెహికల్ మార్క్-3 (హెచ్‌ఎల్‌వీఎం3)-జీ1 ద్వారా ఇస్రో రూపొందించిన ఆర్బిటల్ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ మాడ్యూల్‌ను బుధవారం ప్రత్యేక వాహనంలో షార్‌కు తెచ్చారు. హెచ్‌ఎల్‌వీఎం3-జీ1 రాకెట్ ద్వారా 8,200 కిలోల బరువైన ఆర్బిటల్ మాడ్యూల్‌ను 170 కిలోమీటర్ల ఎత్తుకు పంపి 430 కిలోమీటర్ల దూరంలో దీర్ఘవృత్తాకార కక్ష్యలో లోయర్ ఎర్త్ అర్బిట్‌లోకి ప్రవేశపెడతారు. 7రోజుల తర్వాత మాడ్యూల్‌ను మళ్లీ భూమిపైకి సురక్షితంగా తీసుకొచ్చే ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ క్రమంలో మిషన్ విఫలమయ్యే పరిస్థితి సంభవిస్తే, వ్యోమగాములు సురక్షితంగా బయటపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్ధారించుకొనేందుకు మానవ రహిత ప్రయోగం ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

యూపీఎస్సీ సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ, జనవరి 22: యూపీఎస్సీ సివిల్స్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. అఖిల భారత సర్వీసుల్లో 23 విభాగాల్లోని 979ఖాళీల భర్తీకి యూపీఎస్సీ బుధవారం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తుల దాఖలుకు ఫిబ్రవరి 11వ తేదీ వరకు అవకాశం కల్పించింది. 21 నుంచి 32ఏళ్ల మధ్య వయసు ఉండి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది మే 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురాలలో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మరోవైపు 150పోస్టులతో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది. అభ్యర్థులు ఫిబ్రవరి 22 సాయంత్రం 6గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలి.

మౌని అమావాస్య రోజు 150 ప్రత్యేక రైళ్లు

మహాకుంభ్ నగర్, జనవరి 22: జనవరి 29న మౌని అమావాస్యను పురస్కరించుకొని మహాకుంభమేళాకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రయాగ్‌రాజ్ రైల్వే డివిజన్ ఆ ఒక్కరోజు కోసమని ప్రత్యేకంగా 150 రైళ్లను నడపనుంది. ప్రయాగ్‌రాజ్ రైల్వే డివిజన్ సీనియర్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అమిత్ మాలవీయ ఈ విషయాన్ని వెల్లడించారు. వీటిలో ఎక్కువ శాతం రైళ్లు ప్రయాగ్‌రాజ్ జంక్షన్ నుంచి కుంభమేళా జరుగుతున్న ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లకు నడుస్తాయని పేర్కొన్నారు. వీటితో పాటు రెగ్యులర్ రైళ్లు కూడా టైం టేబుల్ ప్రకారం నడుస్తాయన్నారు. మౌని అమావాస్య రోజు కుంభమేళాకు 10కోట్ల మంది దాకా వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, మహాకుంభ్‌నగర్‌లో కుంభమేళా కోసం యూపీ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై ఇస్రో ఉపగ్రహ చిత్రాలను విడుదల చేసింది.

మరో ఐదేళ్లపాటు జాతీయ ఆరోగ్య కార్యక్రమం

న్యూఢిల్లీ, జనవరి 22: జాతీయ ఆరోగ్య కార్యక్రమాన్ని(ఎన్‌హెచ్‌ఎమ్) మరో ఐదేళ్లపాటు పొడిగిస్తూ కేంద్ర మంత్రివర్గం బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు కేంద్రమంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి పీయూష్ గోయల్ మీడియాకు వెల్లడించారు. గత పదేళ్లలో ఎన్‌హెచ్‌ఎమ్ చరిత్రాత్మక లక్ష్యాలను చేరుకుందని, 2021-22మధ్య సుమారు 12 లక్షలమంది ఆరోగ్య కార్యకర్తలు ఇందులో చేరారని తెలిపారు. కరోనా మహమ్మారినీ ఈ కార్యక్రమం ద్వారా ఎదుర్కొన్నట్లు చెప్పారు. కాగా ముడి జనపనార కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. క్వింటాలుకు గతంకన్నా 6% (రూ.315 చొప్పున) పెంచింది. 2025-26 మార్కెటింగ్ సీజన్‌కు క్వింటాలుకు రూ.5,650గా ధర నిర్ణయించింది.

ఢిల్లీలో ఆప్ ఓటమి ఖాయం: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 22: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటమి తప్పదని ప్రధాని మోదీ చెప్పారు. అందుకే ఆపద (ఆప్) పార్టీ నేతలు పూటకో కొత్త హామీ ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ కార్యకర్తలతో మోదీ ఆన్‌లైన్ ద్వారా సంభాషించారు. 50శాతానికిపైగా ఓట్లు పడేలా బీజేపీ నేతలు, బూత్ కార్యకర్తలు లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఆయన సూచించారు. నిత్యావసరాలు, కనీస అవసరాలు అందక ఢిల్లీ ప్రజలు కష్టాలు పడుతుంటే కేజ్రీవాల్ శీశ్‌మహల్ వంటి భవనం కట్టుకున్నారని మోదీ ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీని అభివృద్ధి చెందిన రాజధాని నగరంగా తీర్చిదిద్దుతామని ప్రధాని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌లపై చెరి రూ.50 కోట్ల మేర పరువు నష్టం దావా వేయబోతున్నట్లు బీజేపీ ఎంపీ పర్వేశ్ వర్మ ప్రకటించారు. పంజాబీలు దేశానికి ప్రమాదకరంగా మారారని తాను అన్నట్లుగా దుష్ప్రచారం చేస్తున్నందుకే ఈ దావా వేస్తున్నట్లు తెలిపారు.

త్వరలో కేంద్రం పరిధిలోకి సైఫ్ పూర్వీకుల ఆస్తులు!

న్యూఢిల్లీ, జనవరి 22: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పటౌడీ కుటుంబానికి పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులు త్వరలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే అవకాశమంది. ఈ ఆస్తుల విలువ దాదాపు రూ.15 వేల కోట్లు ఉంటుందని అంచనా. వీటిలో చాలా వరకు మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఉన్నాయి. శత్రువుల ఆస్తి చట్టం-1968 ప్రకారం 1947లో జరిగిన దేశ విభజన తర్వాత పాకిస్థాన్‌కు వలస వెళ్లిన వారి ఆస్తులను కేంద్రం స్వాధీనం చేసుకోవచ్చు. రాజ కుటుంబానికి చెందిన సైఫ్ అలీఖాన్ నానమ్మ సాజిదా సుల్తాన్ (భోపాల్ చివరి నవాబ్ హమీదుల్లా ఖాన్ కుమార్తె) సోదరి అబీదా సుల్తాన్ 1950లో పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. అబీదాకు చెందిన ఆస్తులు ఆమె సోదరి సాజిదా సుల్తాన్‌కు సంక్రమించాయి. ఆ తర్వాత వారసత్వంగా మన్సూర్ అలీఖాన్ పటౌడీ (సైఫ్ అలీఖాన్ తండ్రి) కుటుంబ సభ్యులకు చెందాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఆస్తులనే శత్రువుల ఆస్తి చట్టం కింద ప్రకటించింది. 2015లో సైఫ్ కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతో స్టే విధించింది. కాగా గతేడాది డిసెంబరు 13న మధ్యప్రదేశ్ హైకోర్టు ఈ ఆస్తులపై స్టే ఆర్డర్ ఎత్తివేసింది. ఈ కేసులో సైఫ్ కుటుంబ సభ్యులు అప్పీలు చేసుకోవడానికి 30 రోజులు గడువు ఇచ్చింది. ఈ గడువు ఇప్పటికే ముగిసింది. అయితే సైఫ్ కుటుంబ సభ్యులు అప్పీలు చేశారా లేదా అన్నది తెలియరాలేదు. ఇదిలా ఉండగా, కత్తిపోట్లతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న తనను వేగంగా ఆస్పత్రికి తీసుకువెళ్లి కాపాడిన ఆటో డ్రైవర్ భజన్ సింగ్ రాణాకు నటుడు సైఫ్ అలీఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. రూ.50వేల నగదు ఇచ్చారు. భజన్‌సింగ్‌కు భవిష్యత్తులో ఏసాయం కావాలన్నా చేస్తానని హామీ ఇచ్చారు.

'బేటీ బచావో-బేటీ పడావో'కు పదేళ్లు

న్యూఢిల్లీ, జనవరి 22: దేశవ్యాప్తంగా బాలికా విద్యను ప్రోత్సహించడంతో పాటు లింగ వివక్షను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమానికి బుధవారంతో పదేళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "బాలికల అభ్యున్నతి కోసం చేపట్టిన ఈ ఉద్యమం పదేళ్లకు చేరింది. దీనిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. జిల్లాల స్థాయిలో ఒకప్పుడు బాలికల శాతం తక్కువగా ఉండేదని.. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం ద్వారా కల్పించిన అవగాహనతో ఇప్పుడు వీరి శాతం మెరుగుపడిందని, లింగ వివక్ష తగ్గుతోందని తెలిపారు. కాగా, బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని 2015, జనవని 22న ప్రధాని మోదీ హరియాణాలోని పానిపట్‌లో ప్రారంభించారు.

అరటి బోదెలతో పర్యావరణ హిత శానిటరీ ప్యాడ్

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు నెలసరి సమయంలో వినియోగించే శానిటరీ ప్యాడ్‌ల వ్యర్థాల సమస్యకు సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) చెక్ పెట్టింది. ఆకార్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో కలిసి.. అరటి బోదెలతో పర్యావరణ హిత శానిటరీ ప్యాడ్‌లను రూపొందించింది. ఈ ఉత్పత్తికి పేటెంట్ లభించింది. 'ఆనంది' పేరుతో వీటిని తయారు చేశారు. ప్రస్తుతం శానిటరీ ప్యాడ్స్ తయారీలో పైన్‌వుడ్‌ను ఎక్కువగా వాడుతున్నారని, అరటి బోదెలతో తయారు చేసిన ఈ ప్యాడ్స్ త్వరగా భూమిలో కలిసిపోతాయని ఆకార్ ఇన్నోవేషన్స్ సంస్థ తెలిపింది.

జన్మతః పౌరసత్వ హక్కు రద్దు ఉత్తర్వుపై

22 రాష్ట్రాలు కోర్టుకు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. వారి మాటలను నిజం చేస్తూ అమెరికాలోని 22 రాష్ట్రాల అటార్నీ జనరల్లు రెండు కోర్టుల్లో వ్యాజ్యాలు వేశారు. జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ ఉత్తర్వును ఇవ్వడం ద్వారా.. ప్రెసిడెంట్ తనకున్న అధికారాలను మీరారని, అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని ఆ వ్యాజ్యాల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వును అనుమతిస్తే.. ఏటా అమెరికాలో జన్మించే దాదాపు 1.5 లక్షల మంది వలసదారుల పిల్లలు పుట్టుకతో పౌరసత్వ హక్కును కోల్పోతారని ఆందోళన వెలిబుచ్చారు. అధ్యక్షుడికి ఎన్ని విస్తృత అధికారాలు ఉన్నప్పటికీ.. ఆయన రాజు కాదని, ఇష్టానుసారంగా చట్టాలను మార్చేయలేరని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఒక్క సంతకంతో అధ్యక్షుడు 14వ రాజ్యాంగ సవరణ ఉనికినే లేకుండా చేయలేరు" అని న్యూజెర్సీ అటార్నీ జనరల్ మాట్ ప్లాట్‌కిన్ స్పష్టంచేయగా.. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను లాగేసుకునే అధికారం ప్రెసిడెంట్ ట్రంప్‌కు ఎంతమాత్రం లేదని మసాచుసెట్స్ అటార్నీ జనరల్ ఆండ్రియా జాయ్ క్యాంప్‌బెల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, జన్మతః పౌరసత్వ హక్కు ద్వారానే అమెరికా పౌరసత్వం పొంది, అక్కడే పెరిగి, అమెరికాలో తొలి చైనీస్-అమెరికన్ అటార్నీ జనరల్‌గా ఎన్నికైన కనెక్టికట్ అటార్నీజనరల్ విలియం టాంగ్ అయితే.. దీన్ని తన వ్యక్తిగత వ్యాజ్యంగా పరిగణిస్తానని పేర్కొన్నారు. డెమొక్రాట్ పాలిత రాష్ట్రాలతోపాటు.. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ వంటి సంస్థలు, వలసదారులకు సంబంధించిన సంస్థలు, మార్చి నెలలో ఒక బిడ్డకు జన్మనివ్వబోతున్న తల్లి సైతం ఈ ఉత్తర్వుపై కోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలు చేయడం గమనార్హం. అమెరికా ప్రజాప్రతినిధుల సభ సభ్యులు, భారత సంతతికి చెందిన ఆర్‌వో ఖన్నా, శ్రీతానేదార్, ప్రమీలా జయపాల్ కూడా ట్రంప్ ఉత్తర్వులను ఖండించారు. వైట్‌హౌస్ వర్గాలు మాత్రం.. ఈ కేసులను వామపక్షవాదుల ప్రతిఘటనకు పొడిగింపుగానే చూస్తామని, ఆయా రాష్ట్రాలను కోర్టుల్లోనే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించాయి. "ఏటికి ఎదురీది, ప్రజల కోరికను తిరస్కరించడమా లేక అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి ముందుకు సాగడమా.. ఈ రెండింటిలో ఏదో ఒకదాన్ని తీవ్ర భావజాలం ఉన్న వామపక్షవాదులు ఎంచుకోవచ్చు" అని వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ హారిసన్ వ్యాఖ్యానించారు.



రష్యాపై ఆంక్షలు తప్పవు : ట్రంప్

ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపే అంశంలో చర్చలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రాకుంటే ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్ ఆక్రమణకు పాల్పడుతుండడంతో రష్యాపై అమెరికా ఇప్పటికే కొన్ని ఆంక్షలను అమలు చేస్తోంది. కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాట్లాడుతున్నామని, పుతిన్‌తోనూ త్వరలోనే మాట్లాడతామని ట్రంప్ విలేకరులకు వెల్లడించారు. అలాగే, ఉక్రెయిన్‌కు ఆయుధాలు పంపే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు, ఇక, ఉక్రెయిన్‌పై పోరును ఆపేందుకు రష్యాను ఒప్పించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఫోన్ కాల్ ద్వారా కోరానని ట్రంప్ తెలియజేశారు. కాగా, ఎల్‌జీబీటీలు, వలసదారులు నేరస్థులు కాదని, వాళ్లపై దయ చూపాలని వాషింగ్టన్ నేషనల్ కేథడ్రల్(చర్చి) బిషప్ మరియన్ ఎడ్గార్ బుడ్డే ట్రంప్‌ను కోరారు. దేశంలో ఇక స్త్రీ, పురుష లింగాలు మాత్రమే ఉంటాయని ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో ఆమె ఈ వినతి చేశారు.

అమెరికాలో డీఈఐ సిబ్బంది ఇంటికి!

వాషింగ్టన్, జనవరి 22: డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 'డైవర్సిటీ, ఈక్విటీ అండ్ ఇంక్లూజన్ (వైవిధ్యం, సమానత్వం, కలుపుకొనిపోయే తత్వం - డీఈఐ)' సిబ్బందిని సాగనంపేందుకు సిద్ధమయ్యారు. డీఈఐ సిబ్బంది అందరినీ సెలవులో ఉంచాలని ఆదేశిస్తూ ట్రంప్ కార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసింది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డీఈఐ కార్యక్రమాలను నిర్వీర్యం చేస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశాలపై సంతకం చేశారు. డీఈఐ సిబ్బంది అందరినీ బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా (అమెరికా కాలమానం ప్రకారం) వేతనంతో కూడిన సెలవుపై పంపించాలని సంబంధిత ఏజెన్సీలకు ఆదేశాలు అందాయి. అనంతరం వారిని శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించనున్నారు.

అమెరికాలోకి సమర్థులు రావడం అవసరం

» హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌తోనే ఇది సాధ్యం: ట్రంప్

వాషింగ్టన్, జనవరి 22: దేశానికి సమర్థులు, గొప్ప వ్యక్తులు అవసరమని, అది హెచ్-1బీ వీసా ద్వారానే సాధ్యపడుతుందని ట్రంప్ అన్నారు. హెచ్-1బీ వీసాల అంశంపై తన మద్దతుదారుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. ఒరాకిల్ సీఈవో లారీ ఎల్లిసన్, సాఫ్ట్‌బ్యాంక్ సీఈవో మసయోషి సన్, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌తో కలసి మంగళవారం ఆయన వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. "ఈ అంశంపై రెండు వైపుల వాదనలూ నాకు నచ్చాయి. సమర్థులైన వ్యక్తులు దేశంలోకి రావడాన్ని కూడా నేను ఇష్టపడతాను. ఇంజనీర్ల గురించి మాత్రమే కాదు... నేను అన్ని స్థాయుల వ్యక్తుల గురించి మాట్లాడుతున్నా' అని ట్రంప్ పేర్కొన్నారు. 'వ్యాపారాలు విస్తరించుకోవడానికి సమర్థులైన, నైపుణ్యం కలిగిన వ్యక్తులు మన దేశంలోకి రావాలని కోరుకుంటున్నాం. నిజంగా సమర్థులైన, గొప్ప వ్యక్తులను మన దేశంలోకి రానివ్వాలి' అని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

పనామా కాలువ అమెరికా ఇచ్చిన బహుమతి కాదు : పనామా అధ్యక్షుడు ములినో

పనామా కాలువను వెనక్కి తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తీవ్రంగా స్పందించారు. పనామా కాలువ తమకు అమెరికా ఇచ్చిన బహుమతేం కాదని ఘాటుగా బదులిచ్చారు. పనామా కాలువలో చైనా కార్యకలాపాలు అధికమయ్యాయని, కాలువ చైనా అధీనంలో ఉందని, తాము పనామాకు ఇచ్చిన ఆ కాలువను వెనక్కి తీసుకుంటామని ట్రంప్ ఇటీవల పలుమార్లు ఆరోపించారు. అధ్యక్షుడిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా పనామా కాలువ అంశంపై మాట్లాడారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఉన్న ములినో... అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలకు స్పందించారు. పనామా కాలువను అమెరికా తమకు బహుమతిగా ఇవ్వలేదని, కాలువ చైనా అధీనంలో లేదని తేల్చిచెప్పారు.

లోకం తీరు



ట్రంప్ సుంకాలు విధిస్తే భయపడం, ఊరుకోం: ట్రుడో

కెనడా నుంచి దిగుమతయ్యే వస్తువులపై ఫిబ్రవరి 1 నుంచి 25 శాతం సుంకాన్ని వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కెనడా అధ్యక్షుడు జస్టిన్ ట్రుడో దీటుగా స్పందించారు. ట్రంప్ సుంకాలు విధించినంత మాత్రానా భయపడమని, తామేంటో ఆయనకు చూపిస్తామని, కెనడా పౌరుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. అలాగే, కెనడా నుంచి అమెరికాలోకి చొరబాట్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, ఫెంటనిల్ రవాణా జరుగుతోందని ట్రంప్ చేసిన ఆరోపణలపైనా ట్రుడో స్పందించారు. సరిహద్దులో భద్రత పెంపు అంశంపై చర్చలు జరిపేందుకు కెనడా ఎప్పుడూ సిద్ధమేనని తెలిపారు. ఇక, కెనడాలోని సహజ వనరులను వినియోగించుకోకుండా అమెరికా బలమైన ఆర్థిక శక్తిగా నిలబడలేదనే విషయాన్ని ట్రంప్ మరచిపోకూడదని వ్యాఖ్యానించారు.

జాతి ప్రయోజనాలే మాకు ముఖ్యం : చైనా

చైనా నుంచి జరిగే దిగుమతులపై 10 శాతం సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై చైనా కూడా స్పందించింది. వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరని తమ విశ్వాసమని, జాతి ప్రయోజనాలు కాపాడుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు. ఫెంటనిల్ అనే డ్రగ్ చైనా నుంచి కెనడా, మెక్సికో మీదుగా అమెరికాలోకి వస్తుందని, సుంకాలు విధించడమే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. కాగా, ఫెంటనిల్ రవాణా చేస్తూ పట్టుబడిన వారికి మరణశిక్ష విధించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వద్ద ట్రంప్ ఇటీవల ప్రస్తావించారు.

టెన్షన్ టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల్లో ప్రతి 10 మందిలో తొమ్మిది మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారట! 25 ఏళ్లలోపు ఉద్యోగుల్లో 90శాతం మంది, 45 ఏళ్లలోపు ఉద్యోగుల్లో 67శాతం ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్నారని ఈ సంస్థ పేర్కొంది. యువ ఉద్యోగులకు నిర్మాణాత్మకమైన మద్దతు అవసరమని స్పష్టం చేసింది. నిరుడు జనవరి నుంచి నవంబరు దాకా పనిచేసే చోట ఉద్యోగులు మానసికంగా ఎదుర్కొంటున్న సవాళ్ల మీద 'వన్ టు వన్' సంస్థ 83వేల కౌన్సెలింగ్ సెషన్లు, 12వేల సెలెక్టివ్ స్క్రీమింగ్స్, 42వేల అంచనాలను రూపొందించింది. ఉద్యోగుల్లో 59శాతం మందిలో తమకు తాము హాని చేసుకునే లక్షణాలను గుర్తించిన మేనేజర్లు, సహాయం కోసం రిఫర్ చేసినట్లు వన్ టు వన్ నివేదిక వెల్లడిచించింది. ఉద్యోగుల కుటుంబీకుల్లో చాలా మంది తీవ్ర ఒత్తిడితో బాధపడుతూ ఆత్మహత్య గురించి ఆలోచిస్తున్నారని నివేదిక పేర్కొంది. ఉద్యోగుల్లో 45ఏళ్లలోపు వారికన్నా 30 ఏళ్లలోపు వారు తీవ్ర డిప్రెషన్, ఆందోళనతో బాధపడుతున్నట్లు వెల్లడించింది.



ఐదేళ్లలో కేజ్రీవాల్ ఒక్క రోజే అసెంబ్లీకి..

న్యూఢిల్లీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ గత ఐదేళ్లలో ఒక్క రోజు మాత్రమే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తాజా నివేదిక వెల్లడించింది. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన సిసోడియా, సత్యేందర్ జైన్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గెహ్లోత్, శాసనసభ స్పీకర్ రామ్‌నివాస్ గోయెల్, డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లా కూడా ఒక్క రోజు మాత్రమే ఢిల్లీ శాసనసభ సమావేశాలకు హాజరయ్యారని తెలిపింది. ఢిల్లీ శాసనసభ వెబ్‌సైటులో అందుబాటులో ఉన్న సమాచారం, ఢిల్లీ అసెంబ్లీ సెక్రటేరియేట్ నుంచి వచ్చిన ఆర్టీఐ సమాధానాల ఆధారంగా ఏడీఆర్ ఈ నివేదికను రూపొందించింది. 2020 ఫిబ్రవరిలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి డిసెంబరు 2024 వరకు ఢిల్లీ శాసనసభ గత ఐదేళ్లలో సగటున ఏటా 15 రోజులు సమావేశమైందని, మొత్తంగా 74 రోజుల పాటు శాసనసభ సమావేశాలు జరిగాయని పేర్కొంది. ప్రస్తుత ముఖ్యమంత్రి అతీశీ 31 రోజులు శాసనసభ సమావేశాలకు హాజరయ్యారని తెలిపింది. కాగా, ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మధ్యతరగతి మేనిఫెస్టో అంటూ ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ 7డిమాండ్లను లేవనెత్తారు. పన్ను ఉగ్రవాదానికి మధ్యతరగతి ప్రజలు బాధితులుగా మారారని ఆయన చెప్పారు. విద్య బడ్జెట్‌ను 2 నుంచి పది శాతానికి పెంచాలని, జీడీపీలో పది శాతం ఆరోగ్యరంగానికి కేటాయించాలని కేంద్రాన్ని కోరారు.

నెత్తురోడిన రైలు పట్టాలు.. 12 మంది దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)


ప్రమాదం జరిగిన స్థలంలో రైలు ప్రయాణికులు

సుమారు 50 మంది ప్రయాణికులు రైలులోంచి కిందకు దిగారు. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ సరిగ్గా ఓ భారీ కల్వర్టు వద్ద ఆగడంతో.. ఒకవైపు సేఫ్టీవాల్, లోయను తలపించే కాలువ.. మరోవైపు రెండో ట్రాక్ ఉన్నాయి. దీంతో.. ప్రయాణికులు ట్రాక్ ఉన్న వైపు దిగి.. నిప్పురవ్వలు వచ్చిన ప్రాంతాన్ని పర్యవేక్షిస్తూ.. అక్కడే నిలబడ్డారు. అంతలో మృత్యుశకటంగా కర్ణాటక ఎక్స్‌ప్రెస్ వారు నిలబడ్డ ట్రాక్ వైపు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో దూసుకువచ్చింది. ప్రయాణికులు తేరుకుని, పక్కకు తప్పుకొనేలోపే.. ట్రాక్‌పై ఉన్నవారిని ఢీకొంటూ.. వారిని కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో పదేళ్ల వయసున్న ఓ బాలుడితోపాటు.. ముగ్గురు మహిళలున్నారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. మిగతావారు జరిగిన దారుణాన్ని అర్థం చేసుకునేలోపు.. మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. పలు మృతదేహాల చేతులు, కాళ్లు తెగి.. రక్తపు ముద్దలు ట్రాక్‌పై దర్శనమిస్తూ.. బీభత్సమైన దృశ్యాలు కనిపించాయి. పోలీసులు కూడా తొలుత 11 మంది మృతిచెందారని భావించారు. అయితే.. ఆస్పత్రిలో శరీర భాగాలను మృతదేహాల వారీగా జతచేయగా.. 12 మంది చనిపోయినట్లు తేలిందని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి వివరించారు. సంఘటనాస్థలిని జల్గావ్ ఎంపీ స్మితావాఘ్, జిల్లా కలెక్టర్ ఆయుష్ ప్రసాద్, ఐజీ దత్తాత్రేయ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. అగ్నిప్రమాదమేమీ జరగలేదని, కేవలం వదంతులతోనే దారుణం జరిగిందన్నారు. ఈ ఘటనపై మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు.

32 ఏళ్ల క్రితం 49 మంది మృతి

జాల్గావ్ ఘటనతో 32 ఏళ్ల క్రితం ముంబైలో మహిళా లోకల్ రైలు విషాద ఘటనను స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. 1993లో ఆ రైలు కందవల్లి రైల్వేస్టేషన్ దగ్గరకు రాగానే..అగ్నిప్రమాదం జరిగిందనే వదంతులు వచ్చాయి. దాంతో 50-60 మంది మహిళలు వేగంగా కదులుతున్న రైలులోంచి రెండో ట్రాక్‌పై దూకారు. అటుగా వచ్చిన మరో రైలు ఢీకొనడంతో 49 మంది మహిళలు చనిపోయారు.

గాజా మళ్లీ కోలుకుంటుందా?

ఎటు చూసినా యుద్ధఛాయలే.. కుప్పకూలిన భవంతులు, ధ్వంసమైన రోడ్లు

» శిథిలాలను తొలగించాలంటేనే 1.2 బిలియన్ డాలర్ల ఖర్చు

» గాజా అభివృద్ధి 69 ఏళ్లు వెనక్కి: ఐరాస


గాజాలో ఇజ్రాయెల్ దాడులతో నేలమట్టమై మట్టి కుప్పలుగా మిగిలిపోయిన భవనాలు

న్యూఢిల్లీ, జనవరి 22: గాజాలో ఎటు చూసినా విధ్వంస ఛాయలే. కుప్పలుగా పేరుకుపోయిన శిథిలాలు, కూలిపోయిన లక్షల భవంతులు, ధ్వంసమైన రోడ్లు అక్కడ దర్శనం ఇస్తున్నాయి. ఈ ప్రాంతం పునర్నిర్మాణం సాధ్యమేనా? ఎంత సమయం పడుతుంది? ఎంత ఖర్చు అవుతుంది.? కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ప్రశ్నలు ఇప్పుడు ఉదయిస్తున్నాయి. గాజా కోలుకోవాలంటే దశాబ్దాల కాలం పడుతుందని ఐక్యరాజ్యసమితి తాజాగా తేల్చి చెప్పింది. దిగ్బంధనాలు కొనసాగితే.. యుద్ధానికి ముందు ఆర్థిక పరిస్థితికి చేరడానికి గాజాకు కనీసం 350 ఏళ్లు పడుతుందని ఐరాస అంచనా వేసింది. తాజాగా వేసిన అంచనాల ప్రకారం 10 శాతం ఆర్థిక వృద్ధి ఉంటుందని భావిస్తే.. 2050 నాటికి గత పరిస్థితికి గాజా చేరుకుంటుందని పేర్కొంది. అది కూడా మిలటరీ చర్యలు లేకుండా, సరుకుల రవాణా స్వేచ్ఛగా జరిగి, పెట్టుబడులు వచ్చి, ఏటా 2.8%జనాభా పెరుగుదల ఉన్నపుడు మాత్రమే సాధ్యమని అభిప్రాయపడింది.

శిథిలాల తొలగింపునకు 21 ఏళ్లు..

ఇక్కడి భవన శిథిలాల తొలగింపుపై ఇటీవల ఐరాస ఒక అంచనా వేసింది. యుద్ధం కారణంగా పేరుకుపోయిన 50 మిలియన్ టన్నుల భవనాల శిథిలాల తొలగింపునకు కనీసం 21 ఏళ్లు పడుతుందని, 1.2 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని లెక్కగట్టింది. హింస కారణంగా గాజా అభివృద్ధి 69 ఏళ్లు వెనక్కి పోయిందని ఐరాస అభివృద్ధి కార్యక్రమం అధికారి ఒకరు చెప్పారు. 2023 అక్టోబరు 7న హమాస్ టెర్రరిస్టులు ఇజ్రాయెల్‌పై దాడితో గాజాలో యుద్ధం మొదలైన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ లెక్కల ప్రకారం హమాస్ దాడుల్లో 1,200 మంది ఇజ్రాయెలీలు కన్నుమూశారు. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం ఆ ప్రాంత పౌరులు 46 వేల మంది చనిపోయారు.

ఇళ్ల నిర్మాణం ఇప్పట్లో సాధ్యపడదు..

కూలిపోయిన ఇళ్ల పునర్నిర్మాణం ఇప్పట్లో సాధ్యపడదని గతేడాదే ఐరాస వెల్లడించింది. గత డిసెంబరులో యూఎన్ శాటిలైట్ డేటా ప్రకారం యుద్ధానికి ముందు ఉన్న భవనాల్లోని మూడింట రెండువంతులు.. అంటే 1.70 లక్షలకు పైగా ధ్వంసమయ్యాయి లేదా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం 18 లక్షల మంది ప్రజలకు వెంటనే ఆవాసాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఐరాస మానవతా సంస్థ అంచనాల ప్రకారం కనీసం 68 శాతం రోడ్డు నెట్‌వర్క్ నాశనమైంది. 75 శాతం పైగా నీటి పంపిణీ వ్యవస్థ దెబ్బతింది. ఇక శరణార్థులు ఎక్కువగా నివసించే ఉత్తర గాజాలోని జబాలియా పట్టణం మొత్తం శిథిలాల కుప్పగా మారిపోయింది. ఇజ్రాయెల్ దాడులతో గాజాలో సగానికి పైగా వ్యవసాయ భూమి ధ్వంసమైంది. 95 శాతానికి పైగా పశువులు, గొర్రెలు మృత్యువాత పడ్డాయి.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- 40 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తాం: మంత్రి ఉత్తమ్
- ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి: మంత్రి పొన్నం



తిమ్మాపూర్ (మానకొండూర్) గంగాధర/సిరిసిల్ల, జగిత్యాల, హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గతంలో మీసేవ, ప్రజావాణి సర్వేలలో సమర్పించిన దరఖాస్తులన్నీ పరిశీలించి అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులను జారీ చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని హామీ ఇచ్చారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి, కరీంనగర్ జిల్లా రేణికుంట, నారాయణపూర్, జగిత్యాల జిల్లా జైనాలో జరిగిన గ్రామసభలలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 2014లో రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల రేషన్ కార్డులుంటే గత పది సంవత్సరాల్లో కేవలం 40 వేల మందికి మాత్రమే అవి ఇచ్చారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు లేకుంటే అదే సభలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరికి రేషన్ కార్డులు అందిన తర్వాత ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షం సూచనలు, సలహాలు ఇవ్వకుండా రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు.

యాసంగికి ఎరువుల పంపిణీలో జాగ్రత్త!

- గోదాములను అధునాతన పద్ధతులతో నిర్మించండి: తుమ్మల



హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ పరిధిలో నిర్మించే గోదాములను అధునాతన సాంకేతిక పద్ధతులతో నిర్మించాలని సూచించారు. బుధవారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ, ఎరువుల సరఫరాపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగును దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అధునాతన సాంకేతిక పద్ధతులతో గోదాములను నిర్మించి, ఆహార ధాన్యాల నిల్వలో సాంకేతిక పద్ధతులను పాటిస్తే వాటి నాణ్యత దెబ్బతినదని మంత్రి అన్నారు.

ఇంటింటి సర్వేతో లబ్ధిదారులను గుర్తించాం

- ఫామ్ హౌస్‌లో కూర్చొని ఎంపిక చేయలేదు: సీతక్క

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారులను ప్రజాస్వామ్యబద్ధంగా గుర్తిస్తుంటే బీఆర్ఎస్ రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం మీడియా ప్రతినిధులతో ఆమె చిట్‌చాట్‌గా మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల ఇళ్లలో, ఫామ్ హౌస్‌ల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగిందన్నారు. తాము వాళ్లలాగా అర్హులకు అన్యాయం చేయకుండా.. ఇంటింటి సర్వే చేపట్టి లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని వచ్చాక బీసీ కమిషన్ నివేదికకు ఆమోదం లభించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. కాగా, బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మహిళా, శిశు సంక్షేమశాఖ ఉద్యోగ సంఘం క్యాలెండర్‌తో పాటు తెలంగాణ దివ్యాంగ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ప్రజాపాలన లక్ష్యాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులదేనని అన్నారు.

ఎవరింట్లో కేటీఆర్ మీటింగ్ పెట్టాడో..

ఆ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లో చేరతాడు: శ్రీగణేశ్

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. మంగళవారం ఎవరి ఇంట్లోనైతే సమావేశం పెట్టారో.. ఆ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాడని కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిస్తే బీఆర్ఎస్ పార్టీలో ఒక్క ఎమ్మెల్యే కూడా ఉండబోడన్నారు. జీహెచ్ఎంసీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టే అంశంపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో మంగళవారం కేటీఆర్ సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. సీఎల్పీ మీడియా హాల్లో బుధవారం మీడియా సమావేశంలో శ్రీగణేశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారన్న భయం కేటీఆర్‌కు పట్టుకుందని, అందుకే ఆయన హడావుడి చేస్తున్నారన్నారు.

కల్లుగీత కార్పొరేషన్‌కు 500కోట్లు ఇవ్వాలిలి

- గీత పనివారల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కల్లుగీత వృత్తి దారులకు రూ.4వేల పింఛన్ అందించాలని, మెడికల్ బోర్డు విధానాన్ని రద్దు చేయాలని కోరారు. బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ పథకాల్లో గీత కార్మికులను చేర్చాలని, ట్యాంక్‌బండ్‌పై బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

తిరుపతి తొక్కిసలాటపై న్యాయవిచారణ కమిషన్

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించిన ఘటనపై రాష్ట్రప్రభుత్వం న్యాయ విచారణకు ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయ విచారణ కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలను ప్రభుత్వం కట్టబెట్టింది.బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

తిరుమలలో శారదాపీఠం భవనం

కూల్చివేతకు ఆదేశాలిస్తాం!: ఏపీ హైకోర్టు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అనుమతులకు విరుద్ధంగా తిరుమల గోగర్భం డ్యామ్ ప్రాంతంలో విశాఖ శారదాపీఠం నిర్మిస్తున్న భవనం కూల్చివేతకు ఆదేశాలిస్తామని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. బిల్డింగ్ ప్లాన్, అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు ఎలా చేపడతారని నిలదీసింది. అనుమతులు లేకుండా జరిపిన నిర్మాణాలను ఉపేక్షించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిపితే ఏం జరుగుతుందో తెలియజేసేందుకు ఈ కేసు ఒక ఉదాహరణ కావాలని పేర్కొంది. నిర్మాణాలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. తిరుమల గోగర్భం డ్యామ్ ప్రాంతంలో శారదాపీఠం అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ టీటీడీ చర్యలు తీసుకోవడంలేదంటూ తుమ్మా ఓంకార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. గతంలో ఈ పిల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. పనులను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. బుధవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా.. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు ఎలా చేస్తారని ప్రశ్నించింది. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలు ఇస్తామంది. అయితే, కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని శారదా పీఠం తరఫు న్యాయవాది భాస్కరరావు అభ్యర్థించగా.. ధర్మాసనం అంగీకరించింది. విచారణను వాయిదా వేసింది.

సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వక పోటీ

- హైదరాబాద్, యువత.. తెలంగాణ బలం
- ప్రపంచంతో పోటీ మా లక్ష్యం: రేవంత్

దావోస్, జనవరి 22: సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వక వాతావరణం కొనసాగిస్తూ అభివృద్ధి విషయంలో ప్రపంచంతో పోటీ పడాలన్నదే తెలంగాణ ఆకాంక్ష అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో బుధవారం 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఒకే వేదిక పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. సరిహద్దు రాష్ట్రాలతో కలిసి అభివృద్ధి సాధించడమే తమ మొదటి ప్రాధాన్యతని చెప్పారు. హైదరాబాద్ రాజధానిగా తెలంగాణ ప్రపంచంతోనే పోటీ పడుతోందని, న్యూయార్క్, టోక్యో లాంటి నగరాల స్థాయికి అభివృద్ధి చెందాలనేదే తమ లక్ష్యమన్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా చంద్రబాబు నాయుడు, వైఎస్.రాజశేఖర రెడ్డి రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన తీరు అసాధారణమని రేవంత్ కొనియాడారు. తెలంగాణ ప్రస్తుతం ప్రపంచ స్థాయి నగరాలతో, టోక్యో, సింగపూర్ వంటి నగరాలతో పోటీపడుతోందన్నారు. దేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలన్న భారత ప్రధానమంత్రి లక్ష్యసాధనలో తెలంగాణ భాగస్వామ్యమవుతోందని చెప్పారు. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు పోతోందన్నారు. తెలంగాణ మూడు ప్రాంతాలుగా అభివృద్ధి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఓఆర్ఆర్ లోపల అర్బన్ ప్రాంతంలో ఐటీ, ఫార్మా రంగాలున్నాయని, రెండోభాగం ఓఆర్ఆర్‌నుంచి 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే 65% తెలంగాణ నగర ప్రాంతంగా మారుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి పట్టణీకరణ కీలకమని, తెలంగాణ సరిహద్దు వరకు గ్రామీణ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీ, ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులు, మాంసం, కోళ్ల చేపల ఎగుమతి పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచం ఎలా పురోగమిస్తుందో తెలుసుకోవడానికి దావోస్ పర్యటన ఉపయోగపడిందని, అదే సమయంలో తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర యువత తమకున్న పెద్ద బలమని చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, అభివృద్ధి విషయంలో తమ విధానాలు సుస్థిరంగా ఉంటాయని రేవంత్ తెలిపారు.

టీమ్ ఇండియా ఎట్ ప్రపంచ ఆర్థిక వేదిక

ఏపీకి పెట్టుబడులను ఆకర్షించేందుకు దావోస్ వెళ్లిన సీఎం చంద్రబాబును వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వేదిక వద్ద మహారాష్ట్ర, తెలంగాణ సీఎంలు ఫడణవీస్, రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ముగ్గురూ పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకున్నారు. పెట్టుబడులు రాబట్టేందుకు ముఖ్యమంత్రులుగా పోటీ పడుతున్న ముగ్గురు నేతలూ కలుసుకున్న అరుదైన దృశ్యాన్ని ఫొటోగ్రాఫర్ 'క్లిక్'మనిపించారు. ఈ చిత్రం చంద్రబాబుకు బాగా నచ్చింది. వెంటనే దానికి 'టీమ్ ఇండియా ఎట్ ప్రపంచ ఆర్థిక వేదిక' అనే శీర్షిక పెట్టి 'ఎక్స్'లో విడుదల చేశారు.

₹56300 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)



సీఎం రేవంత్ సమక్షంలో ఒప్పందం చేసుకుంటున్న సన్ పెట్రోకెమికల్స్ ఎండి దిలీప్ సాంఘ్వీ

సామర్థ్యం 3400 మెగావాట్లు. వీటికి 5440 మెగావాట్ల సామర్థ్యం ఉండే సౌర విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని కంపెనీ తెలిపింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం నుంచి ఇప్పటివరకు దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే కావడం విశేషం. కాగా.. సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించాలన్న తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ఈ ఒక్క ఒప్పందంతో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం.. నిరుడు దావోస్‌లో సాధించిన రూ.40 వేల కోట్ల పెట్టుబడుల రికార్డును సమం చేసిందన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాల దృష్ట్యా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. ఈ ఒప్పందంతో రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు రావడంతోపాటు నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా వృద్ధి చెందుతాయన్నారు.

400 మెగావాట్ల సామర్థ్యంతో..

తెలంగాణలో రూ.10 కోట్ల పెట్టుబడితో కృత్రిమ మేధ డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు.. కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతామని ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్‌తో దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ ఏర్పాటు మరో మైలురాయిగా నిలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ ఒప్పందంతో ఐటీ సేవల సామర్థ్యం పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణలో ఐటీ సేవల ప్రమాణాలు మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి అన్నారు. అమెరికా కేంద్రంగా రక్షణ రంగంలో వివిధ ఉత్పత్తులు తయారుచేసే ప్రముఖ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ.. రాష్ట్రంలో రూ. 800 కోట్ల పెట్టుబడులు పెడతామని.. అధునాతన అన్‌మాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ (యూఏవీ) తయారీ యూనిట్ ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. అలాగే చెన్నైలో ప్రారంభమై ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన దిగ్గజ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్.. హైదరాబాద్‌లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సి.విజయకుమార్‌తో సీఎం రేవంత్ చర్చల అనంతరం కంపెనీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా అత్యాధునిక క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లకు సంబంధించి కొత్త సెంటర్ ఏర్పాటు చేయనుంది. హైటెక్ సిటీలో 3.2 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటుచేస్తామని, దీంతో దాదాపు 5వేల మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయని కంపెనీ తెలిపింది. కాగా.. ప్రపంచస్థాయి వసతులతో కొత్త కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామని సీఈవో విజయ్ కుమార్ తెలిపారు. తాజా నిర్ణయంతో నగరంలో హెచ్‌సీఎల్ కేంద్రాల సంఖ్య ఐదుకు పెరగనుంది.

తెలంగాణలో డ్రైపోర్ట్

తెలంగాణలో డ్రై పోర్టును నిర్మించి వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని.. రాష్ట్రానికి తీర ప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ భేటీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. "తెలంగాణ అంటేనే బిజినెస్.. భారీ వ్యాపార అవకాశాలున్న రంగాల్లో పెట్టుబడులతో రండి.. పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతుంది" అని రేవంత్ పేర్కొన్నారు. ప్రపంచస్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యసాధనకు సహకరించాలని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశాలు హైదరాబాద్‌లో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్తు వాహనాలపై తాము ప్రత్యేకంగా దృష్టి సారించామని.. ఆ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశామని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజారవాణా వ్యవస్థలో 3 వేల విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. అనంతరం నిర్వహించిన మరో సమావేశంలో.. ట్రిలియన్ మొక్కలు నాటడమే లక్ష్యంగా ఏర్పడిన 'ట్రిలియన్ ట్రీ ఉద్యమా'నికి సీఎం మద్దతు తెలిపారు. ఇందులో భాగస్వామిని అవుతానంటూ ప్రమాణం చేశారు.



దావోస్‌లో బిల్‌గేట్స్‌తో భేటీ అయిన చంద్రబాబు

మాతో చెయ్యి కలపండి!

- ఏఐ వర్సిటీ సలహా మండలిలో చేరండి
- బిల్‌గేట్స్‌తో ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య, విద్య ఆవిష్కరణల కేంద్రంగా మార్చేందుకు సహకరించాలని ప్రపంచ ఐటీ దిగ్గజం, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఏపీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్, డయాగ్నస్టిక్స్‌ను ప్రారంభించాలని, ఈ కేంద్రం ప్రజలకు అధునాతన ఆరోగ్య సదుపాయాలు అందించేలా తీర్చిదిద్దాలన్నారు. దావోస్‌లో బిల్‌గేట్స్‌తో సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. బుధవారం దావోస్ ప్రొమెనేడ్ మైక్రోసాఫ్ట్ కేఫ్‌లో ఈ భేటీ జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు తమపై నమ్మకంతో మైక్రోసాఫ్ట్ ఐటీ కేంద్రాన్ని నెలకొల్పడంతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయిన విషయాన్ని బిల్‌గేట్స్‌కు చంద్రబాబు గుర్తుచేశారు. ఏపీలో ఏర్పాటు చేయనున్న కృత్రిమమేధ యూనివర్సిటీ సలహాదారుల మండలిలో భాగస్వామ్యం కావాలని గేట్స్‌ను చంద్రబాబు ఆహ్వానించారు. అంతర్జాతీయ ఆవిష్కరణలను స్థానికంగా వినియోగించుకునేలా బిల్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



చిరిగిన చొక్కాతో కాంగ్రెస్ కార్యకర్త

యూత్ కాంగ్రెస్ నేతల బాహాబాహీ

- గాంధీభవన్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో బుధవారం జరిగిన యూత్ కాంగ్రెస్ సమావేశం రసాభాసగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా చీకటి కార్తీక్ ఎన్నికపై ఆ జిల్లాకు చెందిన పలువురు నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వివాదం రాజుకుంది. చీకటి కార్తీక్‌కు 40 ఏళ్లు ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా ఆయన్ను అధ్యక్షునిగా ఎలా ఎన్నిక చేశారంటూ సమావేశంలో ఆ నేతలు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే పదవులు ఇచ్చారని, ముందు నుంచీ కాంగ్రెస్‌లో ఉన్న నేతలను పట్టించుకోలేదని మండిపడ్డారు. తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సురభి ద్వివేదీ.. డబ్బులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా అధ్యక్ష నియామకం జరిపారని ఆరోపించారు. ఈ సందర్భంగా కా ర్తీక్ వర్గీయులకు, అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారి మధ్య ఘర్షణ జరిగింది. గాంధీభవన్ ఆవరణలో ఇరువర్గాల వారూ బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపిస్తూ తీవ్రంగా కొట్టుకున్నారు. చివరికి పోలీసులు, చుట్టుపక్కల ఉన్న నేతలు జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని సముదాయించారు. అయితే గాంధీభవన్‌లో గొడవ జరగడంపై ఆరా తీసిన టీపీసీసీ అధ్యక్షుడు.. ఈ ఘటన పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన విదేశీ పర్యటన నుంచి వచ్చాక పూర్తి వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకోనున్నారు. ఈ గొడవపై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి స్పందిస్తూ.. ఎన్నిక నిబంధన ప్రకారమే జరిగిందన్నారు.

ఆబ్కారీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి జూపల్లికి టీజీవో వినతి

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆబ్కారీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో).. మంత్రి జూపల్లి కృష్ణారావుకు బుధవారం వినతి పత్రం అందజేసింది. సచివాలయంలో మంత్రిని కలిసిన టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎ. సత్యనారాయణ, సహాధ్యక్షుడు బి.శ్యామ్, కేంద్ర కమిటీ సభ్యులు పలు సమస్యలను మంత్రికి వివరించారు.

రూ.1800 కోట్లతో ఏదుల-ఉల్పర లింక్

16 కి.మీ.ల టన్నెల్‌తో కలిపి 21 కి.మీ.ల మేర కాలువ పనులు .. పోతిరెడ్డిపల్లి వద్ద దుందుభిపై రబ్బర్‌డ్యామ్

- పరిపాలనపరమైన అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు.. జీవో జారీ

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. ఏదుల నుంచి-ఉల్పర దాకా లింక్ పనులకు రూ.1800.62 కోట్లతో ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతులను మంజూరు చేసింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం జీవో జారీ చేశారు. ఈ నిధులతోనే పోతిరెడ్డిపల్లి వద్ద దుందుభి నదిపై ముంపు లేకుండా రబ్బర్‌డ్యామ్ కట్టనున్నారు. డిండి ఎత్తిపోతల పథకం కింద ఏదుల నుంచి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే, కచ్చితంగా ఎక్కడి నుంచి నీటిని తరలించాలనే దానిపై తాజాగా మంత్రివర్గ సమావేశంలో స్పష్టత ఇచ్చారు. దీని ప్రకారం.. ఏదుల నుంచి 2.525 కి.మీ.ల మేర ఓపెన్ కెనాల్, 16 కి.మీ.ల మేర టన్నెల్, ఆ తర్వాత మరో 3.050 కి.మీ.ల ఓపెన్ కెనాల్ నిర్మించి నీటిని దుందుభి నదిలోకి తీసుకెళ్తారు. ఆ నీటిని మళ్లించేలా పోతిరెడ్డిపల్లి గ్రామం వద్ద రబ్బర్ డ్యామ్ నిర్మిస్తారు.

పెండింగులో హెడ్‌వర్క్స్ పనులు

డిండి ఎత్తిపోతలలో ఇప్పటిదాకా ఏడు ప్యాకేజీలకు టెండర్లు పిలిచి పనులు చేపట్టగా, హెడ్‌వర్క్ (ఏదుల-పోతిరెడ్డిపల్లి లింక్) పనులు మాత్రం ప్రారంభించలేదు. డిండి ఎత్తిపోతల ప్రతిపాదన వచ్చిన సమయంలోనే శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ద్వారా నీటిని తరలించాలని భావించారు. ఆ తర్వాత ఏదుల నుంచి తరలించాలనే ప్రతిపాదన కూడా రాగా... గత ఏడాది మార్చి 13వ తేదీన ఏదుల నుంచి పోతిరెడ్డిపల్లి దాకా లింక్‌కు ఆమోదముద్ర వేశారు. ఈ అలైన్‌మెంట్‌కు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) కూడా ఆమోదం తెలిపింది. ఈ పథకంలో భాగంగా పోతిరెడ్డిపల్లి వద్ద రబ్బర్ డ్యామ్‌తో పాటు సింగరాజు పల్లి, గొట్టిముక్కల, ఇర్విన్, ఎర్రవల్లి-గోకారం, చింతపల్లి, కిష్టారంపల్లి, శివన్నగూడెంలో రిజర్వాయర్లు కట్టనున్నారు. సింగరాజుపల్లి రిజర్వాయర్ పనులు 85 శాతం దాకా పూర్తికాగా... గొట్టిముక్కల రిజర్వాయర్ పనులు 98 శాతం మేర, ఎర్రవల్లి-గోకారం పనులు 26 శాతం, కిష్టారం పల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ పనులు చెరో 70 శాతం మేర పూర్తయ్యాయి. కాగా, ఈ ప్రాజెక్టుకు మొత్తం 16,030 ఎకరాలకు గాను 12,052 ఎకరాలను సేకరించారు.

60 రోజుల్లో 30 టీఎంసీలు తరలించేలా...

రోజుకు 0.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీలు తరలించేలా డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపడుతున్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన ఏదుల రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపల్లి దాకా పనులేమీ జరగలేదు. ఈ లింక్‌కు రూ.1800 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేయగా.. మంత్రివర్గం ఆమోదించి, ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతినిచ్చింది. త్వరలోనే ఈ పనులకు టెండర్లు పిలవనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని 7 నియోజకవర్గాల పరిధిలో 228 గ్రామాలకు తాగునీటితో పాటు 3.61 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడానికి వీలుగా ఈ పథకాన్ని చేపట్టిన విషయం తెలిసిందే.

గోదావరి-కృష్ణా వరదలపై అధ్యయనం

- ఐఐటీ రూర్కీ హైదరాబాద్‌తో స్టడీ
- రాష్ట్రాల సమన్వయంతో గేట్ల ఆపరేషన్
- ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నిర్ణయం

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వరదల సమయంలో ప్రభావిత రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ సత్వర చర్యలు తీసుకోవడానికి వీలుగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ డ్యామ్ సేఫ్టీ కమిటీలు నిర్ణయించాయి. బుధవారం వర్చువల్‌గా ఈ సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ (జనరల్), స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో) ఛైర్మన్ జి.అనిల్‌కుమార్, ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) జి.విజయభాస్కర్‌రెడ్డి, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చీఫ్ ఇంజనీర్ విజయ్ ఘాగరే, సీడబ్ల్యూసీ డైరెక్టర్ (సౌత్-హైడ్రాలజీ) నిత్యానంద రాయ్, కర్ణాటక జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ మంజునాథ్, ఏపీ జలవనరుల శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజేంద్రప్రసాద్, ఓయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.రాజశేఖర్, జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.శ్రీనివాసులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య వరదలపై కచ్చితమైన సమాచార మార్పిడి లేక ప్రాజెక్టుల నిర్వహణ, గేట్ల ఆపరేషనల్ ప్రొటోకాల్‌లో ఇబ్బందులొస్తున్నాయని గుర్తించారు. మహారాష్ట్రలో ఆకస్మిక వరదలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకింద ఉన్న కాళేశ్వరంలోని ప్యాకేజీ-21కు చెందిన పంప్‌హౌస్ నీట మునిగిందని, విజయవాడ కూడా వరదలతో ప్రభావితమైందని, మహారాష్ట్రలోని నాందేడ్ కూడా ఎస్ఆర్ఎస్పీలో వరదల సమయంలో గేట్లు ఎత్తకపోవడంతో ముంపునకు గురైందని గుర్తించారు. దీని కోసం గోదావరి, కృష్ణా నదుల క్యాచ్‌మెంట్ ఏరియాలో ఫ్లడ్ రూటింగ్‌పై ఐఐటీ -హైదరాబాద్, ఐఐటీ-రూర్కీతో అధ్యయనం చేయించి, ప్రాజెక్టుల గేట్ల ఆపరేషనల్ ప్రొటోకాల్‌ను ఖరారు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రియల్ టైమ్ రెయిన్‌ఫాల్ డాటాను రాడార్, శాటిలైట్ ఆధారంగా పంచుకోవడం, అత్యాధునిక విధానాలతో గేట్ల ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. వాతావరణ మార్పుల సమాచారం ఆధారంగా రిజర్వాయర్ల నిర్వహణ చేపట్టాలని గుర్తించారు. కాగా, ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని పెద్దవాగు మధ్యతరహా ప్రాజెక్టు నిరుడు జూలై 18న వరదలతో కట్టతెగిన విషయం విదితమే. ఈ ప్రాజెక్టు స్పిల్‌వే సామర్థ్యం పెంచాలని నిర్ణయించారు. జాతీయ ఆనకట్టల భద్రతసంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) సిఫారసుల అనంతరమే మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు/పునరుద్ధరణ చేపట్టాల ఈ భేటీలో నిర్ణయించారు. రాష్ట్రంలో వానాకాలానికి ముందు, వానాకాలం తర్వాత ప్రాజెక్టుల స్థితిగతులపై నిర్ణీత వ్యవధిలోగా నివేదికలను సిద్ధం చేసి, ధర్మపోర్టల్ (ఎన్‌డీఎస్‌ఏ) పొందుపరచాలని నిర్దేశించారు.

ఉద్యోగాల పేరిట దందా!

- చండీగఢ్‌లో భారీ మోసం
- తెలుగు యువతీయువకులే టార్గెట్

ఖమ్మం క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో సామాజిక మాధ్యమాల్లో పరిచయం చేసుకొని మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠా విషయం బుధవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. చండీగఢ్ రాష్ట్రంలోని మొహాలీ కేంద్రంగా బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ క్రియేషన్స్‌లో ఉద్యోగాల పేరుతో కొందరు అక్కడ ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల వారిని లక్ష్యంగా చేసుకుని ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఎరవేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆ పోస్టులను చూసి తెలుగు రాష్ట్రాల నుంచి అక్కడికి వెళ్లిన యువతీయువకులు మోసపోయి తిరిగి వస్తున్నారు. ఉచితంగా జాబ్ ఇస్తామని చెప్పి అక్కడికి రప్పించిన తర్వాత ఐదు రోజుల శిక్షణ పేరుతో రూ.3 వేలు గుంజుతున్నారు. అది పూర్తయిన తర్వాత రూ.70 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. డబ్బు చెల్లించలేని స్థితిలో ఉన్నవారిని బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇబ్బందులు తట్టుకోలేక ఎవరైనా రూ.70 వేలు చెల్లించినా.. గొలుసుకట్టు తరహాలో మరో ఐదుగురి చేత రూ.70 వేలు కట్టించాలని డిమాండ్ చేస్తున్నారు. అలా డబ్బు కట్టిస్తే ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు కమీషన్‌గా చెల్లిస్తామని చెబుతున్నారు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిని కొట్టడం, బంధించడం వంటివి చేస్తున్నారు. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, విశాఖపట్నం, గుంటూరు జిల్లాలకు చెందిన అనేక మంది ఇందులో ఇరుక్కున్నారు. వారిలో కొంతమంది అక్కడినుంచి పారిపోయి బుధవారం రాత్రి ఖమ్మం చేరుకుని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఒంటరి మహిళలే లక్ష్యం!



కిడ్నీకి రూ.25 లక్షలు.. దాతకు రూ.4 లక్షలే..!!.. పరారీలో వైద్యులు.. సూత్రధారులెవరు?

- దక్షిణాదిలో ఆర్‌ఎంపీలే ఏజెంట్లు
- ఇతర రాష్ట్రాల యూరాలజిస్టుతో సర్జరీలు
- నెల క్రితం శస్త్రచికిత్స వికటించి మహిళ మృతి!

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అలకనంద ఆస్పత్రిలో కిడ్నీరాకెట్ లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కిడ్నీలు అవసరమైన ధనికులను గుర్తించేందుకు దక్షిణాది రాష్ట్రాల ఆర్‌ఎంపీలను ఏజెంట్లుగా మార్చుకున్న ఈ ముఠా.. ఒంటరి మహిళలనే టార్గెట్‌గా చేసుకుంటూ.. వారి కిడ్నీలను సేకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆస్పత్రి యజమాని సుమంత్ గట్టుపల్లి రష్యాలో ఎంబీబీఎస్ చదివి.. సులభంగా డబ్బు సంపాదించేందుకు కిడ్నీ రాకెట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో ఆర్నెల్ల క్రితం సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలో అలకనంద మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించి.. ఇప్పటి వరకు 20కి పైగా మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

సుమంత్ ముఠా ఒంటరి మహిళలనే టార్గెట్‌గా చేసుకుని, కిడ్నీ రాకెట్‌ను నడుపుతున్నట్లు తెలుస్తోంది. భర్త వదిలివేసిన వారు.. పలు కారణాలతో కుటుంబాలతో దూరంగా ఉంటున్న వారు.. వితంతువులను గుర్తించి, వారు మూత్రపిండాలను దానం చేసేందుకు ఈ ముఠా ఏజెంట్లు వ్యవహారాన్ని నడుపుతారని పోలీసులు గుర్తించారు. మంగళవారం నాటి దాడుల్లో గుర్తించిన ఇద్దరు మహిళలు ఒంటరివారే కావడం గమనార్హం..! ఈతాకు ఇచ్చి.. తాటాకు దోచుకున్న చందంగా దాతలకు ఈ ముఠా ఇచ్చేది రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలే..! అయితే.. కిడ్నీలు కావాల్సిన వారి నుంచి మాత్రం ముక్కు పిండి మరీ రూ.25 లక్షలు వసూలు చేస్తారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. కిడ్నీలు కావాల్సిన వారిని గుర్తించేందుకు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన కొందరు ఆర్‌ఎంపీలను ఏజెంట్లుగా నియమించుకున్న ఈ ముఠా.. సర్జరీలకు కూడా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యూరాలజిస్టులను నియమించుకున్నట్లు తెలిసింది. కాగా.. నెల రోజుల క్రితం చౌటుప్పల్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ కిడ్నీ సంబంధిత వ్యాధితో అలకనంద ఆస్పత్రిలో చేరారు. ఆమెకు వైద్యులు శస్త్రచికిత్స చేయగా.. వికటించి, ఆమె మృతిచెందారనే ఆరోపణలున్నాయి.

నోరు మెదపని సుమంత్

ఈ కేసులో సుమంత్‌తో పాటు.. మరో ఇద్దరు అరెస్టవ్వగా.. వారిని విచారించేందుకు రాచకొండ పోలీసు కమిషనర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాల్లో సరూర్‌నగర్ పోలీసులతోపాటు.. ఎల్బీనగర్ ఎస్‌వోటీ, సీసీఎస్ సిబ్బంది, అధికారులు ఉన్నారు. అయితే.. పోలీసుల విచారణలో సుమంత్ నోరు మెదపడం లేదని, "అంతా మా లాయర్ మాట్లాడతాడు" అని చెప్పినట్లు సమాచారం. ఎన్ని రోజులుగా ఈ దందా సాగుతోంది? ఎంత మంది వైద్యులకు లింకులున్నాయి? ఇప్పటి వరకు ఎంతమందికి మూత్రపిండాల మార్పిడి చేశారు? దాతలు ఎక్కడెక్కడివారు? అనే ప్రశ్నలకు ప్రత్యేక బృందాలు సమాధానాలను రాబట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో అలకనంద ఆస్పత్రితో పాటు.. పెద్దఅంబర్‌పేటలోని ఓ క్లినిక్‌లో కూడా ఈ ముఠా మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఇక్కడి చట్టాలను ఔపోసన పట్టిన సుమంత్.. మానవ అవయవాల మార్పిడి చట్టం-1995 మేరకు అనుమతులు తెప్పించుకునేవాడని తెలుస్తోంది. చట్టాల్లో లొసుగులతో పనికానిచ్చేవాడని సమాచారం.

వైద్యులకు ఉప్పందించిందెవరు?

రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావుకు వచ్చిన సమాచారంతో ఎల్బీనగర్ జోన్ పోలీసులు, వైద్యాధికారులు మంగళవారం ఈ ఆస్పత్రిపై దాడి చేశారు. ఆ సమయంలో రోగులకు చికిత్స అందిస్తున్న డాక్టర్ పవన్, డాక్టర్ ప్రదీప్, ఇతర సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా పారిపోయారు. దాడులు జరుగుతున్న సమయంలో అధికారుల కళ్లుగప్పి వైద్యులు పారిపోవడం అనుమానాలకు తావిస్తోంది. వారికి ముందే ఎవరైనా సమాచారం ఇచ్చి, తప్పించారా? ఆస్పత్రి సీసీకెమెరాల ఫుటేజీని ఎందుకు పరిశీలించడం లేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే.. సీసీకెమెరాల ఫుటేజీని సేకరించేందుకు మంగళవారం రాత్రే పోలీసులు డీఎంహెచ్‌వో నుంచి తాళాలు తీసుకున్నట్లు తెలిసింది. ఆస్పత్రిలో ఎలాంటి రికార్డులు లేకపోవడంపై వైద్యాధికారులు షాక్ అయినట్లు తెలిసింది. రికార్డులు అందుబాటులో లేకపోవడంతో.. ఇప్పుడు దర్యాప్తు సాంతం సీసీకెమెరాల ఫుటేజీపైనే ఆధారపడినట్లు స్పష్టమవుతోంది. కాగా.. కిడ్నీరాకెట్ సూత్రధారులు, ఆస్పత్రి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ముందు బుధవారం ధర్నా జరిగింది. 9 పడకలకు అనుమతి తీసుకుని, 30 పడకలను ఏర్పాటు చేసినా.. వైద్య శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ నిలదీశారు.

హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిలు

- సుప్రీంకోర్టు సిఫారసులకు రాష్ట్రపతి ఆమోదం

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ నియామకాలను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. సీనియర్ న్యాయాధికారులుగా పనిచేస్తున్న ఈ తిరుమలదేవి, రేణుక యార, నందికొండ నర్సింగ్ రావు, బీఆర్ మధుసూధన్‌రావును హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి ఈనెల 11న సిఫారసు చేసింది. దానికి తాజాగా రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ తిరుమలదేవి 2026 జూన్ 1 వరకు అదనపు జడ్జిగా వ్యవహరిస్తారు. మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులూ రెండేళ్లపాటు అదనపు జడ్జిలుగా కొనసాగనున్నారు. ఆ తర్వాత శాశ్వత న్యాయమూర్తులుగా పదోన్నతి పొందనున్నారు. ఈ నలుగురు న్యాయమూర్తులు 25న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైకోర్టులో మొత్తం 42 మంది న్యాయమూర్తులకు.. తాజా నియామకాలతో కలిపి ప్రస్తుతం 30కి సంఖ్య పెరిగింది.

వైవీ సుబ్బారెడ్డి మా భూములు ఆక్రమిస్తున్నారు

- పోలీసులు సహకరిస్తున్నారు.. హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, ఆయన భార్య స్వర్ణలతా రెడ్డి తమ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, ఈ అంశంలో పోలీసులు వారికి సహకరిస్తున్నారని పేర్కొంటూ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. కొప్పుల మల్లారెడ్డి, జీ నర్సింహారెడ్డి, షేక్ ఇస్లాముద్దీన్ అనే వ్యక్తులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామ పరిధి సర్వే నెంబర్ 87లోని 5.04 ఎకరాల భూమిపై తమకు అనుకూలంగా సివిల్ కోర్టు తీర్పు ఉన్నా పోలీసులు అండతో సుబ్బారెడ్డి దంపతులు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని పిటిషనర్లు ఆరోపించారు. వైవీ సుబ్బారెడ్డి దంపతుల తరఫున సీనియర్ న్యాయవాది వివేక్ రెడ్డి వాదిస్తూ.. సదరు భూమిపై తమకే టైటిల్ ఉందని, రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా భూమి కొనుగోలు చేశారని తెలిపారు. పిటిషనర్ల దగ్గర ఎలాంటి రిజిస్టర్డ్ పత్రాలు లేవన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ సివిల్ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోరాదని.. అయితే శాంతిభద్రతలకు భంగం కలిగితే చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేసింది.

కిడ్నీ.. రూ. 25 లక్షలు!

(మొదటిపేజీ తరువాయి)

ఇతరులకు అమర్చి సొమ్ము చేసుకున్న వారు అక్షరాలా రూ.25 లక్షలు సంపాదించుకున్నారు. హైదరాబాద్‌లో బట్టబయలైన అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్‌లో వెలుగు చూసిన సంచలన అంశమిది. ఈ వ్యవహారంలో కిడ్నీలు దానమిచ్చిన ఇద్దరు మహిళలకు చెరో నాలుగు లక్షలు ఇవ్వగా.. కిడ్నీలు అమర్చుకున్న వారి నుంచి మాత్రం మొత్తం రూ.50 లక్షలు వసూలు చేశారు. ఇదంతా దళారులు, ఆస్పత్రుల జేబుల్లోకి వెళ్లినట్లు తేలింది. ఈ కిడ్నీ రాకెట్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. వనస్థలిపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేంద్ర సారథ్యంలో ఏర్పాటైన ఈ కమిటీలో డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ సాధన రాయ్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ అలకనంద ఆస్పత్రిని సందర్శించింది. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ దాతలు, గ్రహీతలతో కూడా మాట్లాడింది. ప్రాథమిక నివేదికను వైద్యవిద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ వాణికి ఇచ్చింది. అనంతరం డీఎంఈ ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదికను ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. అలకనంద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి గుర్తింపు రద్దు చేయడమే కాకుండా సీజ్ చేసింది. ఈ వివరాల్ని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇతర రాష్ట్రాలకు చెందిన అమాయకులకు డబ్బులు ఆశ చూపి, ఇతర ప్రాంతాల నుంచి డాక్టర్లను తీసుకువచ్చి కిడ్నీ మార్పిడి చికిత్సల ద్వారా డబ్బులు దండుకుంటున్నట్లు వెల్లడైంది. అలకనంద ఆస్పత్రిలో జరుగుతున్న అక్రమ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మాకు సమాచారం ఇవ్వగానే అధికారులను ఆస్పత్రి వద్దకు పంపించాం. స్థానిక పోలీసులకు కూడా సమాచారం ఇచ్చాం. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురిలో ఇద్దరు తమిళనాడు, మరో ఇద్దరు కర్ణాటకకు చెందిన వారు. భాషాపరమైన ఇబ్బందులు ఎదురైనప్పటికీ.. వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నాం. కిడ్నీ మార్పిడి చేయించుకున్న ఇద్దరు.. తొలుత అధికారుల్ని తప్పుదోవ పట్టించే విధంగా అపెండెక్స్ చేయించుకున్నట్లు బుకాయించారు. కానీ, వైద్యులు గట్టిగా అడిగి చెకప్ చేయగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నామని వారు ఒప్పుకున్నారు' అని డాక్టర్ వెంకటేశ్వరరావు వెల్లడించారు. అలకనంద ఆస్పత్రిలో యూరాలజీ డిపార్ట్‌మెంట్ నడిపేందుకు పర్మిషన్ లేదని తెలిపారు. ఆస్పత్రికి తొమ్మిది పడకలకు మాత్రమే అనుమతి ఉందని, కానీ, 35 పడకలుగా నడుపుతున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. అలకనంద ఆస్పత్రి యజమాని సుమంత్‌ని పోలీసులు అరెస్టు చేశారని, సుమంత్ డాక్టర్ కాదని తెలిపారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన డాక్టర్ల పేర్లను సుమంత్ చెప్పడం లేదన్నారు.



గాంధీ ఆస్పత్రి యూరాలజీ వార్డులో బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న విచారణ కమిటీ సభ్యులు

నిరక్షరాస్యులే టార్గెట్‌గా కిడ్నీ రాకెట్

అలకనంద ఆస్పత్రిలో కిడ్నీలు విక్రయించిన ఇద్దరు మహిళలు నస్రీంబాను (38), ఫీరోజ్‌బాను (45) తమిళనాడులోని ఈరోడ్, చెన్నైకు చెందినవారుగా ప్రాథమిక విచారణలో తేలింది. నస్రీం ఇళ్లలో పని చేస్తుండగా, ఫీరోజ్ టైలరింగ్ పనులు చేస్తున్నట్లు వెల్లడైంది. వీరిద్దరూ భర్తలు దూరమైన ఒంటరి మహిళలు. ఓవైపు పిల్లల పోషణ, మరోవైపు ఉన్న అప్పుల కారణంగా మూత్రపిండాలను అమ్ముకునేందుకు వీరు అంగీకరించినట్లు సమాచారం. ఇద్దరూ పూర్తి నిరక్షరాస్యులు కావడంతో చాలా తేలిగ్గా వారిని దళారులు టార్గెట్ చేశారు. జనవరి 16న వీరు హైదరాబాద్ వచ్చి ఆస్పత్రిలో చేరారని, మరుసటి రోజు శస్త్రచికిత్స అయినట్లు అధికారులు గుర్తించారు. వీరి నుంచి కర్ణాటకకు చెందిన లాయర్ రాజశేఖర్ (67), నర్సు కృపాలత (48) కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకున్నట్లు తేలింది. ఆపరేషన్‌కు వెళ్లేముందే వీరు చెరో పాతిక లక్షలు చెల్లించినట్లు గుర్తించారు. వీరు ఇచ్చిన రూ.50 లక్షల్లో కిడ్నీలు ఇచ్చిన ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఇద్దరికీ రూ.8 లక్షలు చెల్లించినట్లు విచారణలో గుర్తించారు. ఇక వీరికి సర్జరీ ఎవరు చేశారన్నది ఇంకా తేలాల్సివుంది. విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత ఆ ఇద్దరు మహిళలను, లాయర్, నర్సులను గాంధీ ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వీరితో మాట్లాడటానికి తమిళం, కన్నడం తెలిసిన ఓ పీజీ మెడికో సాయం తీసుకున్నారు. మరోవైపు, ఈ కేసులో సుమంత్‌తో పాటు.. మరో ఇద్దరు అరెస్టవ్వగా.. వారిని విచారించేందుకు రాచకొండ పోలీసు కమిషనర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

సర్జరీ చేసింది ఎవరు?

ఈ శస్త్రచికిత్స వ్యవహారంలో సర్జరీ చేసింది ఎవరు అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. సర్జరీ చేసిన వైద్య బృందం ఢిల్లీ నుంచి వచ్చినట్లుగా కిడ్నీలు ఇచ్చిన మహిళలు చెబుతున్నారు. అలకనంద ఆస్పత్రి డాక్టర్ గుంటుపల్లి సుమంత్, డాక్టర్ సుదీప్ పేరిట రికార్డుల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా వీరిద్దరూ ఒకరు చైనాలో, మరొకరు రష్యాలో ఎంబీబీఎస్ చేసినట్లు సమాచారం. నిబంధనల మేరకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను యూరాలజిస్టులు మాత్రమే చేయాలి. కానీ అలకనంద ఆస్పత్రి రికార్డుల్లో ప్లాస్టిక్ సర్జన్ పేరు ఉండటంతో అసలు సర్జరీ ఎవరు చేశారన్నది తేల్చలేకపోతున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని చెబుతున్నారు. బాధ్యులైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించినట్లు సమాచారం. అక్రమ కిడ్నీ మార్పిడి వ్యవహారాన్ని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సుమోటోగా తీసుకుంది. బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. పోలీసుల సహకారంతో ఎథికల్, మాల్‌ప్రాక్టీస్ కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరుపుతామని వెల్లడించింది. అలకనంద కిడ్నీ రాకెట్ వెనుక కార్పొరేట్ ఆస్పత్రుల హస్తం ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడో సర్జరీ చేసి ఇక్కడ ఉంచారన్న సందేహాలను పలువురు యూరాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయాలు వద్దు.. వివరాలు చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడేందుకు ప్రయత్నించగా.. 'రికార్డుల్లో ఏం ఉందో అదే అంతిమం. దాన్నెవరూ మార్చలేరు' అని కమిషన్ స్పష్టం చేసింది. దీంతో తుమ్మిడిహెట్టి వద్ద తెలంగాణ అవసరాలు తీర్చేంత నీటి లభ్యత లేదని గుర్తించి, మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టారని ప్రకాశ్ చెప్పారు. తెలంగాణలో 13 జిల్లాల కోసం 200 టీఎంసీల నీటి అవసరాలు ఉండేవని తెలిపారు. అయితే, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించడమే ఉత్తమమని విశ్రాంత ఇంజనీర్లతో కూడిన నిపుణుల కమిటీ 2015 ఏప్రిల్‌లో ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయాన్ని కమిషన్ గుర్తుచేసింది. ప్రతిపాదిత మేడిగడ్డ బ్యారేజీ అనవసరమని కమిటీ చెప్పిందనీ పేర్కొంది. దీనికి ప్రకాశ్ సమాధానమిచ్చేందుకు ప్రయత్నించగా, టీఎస్‌ఐడీసీ ఛైర్మన్‌గా నియమితులయ్యే నాటికే ఈ కమిటీ ఏర్పడినందున, మీ సమాధానం అక్కర్లేదని కమిషన్ స్పష్టం చేసింది. చాలా మంది కమిషన్ ముందు హాజరై తప్పుడు సమాచారం ఇచ్చారని, కమిటీ కూడా 105 మీటర్ల ఎత్తుతో మేడిగడ్డ కట్టాలని సిఫారసు చేయగా.. ముంపు ఉంటుందని నాటి ప్రభుత్వం 100 మీటర్లకే పరిమితం చేసిందని ప్రకాశ్ తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన 7వ బ్లాక్‌ను ఏం చేస్తే బాగుంటుందని కమిషన్ ప్రశ్నించగా.. మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని, అది సాధ్యం అవుతుందని చెప్పారు. ఇంకా చెప్పబోతుండగా.. కమిషన్ కల్పించుకొని 'టెక్నికల్ అంశాలతో మీకు సంబంధం లేదు. ఇంజనీర్లకు వదిలేయండి' అని సూచించింది. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నీటి లభ్యతతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ సలహాదారుడు వెదిరె శ్రీరామ్, జేఏసీ నేత రఘు, ఎమ్మెల్సీ కోదండరామ్ అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి గ్రావిటీ ప్రాజెక్టు కాదని, ఆ ప్రాజెక్టులోనూ రెండుచోట్ల నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుందని, మేడిగడ్డలో మూడుచోట్ల పంపింగ్ అవసరమని చెప్పారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు నిపుణుల కమిటీపై సీఎం రేవంత్ రెడ్డి శాసనసభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. మేఘా సంస్థ కమీషన్ల కోసమే అదనపు టీఎంసీ పనులు చేశారనడం సరికాదని చెప్పారు. గురువారం సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ సంస్థ 'నవయుగ ఇంజనీరింగ్' ప్రతినిధులను కమిషన్ ప్రశ్నించనుంది.

సహించలేకే చేయి చేసుకున్నా

- వ్యవస్థలు నిస్తేజంగా మారడంతో తప్పలేదు
- పేదల భూముల్లోకి కబ్జాదారులు వస్తే చూస్తూ ఊరుకోం
- పోలీసులు, ఐఏఎస్‌లు బానిసల్లా పని చేయవద్దు: ఈటల



హైదరాబాద్/ఘట్‌కేసర్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ, ఎవరి మీదా దాడికి పాల్పడలేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. చట్ట ప్రకారం పనిచేయాల్సిన వ్యవస్థలు నిస్తేజంగా మారడంతో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని చూడలేకే చేయి చేసుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రెండు, మూడు దశాబ్దాల క్రితం పేదలు కొనుక్కున్న భూములను రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, కబ్జాదారులు గద్దల్లా తన్నుకుపోతున్నారని వ్యాఖ్యానించారు. పోలీసులు, ఐఏఎస్ అధికారులు బానిసల్లా పని చేయొద్దని, చట్టానికి కట్టుబడి పని చేయాలని హితవు పలికారు. పేదల ఆస్తుల్లోకి వచ్చి కబ్జాలకు పాల్పడినా, నిర్మాణాలు చేసినా బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల ఏకశిలానగరంలో 1985లో వేసిన లేఅవుట్‌లో 2076 మంది 200 గజాల చొప్పున స్థలం కొనుగోలు చేశారని చెప్పారు. ఈ భూమిని ఆక్రమించేందుకు కొంత మంది కబ్జాదారులు గూండాలను పెట్టి నిజమైన భూ యజమానులపై దాడులకు పాల్పడుతున్నారని వివరించారు. సర్వే నంబరు 739, 749లో 149 ఎకరాల్లో లేఅవుట్ వేశారని, ఈ భూమిపై 2005 వరకు ఎలాంటి వివాదాలు లేవని ఈటల చెప్పారు. ఎంఏ రాజు, ఎ.వెంకటేష్, ఎ.విజయభాస్కర్ అనే ముగ్గురు వ్యక్తులు గతంలో భూమి అమ్మిన వ్యక్తి నుంచే సేల్ డీడ్ రాయించుకుని 47ఎకరాల భూమి తమదేనంటూ పేదల భూముల్లోకి వచ్చారని ఆరోపించారు. భూ అక్రమాలను నిలువరించేందుకు, పేద ప్రజల ఆస్తులను కాపాడేందుకు కమిటీ వేయాలని ఎంపీ ఈటల డిమాండ్ చేశారు. హైదరాబాద్ పరిసరాల్లో జరిగిన భూ ఆక్రమణల వివరాలతో త్వరలో సీఎంను కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు.

ఎంపీ ఈటలపై కేసు నమోదు

పోచారం పరిధిలోని ఏకశిలానగర్ వెంచర్ వద్ద సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్న వారిపై దాడి చేసినందుకు ఎంపీ ఈటలతోపాటు ఆయన అనుచరులపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేశారు. సెక్యూరిటీ గార్డు ఉపేందర్ ఫిర్యాదు మేరకు ఈటల రాజేందర్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శివారెడ్డి, జుబేర్ అక్రమ్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు వర్మ తెలిపారు.



మాట్లాడుతున్న వెంకటేష్, భాస్కర్

నిజాలు తెలుసుకుని మాట్లాడాలి

- ఈటల సమయమిస్తే వివరాలు చెప్తాం
- కొర్రెములలోని 47.25 ఎకరాల భూమి మాదే
- 'శ్రీహర్ష' భాగస్వాములు వెంకటేష్, భాస్కర్

పంజాగుట్ట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అనుచరులతో కలిసి తమ భూమిలోకి వచ్చి అక్కడున్న వారిపై దాడి చేయడం సరికాదని భూమి యజమానులు, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ భాగస్వాములు ఆలూరి వెంకటేష్, ఆలూరి విజయభాస్కర్ అన్నారు. ఈ విషయంలో ఈటలను కొంతమంది రియల్ ఎస్టేట్ బ్రోకర్లు తప్పుదోవ పట్టించారని, ఆయన వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని కోరారు. ఈటల సమయమిస్తే పూర్తి వివరాలు వెల్లడిస్తామని, కోర్టు తీర్పులను కూడా ఆయన పరిశీలించాలన్నారు. వారు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మునిసిపాలిటీ పరిధి కొర్రెముల గ్రామంలోని సర్వే నంబర్లు 739, 740, 741, 742లో తమకు 47.25 ఎకరాల భూమి ఉందని చెప్పారు. పక్క సర్వే నంబర్లు 743, 744, 745, 747కు చెందిన వారిలో కొంత మంది తమ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 2005లో తాము ఈ 47.25 ఎకరాల భూమి కొన్నామని, దీనిపై కొంతమంది కోర్టులకు వెళ్లినా ఏళ్ల తరబడి పోరాటం తర్వాత తమకు అనుకూలంగా తీర్పులు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు ఆ భూమిని ప్లాట్లుగా చేయలేదని, ఇక్కడ రెండు వేల ప్లాట్లు ఉన్నాయని జరుగుతున్న ప్రచారం అవాస్తమని చెప్పారు. సర్వే నంబర్లు 743, 744, 745, 747లో వేసిన అక్రమ లే అవుట్‌లను హైకోర్టు ఆదేశాలతో అధికారులు రద్దు చేశారని తెలిపారు. తమను రౌడీలు, గుండాలుగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని భూమికి రక్షణ కల్పించడంతో పాటు తమపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.